
# కచ్ఛపీ కింకిణీకం



నండూరి రామ కృష్ణమాచార్య

# కచ్ఛపీ కింకిణీకం

రచయిత

నండూరి రామ కృష్ణమాచార్య

ప్రచురణ

ఆచార్య ఫణీంద్ర - కార్యదర్శి

డా॥ నండూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం

420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు - 500 003,

ఫోను : 27817397.

కచ్ఛపీ కింకిణీకం **KACCHAPEE KINKINEEKAM**

పద్య కవితలు **POEMS**

రచన : నండూరి రామ కృష్ణమాచార్య
Author : Nanduri Rama Krishnamacharya

© Author

First Edition : 2003 మొదటి ముద్రణ

వెల రూ॥ **100/-** Price **Rs. 100/-**

*ప్రచురణ:* డా॥ నండూరి రామ కృష్ణమాచార్య సాహిత్య పీఠం
420 పి.జి. రోడ్డు, జవాహరు నగరు, సికింద్రాబాదు - 500 003,
ఫోను : 27817397.

Dr. Nanduri Rama Krishnamacharya Literary Peetam
P.G. Road, Jawahar Nagar,
Secunderabad - 500 003.

**Copies : 1000** ప్రతులు : 1000

*ముద్రణ Printing*
బాల్‌రెడ్డి ప్రెస్ Balreddy Press
1-4-140, కళాసి గూడ, సికింద్రాబాదు - 500 003.
Kalasiguda, Secunderabad.
ఫోన్ : 27813343, 55318595

---

**Patron : Sri K. Sagar Rao**

కృతిపతి : శ్రీ కల్లెపు సాగర రావు దొరగారు

---

# "కచ్ఛపీ కింకిణీకం"

## కృతి సమర్పణము

మెచ్చితి వాలోచనమును
ఇచ్చెద నా కింకిణీక కృతి గైకొనుమా,
పచ్చని ఆకుల విచ్చియు
విచ్చని వివి సాగరదొర వినుమాసక్తిన్.

మాట తప్ప నట్టి మేటి మర్యాదతో,
నాటి బలికి ఎవరు నేటి సాటి ?
లేత వెన్నెల వడబోత - సాగర రావు;
అమృత వర్ష ధార - అతని పలుకు

ప్రతిభ వలన పైకి వచ్చె - సాగర రావు
చిన్మయుండు శిష్య శేఖరుండు;
జ్ఞాని - గుర్తు పట్టు శక్తి సామర్థ్యముల్,
జగతి మేలు కోరు ప్రగతి శీలి.

నీతి నెరిగి రాజ నీతి లోతుల తోడ,
నేల మీది వాస్తవాల నెరిగి
క్రమ విధాన నిరతి బ్రదుకు సాగరరావు,
త్రికరణ పరిశుద్ధి తీర్చి దిద్దు.

జనని - మురళి యమ్మ - జగదేక మాతయే;
ఇహము పరము ఆమె హృదిని కలిసె;
సతి సరోజిని గుణవతి పతివ్రత సాధ్వి;
సాగరుండు అమృత శాంతి సరసి.

చిరుత నవ్వు తెలుపు చిన్మయానందమ్ము,
ముగ్ధ మోహనమ్ము మోము నందు,
జ్ఞాన లక్షణమ్ము మౌన జీవన్ముక్తి,
మన్ను మీద పారు మిన్ను టేరు.

పనికి రాదు - గ్రంథ పాండితీ విభవమ్ము,
చదువ వలయు జనుల హృదులు విప్పి,
సంధి మేలు సరస సామరస్యము మేలు,
వ్యర్థ సాహసమ్ము వద్దు వద్దు.

సాగర దొర గారి సహజమ్ముడును గూడ,
నీతి మీద గొప్ప ప్రీతి కలదు,
తెలివి గొప్ప నేర్పు కలదు రామారావు,
ఈవి గలదు రాచఠీవి గలదు.

విద్య యందు ప్రీతి - విజ్ఞాన జిజ్ఞాస,
కలదు సాగర దొర గారి యందు,
అరయ అతడు యోగి - ఆధ్యాత్మ రంగాన,
ధర - ప్రయోజకుండు - ధన్యజీవి.

తెలిసి - ప్రమిద నొకటి వెలిగించితిని - వేగ,
వేల కాగడాలు వెలుగు గాత !
మెదడు తెరచి యుంచు మించు సాగర రావు,
తొలగు గాత చీకటు లిక వేగ.

లక్ష రూక లిచ్చె ! - లలిత సౌహృదముల్తో,
పేర్మి నాదు పేరి పీఠమునకు,
మేలు కలుగ తరతరాల వారికి గూడ,
తెలుగు తల్లి గుండె పులకరించ.

వినయ వంతుడైన - వేత్త సాగర రావు,
విద్య మీద గొప్ప ప్రీతి గలదు,
ఉన్న దతని హృదిని ఒక పరంజ్యోతియే;
చిమ్మ చీకటు లను చెదర గొట్ట.

తెరచి మెదడు గుండె - ధీశాలి శిష్యుపై;
కుదురు కొనుత అనెడి కోర్కి - నాది;
గొప్ప ఛాత్రు డగుచు - కూడె - సాగర రావు;
యోజనర్షి - మరి - ప్రయోజకుండు.

ఆచి తూచి మాటలాడు - సాగర రావు;
బ్రదుకు దేహ మెల్ల మెదడు చేసి;
మెలకువలను తరచు మేధావి - వర్చస్వి;
గుండె పండు గడుసు పిండ మతడు.

వెన్నెల సిరి వెల్లి విరియు దేహము వాడు;
మెరయు కనులు చిన్న మీసకట్టు;
పొట్ట నింప తెలివి పెట్టి పుట్టిన వాడు;
సాగర దొర కెవడు సాటి వచ్చు.

మద్యము విడనాడె - మాంస భక్షణ వీడె,
సత్వ సాధు శీలి - సాగరుండు;
మతము వేరు లేదు - మానవత్వము తప్ప,
అరయ గలడు బొమ్మ బొరుసు కూడ.

హృదయ మందు కలదు చదువుపై ఆసక్తి,
ప్రీతి గొలుపు శాంతి కేతనమ్మున;
చిన్మయత్వ మున్న చిన్నారు లెందరో;
చేరి చదువు కొనెడి వారు కలరు.

'మెత్తని పులి'' - మెదడు మెరపు తీగెల పుట్ట;
మంచి వాడు ధ్యాన మనన శీలి;
నిర్వహణ ధురీణ నేత - సాగర రావు;
వెన్నెల వడబోత వన్నె - ఒడలు.

ఎంచ మంచి వాడటంచు కీర్తిని గాంచి,
సౌమ్య శీలు డంచు సాధు వంచు,
వినయ గుణ చణుండు - వేత్త సాగర రావు,
సత్య సంధుడైన సౌహృదుండు

– నందూరి రామ కృష్ణమాచార్య

# ''కచ్ఛపీ కింకిణీకం''

## బహిరంగ స్వగతం

నా వయస్సు - ప్రస్తుతం ఎనుబది రెండు సంవత్సరాలు. కచ్ఛపీ కింకిణీకం లోని పద్యాలు - ఆట వెలది ముక్తకాలు - చాటు కవితా సమ్మితములు.

నా ప్రథమ కృతి - తారాతోరణంలో వృత్తాలపై నాకు గల అభినివేశం స్వయం వ్యక్తాన్ని చేసింది. తెలుగు వారికి బహుశః వృత్తాలపై మోజు. ఏది అచ్ఛమైన తెలుగు పద్యం ??

''కందం వ్రాసిన వాడే కవి.

(అడవి) పందిని కొట్టిన వాడే బంటు'' అనే సామెత ఏర్పడింది. 'వృత్తం వ్రాస్తేనే కవి సత్తా తెలుస్తుంది'. అనే వారు ఉన్నారు. తెలుగు పద్యకవితకు నా జేజేలు. తెలుగులో అన్ని పద్యాలు హృదయంగమముగా వ్రాసిన వారున్నారు. వేయి సంవత్సరాల వారసత్వం పునాదులు ఉన్నాయి తెలుగు పద్యానికి.

తెలుగు పద్య కవిత - తేనె త్రేన్పుల పంట,
నాద బిందు కళల నాట్యశాల !
ప్రజల హృదుల నూగు గిజిగాని వెఱుగూడు
కూర్మి ఛందమునకు పేర్మి విందు.

తెలుగు పద్యం - మద్యం కంటె ఎక్కువ మత్తు కొలుప గలదు. తెలుగు మాతృ భాష గాని వారు కూడ పలువురు - తెలుగు పద్యాలు వ్రాయుచున్నారు. దేశ భాషలందు తెలుగు లెస్స.

పాలు త్రాగే సమయంలోనే నాకు తెలుగు పద్యం మీద అభిమానం ఏర్పడింది. నాకు తెలుగు పద్యం మీద కల అభిమానం - 'నభూతో నభవిష్యతి' అని ఒకనాడు నేను నమ్మినాను. అయితే నాకు పలుసారులు గర్వ భంగం అయింది. నా శిష్య ప్రముఖుడు - నా కవితా సంహిత - ప్రగతి గీత కావ్యాల కృతిపతి శ్రీ మంతెన వెంకట సూర్య నారాయణ రాజు - రాజ కవి - కవిరాజుగారికి నా కంటె తెలుగు పద్యంపై అభిమానం మిన్నయని నేను గ్రహించాను. తథా మిత్రులు శ్రీ ఏకాంబరాచార్య కవిగారు, సుందర మందస్మిత వదనారవిందుడై - అనేకము పద్యాలు చదువు చున్నప్పుడు విని ఆశ్చర్య చకితుడనై ఆయన గూర్చి "పొట్ట గాదు పద్యాల పుట్ట గాని" అని ఆశుకవిత చెప్పాను.

తథా - శ్రీ మాదాసు పిచ్చయ్య గారు. ఆయన కవి కాడు. కవితయే నూటికి నూరు పాళ్ళు; కరడు గట్టిన కవి. ఆయన ఎందరు కవులనో, సన్మానాలు చేసిన సహృదయ సమ్రాట్టు - నన్ను వారి స్వగ్రామంలో వడ్ల మన్నారు తీసుకొని వెళ్లి స్వర్ణాభిషేకం చేశారు. తన ఉచ్ఛ్వాస నిశ్వాసాలు కవిత చేసి కొన్నవారు కవిగారు గోపాల కిషన్ రావు గారు ఉన్నారు. ఇంజనీరులు శ్రీరంగ స్వామి గాళ్‌గారు తెలుగు చరిత్రలో - కవులను ఆదరించిన సహృదయులు ఎంద రెందరో చిరస్మరణీయులు.

యుగాంతరాలలో కృతిపతులు తెలుగు కవులను అభిమానించారు. రాజ రాజనరేంద్రుడు కవి నన్నయ - అనుతక్కుడు. తిక్కనను - మనుమసిద్ధి మహారాజు 'మామా' యని

సంబోధించినాడు. నిర్వచనోత్తర రామాయణం కృతి స్వీకరించి మల్లారెడ్డి - సేనాని మహారాజు అన్నగా ప్రోలయ వేమారెడ్డికి తన మిత్రుడు ఎఱ్ఱాప్రెగ్గడను సమస్త సంపదలలో మన్నించి బహుకరించినాడు. రత్నాంబరాలతో హేమ పాత్రాన్నములతో - శ్రీనాధుని కవితా రసికులు గౌరవించినారు. ముత్యాలశాలలో దీనారటంకాలతో శ్రీనాథ కవికి జరిగిన స్వర్ణాభిషేకం - తెలుగు తల్లికి పులకింపులు కలిగించినది. శ్రీ కృష్ణ దేవరాయలు సాహితీ సమరాంగణ సార్వభౌముడు - అష్టదిగ్గజ కవులను తన భువన విజయ సౌధంలో నెలకొల్పినాడు. అలమతి విస్తరేణ-

శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణ రాజుగారు.

తెలుగు కృతి పతుల అంశలు పంచుకొని అవతరించిన కవిరాజు - రాజు కవి శ్రీ మంతెన సూర్యనారాయణరాజు గారు. నాకు చూపిన ఆదరాభిమానాలు అనుభవామ్రేడితాలు. ఆయనకు నేను కవితా సంహిత అంకితం చేశాను. నా ఆటవెలది పద్యాలను ఎంత మెచ్చుకొనినా - వృత్తాలపై మోజు పోలేదు. అందుచే ఆటవెలది పద్యాలతో పాటు - వృత్తాలుకూడా ఉన్న నా ప్రగతిగీత కూడ శ్రీవారికి అంకితం చేశాను. శ్రీ సూర్యనారాయణ రాజు కవిగారు నండూరి రామకృష్ణమాచార్య సాహిత్యపీఠానికి రెండు లక్షలు వసూలు చేసి ఇచ్చారు. లోగడ నా కావ్య ప్రచురణ ఇచ్చిన - విరాళాలు కాక. అయనకు సూరయరాజు కవి నామం.

శ్రీ నెమ్మాని సీతారామయ్యగారు 'లేఖావళి' కృతి - (శ్రీ సూరయ్యరాజు కవి రచన) పీఠికలో వ్రాసిన మాట.

"శ్రీ రాజు గారు నండూరి వారికి దొరకిన 'మేరుశిఖరి'';
శ్రీ నండూరి వారు రాజుగారికి దొరికిన ''కవితా శిఖరి''

నేను కవిగా యశస్సు కోసం పడిన ఆరాటం చూచి నేడు నవ్వుకొనుచున్నాను. భీమవరంలో శీర్ణమేఖల వ్రాసినపుడు నేను కవినని విఱ్ఱవీగి తల యెత్తుకొని తిరిగినాను ఒక పది సంవత్సరాలు. తదుపరి నేను ''కవిని'' గానని తెలుసుకోగలిగాను. అయితే అప్పటికే కవిగా నాకు మంచి పేరు వచ్చింది. గుర్తింపు కలిగింది. శ్రీ తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తి - పిపుర నరసాపురం డా॥ పొన్నపల్లి సుబ్రహ్మణ్యం, తాడేపల్లి గూడెం ఈలి ఆంజనేయులు ప్రభృతులు నన్ను ఒక దివ్యాంశ సంభూతుడైన కవిగా చూశారు. అయితే నేను కవిని గానని చెప్పినా నమ్మని వారు చాలమంది వున్నారు గదా. ఎనుబదేండ్లు వయసు మళ్ళిన నన్ను కవిగా మన్నించిన శిష్యులు శ్రీ ఆచార్య ఫణీంద్ర ప్రభృతులు ఉన్నారు.

సాగర రావు గారు నా దగ్గరకు వచ్చి తనను - నా కడగొట్టు శిష్యునిగా చేర్చుకోమని అర్థించారు. కచ్ఛపీ కింకిణీకం అచ్చు వేయుట కొరకై ముప్పదినాలుగు వేల రూపాయలు ఇచ్చారు. అదనంగా "నాపేర వెలసిన సాహిత్య పీఠానికి లక్ష రూపాయలు నగదు విరాళం ఇచ్చారు. ఇంక నేనేమి చేయగలను ?

ఆంధ్ర పద్యకవితా సదస్సు

సహృదయ లోకం నన్ను కవితా కిరీటధారిని చేసింది. ఈ జగన్నాటకంలో కవి పాత్ర ధరించుచున్నాను. నావంటి గొప్ప కవులు ఎందరో ఉన్నారు. అయినా మూడవ సారి రాష్ట్రస్థాయి ఆంధ్ర పద్య

కవితా సదస్సు వారు నన్ను అధ్యక్షునిగా మరల ఎన్నుకున్నారు.

ఈ మధ్య శ్రీకృష్ణ దేవరాయ భాషానిలయం శత జయంతి మహోత్సవాలలో జరిగిన కవిసమ్మేళనమునకు అధ్యక్షత వహించిన నాపై ప్రారంభకుడు అయిన శ్రీ మల్లెమాల కవి (యం.యస్. రెడ్డిగారు) ఊపుగా నాపై సభలో చదివిన పద్యం.

పండిత కవిరాజుకు తల
పండిన విజ్ఞునకు తెలుగు పద్యంబునకున్
గుండెను గుడిగా మలచిన
పండూరికి శిరము వంచి నతు లొనరింతున్

తెలుగు పద్య కవితపై నాకు గల ప్రేమ, చిత్త శుద్ధికి మించిన ప్రతిఫలం నాకు లభించింది.

కరుణశ్రీ శ్రీ జంధ్యాల పాపయ్యశాస్త్రి గారు వారి కృతులు మూడింటికి నాచే పీఠికలు వ్రాయించుకున్నారు.

శ్రీ గాడేపల్లి కుక్కుటేశ్వర రావు గారు - నామీద వ్రాసిన పద్యం.

ధైర్యము రొమ్ము విచ్చినది-ధర్మము త్రాసున తూగె - అంచితౌ
దార్యము వ్రేళ్ల పాతుకొనె - దక్షత పీఠము వైచి నిచ్చెనల్
కార్య వినిర్వహమ్ము ఇలు కట్టి వహించెను రామ కృష్ణమా
చార్యుని గుండె లోతుల ప్రసన్నతలో! మధురానుభూతిలో!

కవి కలుగోట్ల విజయాత్రేయ పెక్కు కృతులు వ్రాసి ప్రతి కృతిలో నాపై గురుస్తుతి పద్యాలు వ్రాశారు. అతడు నాకు ఏకలవ్య శిష్యుడు.

## శిష్య ప్రముఖులు

నాకు పట్టిన అదృష్ట రాజయోగాలలో గురువును మించిన శిష్యులు నన్ను చేరటం. ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి వ్రాసిన ఆంధ్ర వాఙ్మయ చరిత్ర గొప్ప గ్రంథం. ఆచార్య వి. యల్. యస్. భీమశంకరం భూభౌతిక శాస్త్రవేత్త వ్రాసిన రసస్రువు - చంధో వైవిధ్య పద్య కవిత. పెదముక్తేవి లక్ష్మణ యోగీంద్రులు ఆచార్య ఫణీంద్ర - శనగన నరసింహస్వామి - ఉషశ్రీ ప్రభృతులు చిరస్మరణీయులు. డాక్టరు ఆశావాది ప్రకాశరావు, డా॥ సంజీవమ్మ, శ్రీ సాంబశివ చౌదరి, శ్రీ చెన్నకేశవస్వామి, శ్రీ యాదాటి కాశీపతి నాపై మరువని భక్తి చూపినవారు.

గాలి లోన తేలు – ఆలోచనలు నావి
నాకు లేవు లేవు నమ్మకాలు;
సహృదయులకు ఇవి చర్చనీయాంశాలు
ఏవి నిర్ణయాలు కావు కావు.

కృతిపతి శ్రీ కళ్లెపు సాగర రావు గారికి నా ఆలోచనము నచ్చినది. నా ఆలోచనము - ముత్యాలగొడుగు - కచ్ఛపీ కింకిణీకము లోని పద్యాలు - చాటుపద్య ప్రాయములైన ముక్తకాలే. ఇవి చర్చనీయాంశాలే కాబట్టి అన్యోన్య వ్యాఘాతాలు ఉండవచ్చు. అంతేగాక నా అభిప్రాయాలలో మార్పులు తరచు చోటు చేసికోవచ్చు. ఒకనాడు దేశభక్తి మీద నాకు గౌరవం ఉండేది. నేడు నా దృష్టిలో జాతీయతకు కాలదోషం పట్టింది. తథా ''గురు దేవో భవ'' - అనటం కంటె

"శిష్య దేవో భవ" అనటమే మేలు. అట్లే వైద్యో నారాయణో హరిః", "రోగి నారాయణో హరిః" గ మారాలి. ప్రస్తుతం నా ధ్యేయనినాదాలు - వసుధైక ప్రభుత్వం, జగదేక పార్లమెంట్, ప్రపంచ దేశాలు సైన్యం వ్యయం తగ్గించుట. అప్పుడు భూగోళంలో దారిద్ర్యం ఉండదు.

## ఐన్‌స్టీన్

ఒక ముఖ్య విషయం

సనాతన శాశ్వత సిద్ధికల్ప నిత్య సత్యాలు ఈ భూలోకంలో లేవు. ఐన్‌స్టీన్ ప్రతిపాదించిన సాపేక్ష సిద్ధాంతం నాకు ఎంతో ఇష్టం. అది నాకు పూర్తిగా అర్థము కాలేదు. అది విషయాంతరం.

అమిత గౌరవమ్ము ఐన్‌స్టీను పై నాకు,
అర్థమయిన రచన లద్భుతములు,
అమృత రస సమాధి అర్థమ్ము కాకున్న;
విస్తుపోయి అనుభవింపగలరు.

అన్ని శాస్త్రములకు కళలకు విద్యలకుగూడ సాపేక్ష సిద్ధాంతమును అన్వయింప వచ్చును.

సర్వతోముఖముగ సాపేక్ష సూత్రమ్ము;
చెల్లు, ఎల్ల యెడల సృష్టి లోన,
జగతి విద్య లెల్ల చైతన్యవంతమున
సర్వదా విధిమసంతములు

దేశ కాల పాత్రములను - పరిసరాలను పరిగణలోకి తీసుకోవాలి అర్థ నిర్ణయంలో

విశ్వ సృష్టి సహజ విన్యాసములు తోచు,
సామరస్య శిల్ప సౌష్ఠవములు;
ఆ సమైక్య సిద్ధి - ఐన్‌స్టీను గుండెలో
లాస్య మాడు - శ్రుతులు లయలు కలిసి.

మెదడు నింపి - మించు మిరుమిట్లు వెల్గులో
కదిపి కుదప దలతు కవిత వ్రాసి;
సాధ్య మగునె ? నిత్య చైతన్య జగతిలో,
నిర్వికల్ప నిరత నిర్ణయాలు ??

ఆటవెలది చాటువులకు ఆత్మ కంచుదుందిభి కాదు. నా కవిత - కింకిణీకములే.

ముసలితనము రాక ముందె - పెద్దరికమ్ము;
పడయ వచ్చు కవిత కలన ప్రజలు;
బధిర సంఘమునకు బహిరంత రాత్మలై
క్రాంత దర్శులగుట కాంచ వచ్చు

సైన్సుకు మతమునకు సహజ వైరుధ్యం ఉంది అని తలపోయ వచ్చు. ఆ అభిప్రాయం ఎంత వరకు సత్యమైనది ?

ఏ విషయమైన సరే తుది నిర్ణయం - సహృదయానిదే! ఏమతం మీద ఏ ప్రవక్త మీద ఆధారపడరాదు. విగ్రహారాధనకు అతీతమైన మతం ఉంది. అదేవిధంగా మానవ స్వరూప సిద్ధమైన దేవుని కంటె అతీతమైన మతం ఉంది.

దేవుని ఉత్తమోత్తమ సృష్టి మానవుడు అనే వాదము మాత్రమేదో కాక దేవుడు మానవుని ఉత్తమ సృష్టి అనే వాదం ఉంది.

## ఐన్‌స్టీన్ అభిప్రాయం

మతము - శాస్త్ర విజ్ఞాన గుంఫనము లేక,
    గ్రుడ్డి దగును సమ్యక్ దృష్టి కోలు పోయి;
మహిత విజ్ఞాన శాస్త్రమ్ము - మతము లేక,
    కుంటి దగును చైతన్యమ్ము కోలు పోయి.



# కవితా కల్హార మాలిక

– నందూరి రామకృష్ణమాచార్య

క్రొన్నన తావి - తెమ్మెరలకున్ గిలిగింతలు పెట్టినట్లు; లే
వెన్నెల నింగి గంగ పృథివిన్ పడి నట్టులు; యుద్ధభూమిలో
వెన్నుని గీత బోధ - వినిపించిన యట్టులు; గండుకోకిలల్
గున్న రసాల మెక్కి కుహుకూ రవలుల్ పచరించి నట్లు; పూ
గిన్నెల తేనె సోన - పులకించిన తుమ్మెద - గ్రోలినట్లుగన్;
చిన్ని గులాబి లేవలపు చెక్కిలి - బాల మరీచి మాలికిన్
సన్నల రక్తితో - తొలి ఉషస్సుల స్వాగత మిచ్చినట్లు; ప్రా
పన్నుడు భక్తితో పరమ భాగవతోత్తము డాసి నట్లుగన్;
ప్రన్నని సన్న సామెత ప్రపంచ ప్రదక్షిణ చేసి, పేర్మిమై
అన్నవ గుండె లందనుభవాకృతి తాల్చిన యట్లు; తమ్మిపూల్
కన్నెలు, ఏటి గట్ల జలకమ్ము తేలిన యట్లు; ప్రేయసీ
సన్నిధి - గుండె - తాండవము సల్పిన యట్టులు; జాజి మొగ్గ వాల్
గన్నుల సిగ్గు దొంతరలు క్రాలి - సుగంధము చిమ్మినట్లుగన్;
పున్నమ రేయి చందురుడు పొంగులు వారెడు పాలవెల్లిపై
వెన్నెల ఆరబోసినటు; వేణు రవమ్ము స్రవించి నట్లుగన్;
ఉన్నత మానసాబ్ధి చలదూర్ముల హంసలు ఈదినట్లుగన్
పన్నగ భామినీ మణులు కింపురుషుల్ - హిమవన్నగంబుపై
మిన్నులు వడ్డ చోటులు గమించి - విహారము సల్పినట్లు; తా
కన్న కుమారు - తల్లి - బిగి కౌగిలికిన్ కయిసేసి - ప్రేమతో
చన్నులు చేపి నట్టులు; ప్రసన్న జగత్ ప్రతిబింబ దర్శినీ
సన్నిభ దర్పణంబటుల సాహితి పెంపెసలార; అభ్ర వి
ద్యున్నిభ భావ వీచికలతో - రుచిరంబుగ పాల్చి - వాక్కు పై
వెన్న కరంగు నట్టుల - కవిత్వము చెప్ప - మనోహరంబగున్.

# నదులు కలుపు

– నండూరి రామకృష్ణమాచార్య

కరువు - నీటి కొరత - వరద బీభత్సమ్ము
ఏక కాల మందె - ఎచట నుండు ?
బుద్ధి హీను లేలు - పుడమిలోపల గాక
మార్పులేని దేది - మనిషి మెదడు ?

కదలిపోవు చుండ - గలగలా - గోదారి
పసిడి పంట లేని పండ వెపుడు!
గంగ నీరు తెచ్చి కావేటిలో కల్పు,
వరద బాధ తగ్గు - కరువు తీరు.

ప్రజలు దద్దరిల్ల - ప్రతి వర్షఋతువులో
బ్రహ్మపుత్ర వరద బాధ లేల ?
కలియు గాక వచ్చి - కన్యా కుమారిలో
పొంగి పారలి - బ్రహ్మపుత్ర కాల్వ

ప్రజల హృదులు కలియు - భవితవ్య మేకమై
సకల నదుల లోని జలము కలియ;
అభ్యుదయము కలుగు - ఐకమత్యము హెచ్చు,
భరత ఖండ మందు ప్రజల మధ్య

చెరువు లెల్ల నింపు - భరత దేశము నందు
ఊరు ఊర "త్రాగు నీరు" చేర్పు;
పడుగు పేక వోలె - పంట కాల్వలు త్రవ్వి,
నదులు కలుపు - ప్రజల హృదులు కలుపు.

# తెలుగు తల్లి

– శంకరంబాడి సుందరాచారి

– సందూరి రామకృష్ణమాచార్య

జయము జయము - తెలుగు తల్లి - ప్రియతమ ధాత్రీమతల్లి
అరుణోదయ కిరణోజ్జ్వల రాగ రచిత రంగవల్లి
పసిడి పలుకు - పాలవెల్లి ! లలితా కళా కల్పవల్లి !

కదలి తేడు - కడుగును నీ కాళ్ళను కెరటాల నీళ్ళ;
కళ్ళకద్దుకొను - నీ తల గగనము - ఉల్లాసముతో

వంశధార - నాగావళి వసంత సౌరభములతో
ధగధగలాడను - నీ నును సిగ - మల్లెల మాలలుగా
గోదావరి పూదండగ; క్రాలును - నీ గళ మందున
కృష్ణవేణి - కింకిణీక మణిమేఖల - మార్ మ్రోగును;
చెన్నారును - స్వర్ణముఖీ పెన్నలు - మంజీరములై;
నీలో భారతదేశపు నాలుగు దిక్కులు - కలిసెను
సమన్వయ సవిత్రి వీవు సహన నేత్రి వీవు సదా

ప్రాజ్య మగధ రాజ్యములో, ఉజ్జయినీ గగనములో,
నీ విజయ ధ్వజ మెగిరెను, నీ దుందుభి నినదించెను;
జరిపినారు - ఇక్ష్వాకులు శతసహస్ర హలి దానము
మా జనయిత్రివి నీవే ! మధుర ధరిత్రివి నీవే !
అక్షయ పాత్రవు నీవే ! అమృత చరిత్రవు నీవే !

పుట్టినారు - నీ కడుపున బోధిసత్వ మేధావులు,
సారస్వత - సమరాంగణ సార్వభౌమ బిరుదాంకులు;

దయావీర దానవీర ధర్మవీర ధన్యాత్ములు !
వాదాలకు వారధివై, భేదాలకు స్వస్తి చెప్పి,
కొత్త పాతలకు - కూరిమి కూడలివై - వర్ధిల్లుము;
కవితారస కల్యాణీ ! గానామృత మయవాణీ !
సస్య శ్యామల గృహిణీ ! సర్వ హితాభిలాషిణీ !

★ ★ ★

కవుల కంటె - తుహిన కర్పూర విభ కీర్తి;
తెచ్చి రెవరు నీకు తెలుగు తల్లి ?
సాహితీ తరంగ సంగీత రసధుని;
దేశ భాష లందు - తెలుగు లెస్స !

పద్య కవిత వ్రాయ - ప్రౌఢ వృత్తాలలో,
సగటు సహృదయుండు చదువ లేడు;
అలతి అలతి తేట తెలుగు మాటల తోడ,
ఆట వెలది నేటి అవసరమ్ము.

వేమన కవి ఆట వెలది లావణ్యముల్,
నాట్య మాడె తెలుగు నాల్కల పయి;
ఛంద మందు భావ సౌకుమార్యము నందు,
నాకు కోర్కి - వేమన భుజ మెక్క.

మహిత రత్న ఖచిత మాణిక్య మకుటమ్ము,
రక్తి కట్ట జేసె - రాచఠీవి;
పొందు పరచ ఛంద మందు - స్వారస్యముల్;
ఇంపు సొంపు పెంపు లతిశయించు.

★ ★ ★

నన్ను చూచి నేను నవ్వు కొందును సదా,
తిరిగి నాను - కవిగ శిరము నెత్తి,
తెలియు నాకు - కాను - దివ్యాంశజనితుండ;
చెప్పినాను నిజము శిష్య తతికి.

సమయ సీమ లుండు - సందర్భములు నుండు,
వాచ్య ముండు - అర్థవాద ముండు;
ఎచట నుండు జగతి ఏకాంత శబ్దమ్ము ?
ఎరుగ వలె గద కవి హృదయ మెపుడు

– నందూరి రామకృష్ణమాచార్య

# శ్రీ కళ్లెపు సాగర రావు గారు

కలుగ చేసినాను - కవినంచు భ్రమ నేను;
అరువదేండ్లు యావదాంధ్ర మందు !
గొప్ప గురువు లకును కూర్మి శిష్యుడనైతి,
గొప్ప శిష్యులకును గురువు నైతి.

కవి సమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ, శ్రీ పింగళి లక్ష్మీకాంతం, శ్రీవఝల చిన సీతా రామ స్వామి శాస్త్రి, అబ్బూరి రామకృష్ణారావు, శ్రీ మల్లంపల్లి సోమశేఖరశర్మ, శ్రీ దువ్వూరి వేంకట రమణ శాస్త్రి తదితరులకు నేను ప్రత్యక్ష శిష్యుడను. ఆచార్య రవ్వా శ్రీహరిగారు అన్నమాట - ''నండూరి గొప్ప గురువులకు శిష్యుడు, గొప్ప శిష్యులకు గురువు.'' నాది అధ్యాపక వృత్తి. వేల కొలది శిష్యులకు గురువులు నాకు కళాశాలలలో ప్రత్యక్ష శిష్యులు గాన - నన్ను గురువుగ ఆదరించిన మిత్రులు ఉన్నారు. శ్రీ ఈలి ఆంజనేయులుగారు, శ్రీ నందమూరి తారక రామరావు, కవిరాజు - రాజకవి శ్రీ మంతెన వేంకట సూర్యనారాయణ రాజుగారు నాపై చూపిన ఆదరాభిమానాలు నమ్మలేని నిజాలు. చిరకాలము - శిష్య మిత్రుల అభిమానమునకు అలవాటు పడిన నాకు ఎనుబదేండ్ల వయసు మళ్లినపుడు ఒక భయం కలిగింది. ముసలి తనంలో నాకు ఇక అటువంటి గొప్ప శిష్య మిత్రులు దొరకరేమోనని. అయితే నా భయం నిజం కాలేదు. నాకు శ్రీ కళ్లెపు సాగరరావు గారు గొప్ప శిష్య మిత్రుడు లభించినాడు. ఆయన నా పేర పీఠానికి విరాళం ఇవ్వటమే గాక కచ్ఛపీ కింకిణీకం - నా కావ్య ముద్రణకు ముప్పది మూడు వేలు రూపాయలు ఇచ్చారు. అంతేగాక - నాకు పలుమారులు శ్రీవారి కారు వాహన యోగం సమకూర్చుచున్నారు. గురుభక్తి పరప పవిత్రమైనది. తథా స్నేహం -

శీర్షమేఖలలో స్నేహమును రసస్థాయికి తెచ్చినానని పలువురు మిత్రులు ముఖస్తుతికి పాల్పడినారు.

స్నేహితుల ఆదరాభిమానాలు నాకు అనుభవామ్రేడితములు.

శ్రీ గీట్ల జనార్ధన రెడ్డి గారు - ఈయన వ్యక్తిత్వంలో కవి రాజకీయుడు కలిసి యున్నారు. ఆంధ్ర పద్య కవిత వారి రాష్ట్రస్థాయి పోటీలలో రెండు సారులు ఈయనకు ప్రథమ బహుమతి లభించినది. చిరకాలము నుండి శ్రీ గీట్ల జనార్ధన రెడ్డి గారు నాకు సుపరిచితుడు. ఈయన యదార్థ వాది. మొగమాటం లేని వాడు. అయితే రాజకీయాలకై ఈయన చూపిన గొప్ప అభిమానం కవితా రంగంపై చూపియుంటే కవిగా మంచి గొప్ప ప్రఖ్యాతి గడించి యుండేవాడు. శ్రీ గీట్ల జనార్ధన రెడ్డి గారికి నామీద నిర్హేతుక జాయమాన కరుణ ఏర్పడినది. నాపై ఈయన ఒక సూవనీరు సంచిక - బహుళవ్యయ ప్రయాస లోర్చి సంకలనం చేశారు. నాకు సర్కారు జిల్లాలలో రాయల సీమలో ప్రఖ్యాత శిష్యులు ఉన్నారు. తెలంగాణాలో గూడ శ్రీ గీట్ల వారు సాగర రావు శ్రీ చిప్పాల రామకృష్ణరావు డాక్టర్ గారు మంచి మిత్రులు. అభిమానము చూపారు. మహబూబ్ నగర్ లో నాటకం - అభినవ కురుక్షేత్రం ప్రదర్శించినారు. శ్రీ నరహరి రాజుగారు నాకు వారి కావ్యం - స్నేహసుధ అంకితం చేశారు. శ్రీ డోకూరు రాజేశ్వర రావు గారికి నా పద్యాలు - శతాధికం కంఠస్థములుగా వచ్చు. నాకు శ్రీవారు సన్మానం చేశారు. ఇప్పుడు మంథని-గోదావరిఖని - కరీంనగరాలలో నాకు సన్మానాలు జరిగినవి. తెలంగాణాలో నవ్య చైతన్యం వెల్లి విరిసింది.

వాణి - నిజాము పాలన విభావరిలో శయనించె - నిత్య ని
ద్రాణ పరిస్థితిన్ వివిధ రంగములన్ నవజాగృతిన్ తెలం
గాణము మేలు కున్నది ఇకన్ కవితామృత తృష్ణ చిందుచున్
వీణలు వేణువుల్ గళము విప్పినుతింప రస ప్రపంచముల్.

– నందూరి రామకృష్ణమాచార్య

★ ★ ★

కొత్త పాతల మేలి కలయిక

నందూరి రామ కృష్ణమచార్య - శైలి యందును - శబ్దజాలము నందు క్రొత్త పాతల మేలి కలయిక కప్పట్టుచున్నది.

– తారాతోరణ పీఠిక - శ్రీ కట్టమంచి రామలింగారెడ్డి

★ ★ ★

కానివ్మొయి కవీంద్ర! నీ అతిథి సత్కారమ్ము నీ యింటిలో
వాణీ పాద గలంగల న్మధుర నిక్వాణమ్ముతో ఇందిరా
పాణిప్రస్ఫుట పద్మ గర్భ మధు సంపాతమ్ముతో, నిత్య క
ల్యాణమ్ముల్ మరి పచ్చ తోరణముగా ఆచార్య మిత్రా! ఇకన్.

– తారాతోరణము నుండి - శ్రీ ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

# కృతి స్వీకృతి

శ్రీ కళ్లెపు సాగర రావు

గురువరేణ్యులు బహు గ్రంథ కర్త డాక్టరు నండూరి రామ కృష్ణమాచార్యులు గారు వ్రాసిన ''ఆలోచనము'' లోని కవితలు – వేమన పద్యముల వలె ఆపాతమధురములు.

ఆ పద్యాలు సరళములు. సుకుమారములు, సుందరములు.

ఒకటి రెండు సారులు చదివితే హృదయమునకు హత్తుకొని పోవచ్చు. కంఠస్థం కావచ్చు. మా పిన తండ్రియైన చెప్యాల రామకృ ష్ణరావు గారికి కూడ నండూరి రామకృష్ణమాచార్యుల వారిపైన గురుభక్తి ఏర్పడినది. శ్రీ రామకృష్ణ రావు వ్రాసిన రెండు పద్య కావ్యాలు 1. గురు శిష్యులు 2. రామకృష్ణ పద్య కావ్యములకు నండూరి వారే పీఠికలు అనుగ్రహించారు. ఆ పుస్తకాలను ముద్రించి ప్రచురించు నా సంకల్పం నెరవేరినది. ఆ సందర్భంలో నేను నండూరి వారిని సందర్శించాను. వారి కవితలు, సందేశం ప్రజలందరకు అందించటం పుణ్యకార్యమని నాకు కూడ అనిపించింది.

శ్రీ మంతెన సూర్యనారాయణ రాజు గారు – కవిరాజు, రాజుకవి, బిరుదాంకితులు. కవితాజ్యోత్స్న, పాకనాటి వైభవం, మా ఊరు మున్నగు కావ్యాలు వ్రాసిన సత్కవీశ్వరులు. తథా శ్రీ ఆచార్య ఫణీంద్ర కవిగారు. ''కవిగారు'' కిషన్ రావు – డాక్టరు

రఘురామిరెడ్డి శ్రీ సాధన నరసింహాచార్యులు శ్రీ కన్నారావు, శ్రీ శరత్ బాబుగారు, శ్రీ పురుషోత్తమరావు గారు ప్రభృతులతో కలిసి "నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠం" ఏర్పటడంలో ఉడుత భక్తితో నా పాత్ర నిర్వహించినాను. ఒక లక్ష రూపాయలు విరాళం సమర్పించియున్నాను.

ఇంతేగాక – పలుదినాలు సాయంకాలంలో నండూరి వారితో నాకు సత్సంగం చేసే అవకాశము లభించింది.

డాక్టరు నండూరివారు వ్రాసిన పద్యకవితలు కచ్ఛపీ **కింకిణీకం** నాకు శ్రీవారు అంకితం చేయటం నా అదృష్టం. అది గుర్వాజ్ఞ – అది గురువుగారి అభిమానం, ఆశీర్వచనం.

ఒకనాడు 18-8-2002 నాడు నండూరి వారిని – వారి శ్రీమతి సుభద్రమ్మ గారిని మా ఇంటికి తీసుకొని వెళ్లి – నేనూ నాతల్లి మురళమ్మ శ్రీమతి సరోజమ యావత్ కుటుంబం మా తమ్ముడు శ్రీ రామారావుతో పాటు కొడుకు శ్రీకాంత్ అందరము వారిని సత్కరించి సంతోషించినాము.

సహపంక్తికి – శ్రీ కల్కి అవతారం గారు శ్రీ గొల్లపూడి రామ దాసుగారు శ్రీ శ్యాం మోహన్‌గారు కూడ విచ్చేసారు.

ఆ అనుభూతి వర్ణనాతీతం !!

# నా జన్మకు పట్టిన భాగ్య విశేషం

కచ్ఛపీ కింకిణీకం కావ్యానికి నేను కృతిపతిని కావటం. ఎన్నో విషయాలు శ్రీవారి సత్సంగంలో తెలుసుకో గలిగినాను. మేము నిర్వహించే పాఠశాల శాంతి నికేతన్ విద్యాలయమునకు నండూరి వారు రెండు మారులు విచ్చేసారు.

నా సహశ్రతులు శ్రీ పురుషోత్తమ రావు గారికి కూడ వారి ఆశీస్సులు అభినందనలు లభించినవి.

నండూరి వారు మాకు గురుదేవులైనారు. ఒక శిష్యవరమాణువుగ శ్రీ నండూరి వారికి నా నమస్సులు సమర్పించు చున్నాను. వారి సాంగత్యము వలన నా జన్మ ధన్యమైనది.

నన్ను డాక్టరు నండూరి రామకృష్ణమాచార్య సాహిత్య పీఠమునకు గౌరవాధ్యక్షులుగా ఎన్నుకున్నారు. అది నా పూర్వ జన్మ సుకృత ఫల విశేషము.

# దేశిక స్వామి

– శ్రీ దుగ్గిరాల రామారావు

ప్రీణిత శబ్ద వైభవ ధురీణత నొప్పెడి యుష్మదాంధ్ర గీ
ర్వాణ కవిత్వవాణి యనవద్యము, బుద్ధి విశేషమందు గీ
ర్వాణ గురుండ వయ్యు రసవత్కృతి నిర్మితి యందు బూర్వ గీ
ర్వాణ గురుండవైతివి సెబాసుర నండూరి సత్యవీశ్వరా !

ప్రాచీనమ్ములలోని మేల్తరము అర్వాచీన మార్గమ్ములన్
బ్రాచుర్యమ్ముల నెంచి ఆంధ్రకవితాప్రాశస్త్యమున్ మంజు వా
చాచాతుర్య మెలర్ప శిష్యతతు లిచ్చన్ మెచ్చ బోధించు, నీ
యాచార్యత్వము రామకృష్ణ కవిచంద్రా శ్లాఘ్య మెంతేనియున్.

కవితల్ వ్రాసి విమర్శనల్ సలిపి వ్యాఖ్యల్ చేసి శిష్యాళికిన్,
వివిధాంశమ్ముల నూరిపోసితివిలే నీ సాటి పాటింపగా
నెవరయ్యా ! గురువర్గమందరయ నీవే సాటి నీ కెన్న వై
ష్ణవతేజో నిధి ! వాఙ్మయ త్రయ మహాసాహిత్యపాథోనిధీ !

చెళ్లపిళ్ల వారి శిష్యుల బ్రసిద్ధులు పింగళివారు, వారి శి
ష్యులఁ దల మానికమ్మవు మహోదయ నీకును వారికిన్ బలెన్
వెలసిరి తెల్గునాడున ననేకులు శిష్యులు - ఏకలవ్య శి
ష్యులును బ్రశంసనీయములహో ! భవదుజ్జ్వల భాగధేయముల్.

పద్య రచన యందుఁ బ్రావీణ్యముం గన్న
సోమగు కవి నాదు సోదరుండు;
నిన్ను గురువటంచు మన్నించు నది గర్వ
కారణమ్ము గాదె ! కవి వరేణ్య.

తారకాతోరణము పెద్ద పేరుఁ దెచ్చె;
శిష్యసంతతి యశముఁ దెచ్చినది కొంత,
ప్రగతి గీతను వేఱె చెప్పంగ వలెనె ?
జగ మెఱింగిన దేశిక స్వామి వీవు.

శ్రీరస్తు ! నీ యశశ్శ్రీఖండలతకు, నీ
వార్ధక్యమున సుఖప్రాప్తి రస్తు !
అభివృద్ధి రస్తు ! నీ ఆరోగ్యమునకు, నీ
యుత్సాహమునకు నభ్యుదయమస్తు !
విజయోస్తు ! నీ రమ్య పీఠికా తతికి, నీ
పాండిత్యమునకు సౌభాగ్యమస్తు !
స్వస్త్యస్తు ! నీ వచస్పారస్యమునకు, నీ
కవనశారదకు దీర్ఘాయు రస్తు !
నీవు పీఠాధిపతి వయి నిర్వహించు
పద్యకవితాసదస్సుకు భద్ర మస్తు !
సరసకవి ! రామకృష్ణమాచార్య! నీదు
ఆట వెలఁదికి నీకుఁ గల్యాణ మస్తు !

– దుగ్గిరాల రామారావు
అమృత కలశం - ఇత్యాది కృతికర్త

*About the Author*

## *Dr. N.V.R. KRISHNAMACHARYA*

***Extract from "Contemporary Indian Literature" Published by the Sahitya Akademi-New Delhi.***

# THE NEO-CLASSICISTS

Within recent years, one notices the beginning of a new movement, the return to classicism. If the Leftists and Surrealists rebelled against the romanticism of the earlier decades of this century, the neo-classicists like NANDURI KRISHNAMA CHARYULU, Jandhyala Papayya Sastri and G. Joshua are questioning the value of the Surrealism of the years from 1935 to 1960. Harmony, instead of strife, is their ideal. In the postwar world an equilibrium has to be achieved between matter and spirit, between idealism and realism. KRISHNAMACHARYULU and his fellow poets claim that they are effecting this reconciliation. The neo-classicists are anxious to regain for poetry its dignity as the symbol of all that is beautiful and true.

* * *

Dr. Krishnamacharya - is a Future Tense among the modern poets. Telugu Literature will reserve a coveted place for him amongst the galaxy of the illustrious poets of Andhra.

**Prof. G.S. SOMAYAJI**

# రచయితకు కవితా కర్పూర నీరాజనాలు

హృదయ మమృత సముద్రము;
 వదనము కవితా లతాంగికి నర్తనశాల;
సదన మతిథికోటికి నాటి ఋష్యాశ్రమము;
 విశాల వసుధా కుటుంబి - నీ సాటి నీవె.

– శ్రీ శనగన నరసింహస్వామి

అమృత హృదయునకు, సంయమి
సమ సహృదయునకు, ఉదారచరితునకు, మహో
త్తమ గుణ భరితునకు, క్రియా
కమనీయ దయామయునకు, కావ్యమయునకున్.

నయమార్గ సుప్రసిద్ధా
న్వయ శ్రీ నండూరి వంశ నామార్యునకున్
జయమార్గ సుప్రసిద్ధా
హ్వయ వేంకటరామ కృష్ణమాచార్యునకున్

– డాక్టరు ఆచార్య కొర్లపాటి శ్రీ రామమూర్తి

ఎవ్వాని గలము లో నవ్వుకొన్నది నంద
 నారామ మధుర మందార వల్లి;
ఎవ్వాని కలములో నివ్వటిల్లెను విశ్వ
 భారతీ మంజు మంజీర రవము;
ఎవ్వాని చెలిమిలో నివ్వాళు లెత్తెను
 పర్దాలు లేని సౌహార్ద లక్ష్మి;
ఎవ్వాని కలిమిలో  పవ్వళించెను సుప్త
 గుప్త దానవ్రత పాప్త తృప్తి;
అతడు నందూరి వంశ పయః పయోధి
 చంద్రముడు - రామ కృష్ణమాచార్య సుకవి;
గద్య పద్య తారాతోరణాద్యనేక
 కావ్య నిర్మాణ చాతురీ సవ్యసాచి.

– కరణశ్రీ శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి

శ్రీ నందూరన్వవాయం
 స్థిరతర సుయశ స్సింధు చంద్రం సుధీంద్రం
స్వాదు స్వాదు స్వభావం
 సలలిత చరితం సాహితీ సార్వభౌమం
సాక్షాత్ పుంభావ వాణీం
 సరస మధురసనత్ కావ్య శిల్ప ప్రవృత్తిం
వందే  శ్రీరామ కృష్ణాహ్వాయ
 మనిశమహం వాఙ్మయ శ్రీ సమగ్రం.

– శ్రీమాన్  దీక్షితదాసు భాగవతారుగారు

# గురు వందనము

## కీర్తి శేషుడు శ్రీ వంగల పార్థ సారథి

మథియింపుము మథియింపుము
మథియింపుము నా మనస్సు మందర గిరిపై;
మధుర సుధా సింధువులో
వ్యధా గరళపునంచు మొదలైనవి భయమేల గురూ

ఈ యొక కేని శిష్యు డొనరించెడి మాధుకరంపు వేళలో
వేయుము చాలు నీ ననుభవింపద వెక్కసమైనదే కవీ
శా యిటు నాలు గాసల కొసల్ ముడి పైచి వహింపు జోలెతో
నీ యిలు ముంగిటన్ నిలువనీ నిను వేడగనీ గురూత్తమా.

స్తుతియించెద వాఙ్మయమున
అతి రథికుని రామ కృష్ణమాచార్య గురున్
మతి మహిమోజ్వలితున్ - ఘం
తత రస కృత్యామృత కవితా కైవల్యున్.

# నిండైన తోమాల

- ఆచార్య ఫణీంద్ర

నిండైన తోమాల నండూరి మెడలోన
వేసిరి సహృదయుల్ మోసి తెచ్చి;
కాలి కమరె స్వర్ణ గండ పెండేరమ్ము;
నిండు సభను హర్ష నిస్వనములో;
శాలువా కైసేసి సత్కారించెను గదా !
ఆ ప్రభాకర మంత్రి ఆదరమున;
సీస పద్యస్థాయి చేరె సభా శోభ
పాలకొల్లు చరిత పరవశింప,
శంఖ రవము వోలె సభను రంజిల చేసె,
ప్రథిత విజయ రామ రావు మంత్రి;
గజలు శ్రీనివాసు గాన గంగోర్మి లో,
దివిని భువిని ముంచి తేల్చి వేసె.

(నండూరి వారికి పాలకొల్లులో అమాత్య వర్యులు
గండపెండేరం తొడిగి సత్కారించిన వేళ....)

# వాణికి వాణి

- ఆచార్య ఫణీంద్ర

వాణికి వాణియైన గురు
        వర్యుడు - నండూరి - నవ్య సాహితీ
ద్రోణుడు - ఆంధ్ర వాఙ్మయ
        చతుర్ముఖ భాసుర మూర్తి - ఆంగ్ల గీ
ర్వాణ సరస్వతీ హృదయ
        రంజక వర్తి - రసార్ద్ర కచ్ఛపీ
వీణను మేళవించుత
        నవీన సనాతన పద్యరాగముల్ !

ఆట వెలది పద్య మాచార్యు కవితలో
        లాస్యమాడు హొయలు లయలు చిలికి,
శ్రుతులు స్మృతులు ధర్మ సూక్ష్మ వేదాంతముల్
        తరచి - వెలుగు వెల్లి విరియ చేయు.

# కచ్ఛపీ కింకిణీకం
## (ముక్తక పద్యావళి)

### స్వగతం

దేహము - దారి తప్పె - నను దివ్యునిగా తలపోసి-మేటి వ్యా
మోహము కూర్మి గౌరవము ముప్పటలన్ - కురిపించి నట్టి-నా
స్నేహితులెల్ల స్వర్గతులు - జీవిత మిచ్చెను పూర్ణ తృప్తి - నే
నైహికముల్ త్యజించి - కవితామృత దానములన్ తరించెదన్.

### గుప్త దానం

కవన మందు లేని - గాన మాధుర్యమ్ము;
జ్ఞాన మందు లేని - సౌహృదమ్ము;
కానుపించు - గుప్త దాన మౌనము నందు;
పృథివి కవల వెల్లివిరియు వెలుగు.

### కవి

కవన జగతి సాము గరిడీలు కసరత్తు
నేర్పు చూపగల మనీషి లేడు;
ప్రగతి గుండె లందు - పండించు కవి వేరు;
రమ్య హాస లోల! రామ కృష్ణ.

### ప్రగతి

క్రొత్త పాత మేలి కూర్పే ప్రగతి సుమ్ము !
పాత దగు పునాది లోతు చాలు;
పొదుగు కొనుట మేలు మెదడులో హృదిలోన
ఎదుగు నట్టి క్రొత్త యెల్ల లెల్ల.

### తల్లి దండ్రులు

తల్లి దండ్రి చేయు త్యాగమ్ము వల్లనే
పిల్ల లెల్ల పేర్మి పెరుగ గలరు;
తద్దినాలు వద్దు - తల్లి దండ్రుల పేర,
బ్రతికి యున్న వేళ - భక్తి మేలు.

పద్యం

పద్య మొకటి ర్వైన ప్రగతి భావన తోడ;
కూర్పదగు ఒక రస గుళిక - చాలు;
పేర్ప నేల ? క్రొత్త పిరమిడ్ల గోరీలు
వల్లకాటి పాత రాళ్ల తోడ.

విన్నపం

మనవి చేసినాడ - అనుభవాలోచనల్,
నరుల బ్రదుకు లోతు లరసి తరచి,
ముసలి తనము రాక ముందె - పెద్దరికమ్ము,
పద్యములను చదివి పడయ వచ్చు.

పద్యం

ఆవకాయ యనిన ఆంధ్రజాతికి ప్రీతి,
పిండి వంట లెన్ని యుండు గాక,
కలదు పద్య మనిన తెలుగు వారికి ప్రీతి;
రక్తి కట్టు రమ్య రచన లున్న,

పద్యం

పద్య మన్న పెక్కు పడబోతలను పెట్టి,
తీర్ప వలెను - నుడులు తీర్చి దిద్ది,
అరగ దీయ వలెను అతుకు కన్పడకుండ
సాన బట్టు వజ్ర శకల సరణి.

ఛందస్సు

సాంప్రదాయక మగు ఛందస్సు సరిపోదు;
తెలుగు పద్య రచన తీర్చి దిద్ద;
కవి మనస్సు లోన - కల్పించ దగు గదా !
విధి నిషేధములను వీలు కొలది.

### సహృదయుడు

ఉండ వచ్చు - పొదుగు నిండ - గోవుకు పాలు,
పిండు వాడొకండు - ఉండ వలెను;
చాటి చెప్పు నట్టి సహృదయుడే లేక
కవిత - యెట్లు ప్రజల కడకు చేరు ?

### సరళ శైలి

సాహితీ రచనకు - సరళ శైలియె - నాడి;
అంద వలెను కవిత అంతకును;
కవిత చదివి నంత - కంఠస్థమై నిల్వ;
మెరయ గలదు గుండె - స్థిర తటిత్తు.

### అలతి అలతి నుడులు

అలతి అలతి నుడుల - సులభ సుందరముగా
కవిత వ్రాయ వలయు - కవి వరుండు;
కవిత చదివి నపుడు కానిచో అర్థమ్ము,
సలుపు నట్టి దేమి? సహృదయుండు.

### నీతి

ఆచరించనట్టి - ఆభాస బోధనల్;
నాటకములు వట్టి బూటకములు;
కుకవి నీతి రచన - కుహనా కవిత్వమే;
చేత గాని రోత కోత లేల ?

### కవి

కవి - విదూషకుడుగ - గందోళిగాడుగా,
సంచరింపరాదు - సభల లోన,
వేత్త - కవి వరుండు - వేదాంత - సిద్ధాంతి;
తరిపి వెన్నెలల సుధాకరుండు.

ఛందస్సు

సకల భాష లందు - ఛందో విధేయముల్
భావ గమక రీతి - భాష - శైలి;
ఛందము మరి భాష - సందర్భమును బట్టి,
తెలుగు పద్య కవులు మలచ గలరు.

కవిత

తెలియ కుండ దొరలు - దివ్య ప్రవచనముల్,
స్వీయ కవిత లందు చేర్చు - సుకవి!
ప్రతిభ పరిధి దాటు అతిలోక సత్యముల్
కవిత లందు తరచు కానుపించు.

కవనం

అమృత కవన పఠన మానంద యోగమ్ము,
మధుర మధుర మైన - మత్తు గొలుపు;
దీప్తి గలదు దివ్య దీధితి ప్రత్యూషి,
రస సమాధి అంతరంగ మందు.

అందం

అంద మెచట నున్న - ఆరాధనము సల్పు;
శీల ముండు సుకవి చిత్తమునకు!
అంద మివ్వ గలదు ఆనంద సంక్రాంతి;
తన్మయానుభూతి - తత్క్షణమ్ము.

భావయిత్రి

కవుల భావయిత్రి - కానుపింపదు సదా;
చూడ - కవిత వట్టి నీడ బొమ్మ !!
ఎట్టి పదము లైన ఏ భాషలో నైన,
తెలుప లేవు కవుల తలపు లెల్ల.

### స్వీయ కవిత

ప్రతిభ లేనివాడు - భ్రమ లోన పడి పోవు,
ఎంచు - స్వీయ కవిత - మంచి దంచు,
విడువ లేడు - మైకు - విద్వాంసుడును గూడ;
వినుగు చెందు గాత వినెడివారు.

### కరుణ

సానుభూతి కొంత సామాన్య జనులపై
పండితోత్తములకు ఉండదగును;
వ్యాకరణము పెద్ద తోక - వాఙ్మయములో !
కవిత కొంత చూపు గాత కరుణ.

### కరుణ

పొంగి పొరలు నట్టి శృంగారమున కంటె,
''కరుణ'' కూర్చు గద జగద్ధితమ్ము;
గుండె లందు - కరుణ పండించ గల్గుటే,
అగ్రగణ్య లక్ష్య మగుత - కవికి.

### కృతిపతి

ఆదరించె కవుల అగ్రహారము లిచ్చి
కావ్య భక్తి - పూర్వ కాల మందు;
కృతిపతి కృతి కర్త కేమి చేయును నేడు ?
శాలువాను కప్పి - సత్కరించు.

### కవికి

క్రాంతదర్శి - సుకవి - కాంక్షించు ప్రగతినే,
కోరు జగతి హితము గుండె లోన;
స్వప్న భోజనుండు జగతిలో - కవి నేత,
జయము దిగ్విజయము జయము కవికి.

### పరం

పరము గూర్చి ఇంత వరకు తేలిన దేమి ?
ఇంక తెలియ దగిన దేమి కలదు ??
పరము మరచి - ఇహము - వాసయోగ్యము చేయు
ప్రగతి కొరకు - నరుడు పాటు బడుత.

### మందు

జబ్బు - కుదురు వైద్య్య సంకల్ప శుద్ధితో,
మాన్ప లేదు వ్యాధి మందు తరచు,
హస్త వాసి యంచు అనవచ్చు జనులెల్ల:
మనసు యొక్క అలలు మహిమ గలవి.

### ఆత్మ బలిదానం

ప్రగతి వచ్చు ఆత్మ బలిదాన నిరతిచే,
పురిటి కాన్పు పిదప పుట్టు బిడ్డ.
పరమ పావనమ్ము బ్రదుకులో త్యాగమ్ము,
ప్రగతి యోగమునకు ప్రాణ నాడి.

### సంప్రదాయాలు

జనుల కట్టి వేయు ఇనుప సంకెళ్లతో
సంప్రదాయ సరణి - సంఘ మందు,
ప్రజలు తాల్చ గలరు - పసిడి సంకెలనైన
ఆభరణము లనెడి భ్రాంతి తోడ.

### ఐహిక తుల

ఏను సైప గలను ఎన్ని తప్పుల నైన,
చిత్త శుద్ధి చాలు - శ్రేష్ఠ తమము:
కర్మ యోగి పడును ధర్మ సంకట మందు
ఐహిక తుల వేరు - అతడు వేరు.

అక్షరాల వెనుక

చదువ వలయు కొన్ని సాహితీ సత్కృతుల్,
మనసు నిలిపి రెండు కనులు గాక,
అక్షరాల వెనుక సాక్షాత్కరించుగా
రస విరాడ్విలాస రంగశాల.

లౌక్యం

త్యాగ యోగి యెవడు ? అవివేకి జగతిలో ?
స్వార్థ బుద్ధి లేక బ్రదుకు నతడు;
లలిత చాకచక్య లౌక్యమే ఈనాడు
చాట బడును తెలివి తేట లనుచు.

శృంగారం

వృద్ధుడైన యెడల శృంగార రస హేల,
హృదిని తెలియ కుండ హెచ్చ వచ్చు,
అతిశయించు ప్రతిభ - యౌవనోదయ మందు,
తగ్గ వచ్చు ముసలితనము నందు.

స్వోత్కర్ష

ఎంచ - సంఘ మందు - మంచివారెందరో !
ఉండవచ్చు ప్రతిభ యున్నవారు,
శ్రోత - మెచ్చ లేదు - స్వోత్కర్ష వక్తలో;
మాన వలెను పర విమర్శ - సతము.

కథ - కంచికి

బోధ చేసె - పెద్ద పులికి - ఒక్క మహర్షి
మాంస భక్షణమ్ము మాను మనుచు,
వ్యాఘ్రము తిని వేసె - ఆ మహర్షిని చంపి;
కథ కవన పథమున కంచి కరిగె.

*గొంగళి కూడు*

అంద రీ ప్రపంచ మందు పాపాత్ములే!
బ్రదుకు లోన కూలివాడు తప్ప;
కూడు కుడుచు నెడల కోరి గొంగళి లోన,
వెంద్రుకలను వెదక వెరవు లేదు.

స్వగతము

కూర్చొ నాకు కుదురు కొంత చైతన్యమ్ము;
రైళ్ళ లోన కవిత వ్రాసినాను,
కాల మెపుడు నాకు కాలేదు వ్యర్థమ్ము
తరచు భావయిత్రి పరుగు లెత్తె.

బ్రదుకు

ఆగ వచ్చు దారి – ఆకస్మికమ్ముగా,
సరళ రేఖ కాదు నరుని బ్రదుకు;
మలుపు తిరుగ వచ్చు – మనుజ జీవిత యాత్ర;
అది అదృష్ట యోగ మనగ బరగు.

కావ్యం

మర్త్య లోక మందు – మధుర కావ్యము తప్ప,
అమృత యోగ సిద్ధి నందు నేది ?
సుకవి సూక్తి చాలు – ఒక సుభాషితమైన
బ్రదుకు యుగ యుగాంతరములు దాటి.

సత్కారం

చాక్షుషోత్సవమ్ము – సత్కార దానమ్ము !
ప్రతిభ ప్రజ్వలించి పడిసె నేని,
లోకమున ప్రగతి – పతాకా ప్రతిష్ఠయే
దాత – స్వార్థ రహిత నేత యైన.

### నిజం

ప్రియము కాని నిజము – పిడి లేని ఖడ్గమ్ము,
వాడ నేర రెవరు వసుధ లోన,
పేర్మి పలుక వచ్చు – ప్రియమైన సత్యమ్ము
వచ్చి బొంకు నెపుడు పలుక రాదు.

### అంకితం

అరయ – అక్షరాల అచ్చులో తన పేరు
నరుడు పొంగి ఒడలు మరువ వచ్చు,
అమృత కావ్య మొకటి అంకితమ్మును పొంద,
కృతి పతి హృది పులకరించి పొంగు.

### వైష్ణవుడు

వైష్ణవుండు కాడు బ్రదుకులో యజమాని;
వాడు అయ్యవారు కాడు కాడు
మనుజా సేవ యోను – మహిత మాధవ సేవ
వైష్ణవుండు భృత్య భావుకుండు.

### అహం బ్రహ్మోస్మి

అహము పెంచ వచ్చు మహి ''అహం'' బ్రహ్మోస్మి
ఉర్వి లోన జ్ఞానయోగి ఎవడు ?
వసుధ కనుల దోచు వ్యవహార సత్యమ్ము
''తత్త్వమసి'' అధీతి తరళ భాష.

### పిడి

ఉండ వచ్చు పదను రెండు వైపుల గూడ,
మిల మిల మిల కత్తి మెరయ వచ్చు,
పట్టి వాడు టెట్లు ? పనిముట్టు గొప్పదే,
కలిగి యుండ వలెను కత్తి – పిడిని.

స్వగతం

ఎనుబ దేండ్లు ఈ ప్రపంచమునందు గడచె
అనుభవాల మూట - అయు వోసగె,
నేను విప్పగల మనో నేత్రములు గూడ,
కవిత వ్రాయ గలనులే జగద్ధితముగ.

పూర్వ రంగం

చేరి గట్టు మీద బేరసారము లేల ?
ఏటి నీట చేప లీదు చుండ;
ముందు పూర్వరంగమును సిద్ధ మొనరింప
పిదప పనులు చేయ అదను వచ్చు.

ధూర్జటి

ఎదురు నీదె బ్రదుకు ఏకాంత యోద్ధమై,
త్రొక్కె సొంత పుంత - ధూర్జటి కవి,
సాహితీ ఋతాంతి - స్వాతంత్ర్య ఋత్విక్కు,
అమృత యోగ వాఙ్మయ ప్రవక్త.

గురువులు

కలరు నాకు దేశికులు జీవితమ్ములో
ఎంచ అర్గురు జగదేక గురులు !
"ఏమి - ఎందు - కెప్పు - డెట్టు లే చోటిలో,
ఎవరు ? పేర్లు జగతి కెల్ల తెలుసు.

స్పర్థ

గొప్ప స్పర్థ సాగు గుఱ్ఱాలతో సదా
యుగ యుగాల నుండి - గాడిదలకు;
గాడిదలను తరచు గౌరవించెడి వారు
పెక్కు మంది కలరు గడుసు వారు.

దాత

మనుజు డెవడు విడడు తన జేబులో డబ్బు,
　　పుడమి కవలి వెలుగు లెడద లేక,
ప్రతిఫలమ్ము నుంత వాంఛింపకుండగా,
　　దాన మిచ్చు త్యాగి - ధన్య జీవి.

ప్రగతి

''ప్రగతి'' - ''ధర్మములను ప్రవచింప కష్టమ్ము
　　ధర్మమునకు ఆత్మ - త్యాగ నిరతి;
బహు జన సుఖ శుభములు - బహుజన శ్రేయస్సు
　　ప్రగతి కాత్మ - ''మార్పు'' జగతి యందు.

ప్రగతి

విలువ గలిగి నట్టి - విశ్రాంతి ఇసుమంత
　　లేదు - నవ్య నాగరికత యందు;
గుండె లోన ప్రగతి పండించు కొనువాడె
　　గొప్ప ధన్య జీవి - కోవిదుండు.

మంచి గుండె

గొప్ప వారియందు గుండె పండదు గాని
　　మేరు శిఖరి వంటి మెదడు పెరుగు;
విలువ గలది ఎంచ వేయి మేధల కంటె !
　　మంచి గుండె ఒకటి మనుజ జగతి.

ముఖ్యం

పనస వృక్ష మందు పండ్లు ముఖ్యము గదా
　　చాలు మల్లె యందు పూలు - చాలు,
మొగలి రేకు లందు ముఖ్యమ్ము నెత్తావి
　　పెరటి కల్పకమ్ము అరటి మొక్క.

దూరదర్శనం

కాదు కేవలమ్ము – కాల విక్షేపమ్ము
దూరదర్శనమ్ము దొడ్డ విద్య,
వినము నమము నుమ్ము – వ్యసనమ్ము కారాదు;
ఎంపి కవసరమ్ము ప్రేక్షకులకు.

కాలం

ఏది మందు భగ్న హృదికి ? కాలము తప్ప ?
గాన విరతి తప్ప ? కవిత తప్ప ?
సాధ్యమైన యెడల – జ్ఞాన యోగము తప్ప ;
గుండె కట్టు శాంతి గూడు తప్ప.

విశ్రాంతి

హృదయ మందు సతము ఏకాంత విశ్రాంతి
ఎంత సేవు గూర్చు సంతసమ్ము ?
యోజనా తపస్వి – కుపవాసమును వోలె,
అభ్యుదయము కూర్చు నప్పుడపుడు.

క్రైస్తవం

క్రైస్తవమ్ము కడగి కరుణార్ద్ర హృదయమే;
నీతి అనెను ముక్తి హేతు వనెను.
శాంతి దాంతి కొంత క్షమ కొంత దయ కొంత
వెల్లి విరియ జేసె విశ్వ మందు.

శ్రాద్ధ కర్మలు

ప్రేమ – తల్లి దండ్రి మీద చూపుట మేలు,
బ్రదికి యున్న వేళ భక్తి తోడ,
చచ్చి పోవు పిదప – శ్రాద్ధ కర్మలకునై
సలుప నేల వ్యయము శక్తి మించి ?

వేమన పద్యం

వేమన కవనమున విశ్రాంతి కన్పించు
మొదట పాద మందు తుదిని గూడ.
గణ గణమున యతి కన్పించు తరచుగా
సంస్కృతమును మించి ఛంద మందు.

శ్రీపాద తీర్థం

స్వీకరింప వచ్చు - శ్రీ పాద తీర్థమ్ము;
చేరి గురువు గారి శిష్య వరులు,
ఒక్క శిష్యుడు తిను - ఉచ్ఛిష్టమును పూని,
వేయ వచ్చు భక్తి వెల్గ తలలు.

అలంకారము

''మెరయు ఆమె ముఖము - స్థిర తటిల్లత వోలె''
ఏ అలంకృతి అది ? యెంచి చూడ, ??
''ఉపమ కాదరయగ - ఉత్ప్రేక్షయే'' యంచు;
గొప్ప పండితుండు చెప్ప వచ్చు.

కవిత

కవిత లోన గూడ - కలదు - లావణ్యమ్ము,
మాట కంద నట్టి మధురిమలు
కవిత బ్రదుక గలదు - కాలాని కెదురీది;
నాట్య మాడు జనుల నాల్క లందు.

శిల్పం

కనులు రెండు తోచు - కల్హార దళములై
యోగ దృష్టి కలిగి యుండు - తరచు,
నన్నగిల్లు కౌను - జఘనమ్ము నిడివిదే,
చిత్ర లేఖనమున - శిల్ప మందు.

అచ్చుకై

పట్టు పుట్టములకు బంగారమునకునై
ధనము వ్యయము వెట్టితనమె గాని;
కవిత అచ్చు కొరకు - కాగితమ్మునకునై,
ఖర్చు పెట్ట వచ్చు - కవి వరుండు.

కవి

ఊరు పేరు లేక - ఉత్తమోత్తమ కవుల్,
జగతి - నీడ్వ వచ్చు సగటు బ్రదుకు!
సరకు గొనదు కవిని సమకాల సంఘమ్ము
చచ్చి పోవు పిదప మెచ్చు వచ్చు.

కుకవి

వ్యయము చేయ ధనము - స్వార్థమ్ము కోసమై
వ్యర్థ జీవి - మనిషి - బ్రదుకు నందు;
వాడు నెడల భాష - ఆడంబరత - కోరి,
గొప్ప పండితుండు - కుకవి యగును.

కవి

చిటుకు చిటుకు మనెడు - శీఘ్రము వేగము తోడ
అచ్చు వేయ గలుగ - ముచ్చ టమర;
పుస్తకాలు పెక్కు పుంఖానుపుంఖమ్ము,
కవికి సంబరమ్ము కలుగు చుండు.

వెన్న ముద్ద

అలతి అలతి తేట తెలుగు పల్కుల తోడ,
ప్రౌఢ పద్య కవిత వ్రాయ వచ్చు !
చల్ల - వెన్న ముద్ద - అల్లి బిల్లిగ తేలు,
బరువు లేక ఉండ వచ్చు - బలము.

స్వీయ కవిత

కవికి - స్వీయ కవిత కన్పించు ముద్దుగా,
దోష మొకటి గూడ తోచ దెపుడు !!
సంతసించు - జనని - సంతానమును గాంచి,
ఉండు గాత సహృదయుండు - ప్రశ్న.

కవిత

మనసు మడత లందు - మాలిన్యములు పెక్కు
ప్రతి దినమ్ము చేరు బ్రతుకు లందు;
కడిగి వేయగలదు - కవితా రసము దూరి,
మనసు పొరల చేరు మలినములను.

అనుభవం

ఏది కాలమునకు - ఎదురీది మనగల్గు ?
అవని మీద - మంచి కవిత తప్ప ?
ప్రజల అనుభవాల ప్రతిబింబ మైనచో;
రచన శాశ్వతముగ బ్రదుక గలదు.

మమత

అందకత్తె గాని ఆడపిల్లయె యైన,
పెండ్లి చేయు కూర్మి పేర్మి - తండ్రి;
అట్లె ముచ్చట పడి - రచన అచ్చువేయగ వచ్చు,
వెఱ్ఱి మొఱ్ఱి దైన వేడ్క కవులు.

కవిత

అర్థ మగును - కవిత - వాఖ్యానములు వినా,
అనుభవమ్ము కవిత ప్రాణ నాడి;
సహృదయునకు చాలు - ఛందస్సు శబ్దాలు;
వేరు లోకములకు వెడలి వచ్చు.

### సామెతలు

రస గుళికలు జాతి రత్నాలు భాషలో,
యతులు గలిగి ప్రాస గతులు గలిగి,
సామెతలను పేర - జనుల నాల్కల ఆడు;
అనుభవమ్మె వాటి ప్రాణ నాడి.

### అభ్యుదయ కవిత

అచ్చమైన కవిత ఆనంద విశ్రాంతి
కూర్చ వలెను ప్రజల గుండె లందు;
అభ్యుదయ కవిత్వ మల్ల కల్లోలమే,
గజి బిజి కలవరము కలవరింత.

### ధర్మ పథం

మేటి కలము కంటె - మేలి గుండియ మేలు
పిక శుక రుతి కలము ప్రేల నేల ?
గొప్ప దేమి కలదు ? గుప్త దానము కంటె,
త్యాగ సానుభూతి ధర్మ పథము.

### కవి హృదయం

ఎరుని యందె కలవు - నరకమ్మె నాకమ్మె !
భాష లోని అర్థవాదములవి !
శబ్ద జాల మెల్ల సంకేత సంక్రాంతి
కవి హృదయ మెరుగుట అవసరమ్మె

### కవిత

మెదడు లోన పెట్టి మేటి చక్కిలి గింత
గొప్ప కవిత యంచు చెప్పరాదు;
గుండె లోపల సుడి గుండముల్ చేకూర్చి,
పార వలెను - కవిత - ఏరు వోలె.

కార్యశూరుడు

జగతి - అనుభవములు - జ్ఞాన సిద్ధాంతముల్
కలిపి వంతెనలను కట్టు నెవడు ?
ఆచరించి యెవ్వ డాశయాలను చూపు ?
అతని కార్య శూరు డనుట చెల్లు.

గురుడు

స్వామి - యోగివరుడు - సర్వజ్ఞ బిరుదుండు !
ఏటి నీట మునిగి యెట్లు చచ్చె ?
శిష్య వరులు చుట్టు చేరి యుండిరి గాని
ఈత రాదటంచు ఎవరి కెరుక ?

గుస గుసలు

అనుభవైక వేద్యమౌ అంశములు కొన్ని
ఉండు దాగి మనుజు గుండె లోన,
గుండె కలవరించు - గుస గుసల్ వినిపించు
కనులు విరహ కవిత కార్చు వచ్చు.

పాద పూజ

గురువు గారి బోధ - గొప్పదే కావచ్చు
ఆచరింప వచ్చు అనుసరించి,
గురువు పాదపూజ జరిపించు కొనరాదు;
చేయ దలుప మూర్ఖ శిష్యు డెవడొ.

పాద పూజ

ప్రాణ హింస - జంతు బలి గొప్ప తప్పైన,
గురుని పాదపూజ గొప్ప దౌనె ?
పుట్ట లేదు గురుని బోధ - పాదాలలో !
పాదపూజ గురుని పతితు జేయు

పాద పూజ

వినయ వేషధారి - విజ్ఞాని కావచ్చు
అంతరంగ మందు అహము దాచి,
అమృత నిభము లైన - ఆశీస్సు లందించు,
శిష్య గణ వినమిత శిరము లందు.

సన్మానం

చాల వెపుడు - సుకవి సన్మాన మరయుగా
రెండు కనులు మరియు రెండు చెవులు;
ప్రతిభ యున్న వారు - బహుమానములు పొంద,
విస్తరిల్లు ప్రగతి విశ్వ మెల్ల.

సత్కవి

సత్కవీశు డెవుడు సమకాలికుల చేత
పృథివి లోన - గౌరవింపబడడు;
గౌరవింపబడిన - కారణాంతర ముండు;
లౌక్య లవిత వాక చక్య ముండు.

కవిత

బ్రదుకు ఆటు పోటు బరువు బాధ్యత లెల్ల,
అంతరింప వలయు కొంత సేపు:
మానవుండు పొందు ఆనంద విశ్రాంతి;
కవిత వలన - లలిత కళల వలన.

ఛందస్సు

ఈత కొట్టు - తలపు లెల్ల చేపల బోలి !
మేటి కడలి - మనిషి మెదడు సుమ్ము;
మెట్ట బడిన యట్టి మీనముల్ భావాలు !
ఛంద మనెడి నీటి పొందు లేక.

తర తరాలు

సరస కవిత లోని - స్థిర తటిన్నిభ దీప్తి
భావనా చమత్ ప్రభాస పటిమ;
కారయిత్రి లోని గమకముల్ యమకముల్
తరతరాలు మెచ్చి తలల నూపు.

భక్తి

అంతరాత్మ గొప్ప దాడంబరము కంటె,
బహువచనము కాదు భక్తి యనిన;
లోక మందు - భక్తి - ఏకాంత నిష్ఠయే;
వశము కాదు హేతు వాదమునకు.

కవిత

కవిత - రత్న ఖచిత కంకణంబా ? కాదు;
కరగి గుండె కార్చు - కంటి నీరు;
కవి కలమ్ము - కల్కి ఖడ్గమ్ముగా మారి;
నరుకు గాత - దుష్ట శిరము లెల్ల.

సద్గుణాలు

పొరు-నెత్తు రెండు - బహుళ దౌర్బల్యముల్
ఈద వలయు మనిషి ఏటి కెదురు;
కొన్ని సద్గుణాలు గోచరించిన చాలు !
ధరణి మీది నరుడు ధన్య జీవి.

కవిత

వెడలు తీగె లున్న - విద్యుత్తు ప్రసరించి,
వెల్గు ఉపకరణము లెల్ల యెడల;
కనులు గాంచ లేవు - కవితా ప్రయాణమ్ము,
గుండె నుండి వేరు గుండెలోకి.

కవిత

సామవేద నాద సంహితా రస ధ్వనుల్;
పొంగెడి కవితాంతరంగ మందు;
అమరు - ఛంద మందు - అంతః ప్రవాహముల్,
చిందు త్రొక్కు నాద బిందు కళలు.

కవిత

వెడల వలెను - కవిత - ఎడద లోతుల నుండి,
కలము వ్రాయు రచన కవిత కాదు,
మంచి తనము లేక - మానవత్వము లేక,
ఎవడు కాడు కాడు కవి వరుండు.

కవిత

మెరుపు తీగ వోలె - మెదడు లోపల దూరు!
ఎచట నుండి వచ్చు ?  ఎపుడు వచ్చు ?
హేతువాదమున కతీతమౌ అనుభూతి;
కదిపి కుదిపి వేసి కవిత యౌను.

మత్తు

కవిత యందు కలదు - కల్లు లోపల లేదు !
మాధురీధురీణమైన మత్తు;
మరణ మొందు వరకు - మత్తుండు కవితలో,
మాయ మగు మిగిలిన మత్తు లెల్ల.

కష్టాలు

కష్టములకు జనులు - కంగారు పడరాదు;
అవసరములే అన్ని అనుభవములు;
కష్టము లొనగూర్చు - కసరత్తు బ్రదుకులో !
కూర్చు - తుష్టి తుదకు గొప్ప తుష్టి.

మగువ

మగువ యొకటి ప్రతి మహనీయు చరితలో,
చేరి, తెరకు వెనుక సేవ చేయు;
ఆమె తోడు లేక – అంత ప్రావీణ్యమ్ము,
అతడు చూప గలడె – బ్రతుకు లోన.

రౌడీల రాజ్యం

కనుల ముందు జరుగు క్రౌర్యమ్ము తిలకించి,
ఊరకుండ రాదు – పౌరు డెవడు.
ప్రజలు కలిసి మెలిసి – రౌడీల రాజ్యమ్ము
సాగనీయ రాదు సంఘ మందు.

సేవకుడు

చిత్త శుద్ధి తోడ – సేవకుం డున్నచో;
స్వేచ్ఛ పడయ వచ్చు జీవితమున,
జగతి లోన అతడు సాధించునది లేదు;
చిత్త శుద్ధి లేని సేవ వలన.

త్రికరణ శుద్ధి

త్రికరణ పరిశుద్ధి శ్రేష్ఠమ్ము శ్రేష్ఠమ్ము;
మనుజ జీవితమున మాన్యతమము;
సగటు మనిషి గూడ సాధింప సులభమ్ము
త్రికరణ పరిశుద్ధి – దివ్య దీక్ష.

అంతరాత్మ

అంతరాత్మ కంటె – ఆక్షేపణము చేయ
అర్హులెవరు గలరు – అవని యందు ?
అంతరాత్మ బోధ ఆలకించిన చాలు;
బ్రదుకు నందు సుఖము పడయ వచ్చు.

### కలలు

కలలు గనుట వేరు – కార్య శౌర్యము వేరు !
పదవి గొప్ప పసిడి పంజరమ్ము;
పనులు చేయవలయు – తన కిష్టమే లేక;
పరుల బరువు మోయ వలయు తానె.

### సహృదయుడు

కానుపించు చంద్రు కవులు వందలు వేలు;
ఉండు నెచటొ సహృదయుండొకండు;
మేలి రచన మెచ్చు మేధావి యెవడయా ?
మత్సరమ్ము లేని మంచివాడు.

### అందము

కడలి యందు కలదు – కలికి గాంభీర్యమ్ము
చిన్ని యేరు చిమ్ము చిలిపి సొగసు;
చిందు – ప్రకృతి – పెక్కు అందాలు చందాలు !
వేటి తీరు తెన్ను వేరు వేరు !

### భార్య

అరయ దగును భార్య ఆత్మ సౌందర్యమ్ము
పడుచు దనము – తోలు పసిమి గాదు;
తనకు చెలిమి కత్తె – తల్లి – పిల్లలకు నెల్ల;
మేలి గృహిణి యైన మేలు – చాలు.

### జయం

సొగ కలరు – జనులు – జననీ జనకు లౌచు;
చూపి ప్రేమ – "జయము" చుట్టు చేరి;
ఉండు అపజయమ్ము – ఒక అనాథ శిశువై;
నిలువ చోటు లేక – నీడ లేక.

వక్రం

సృష్టి లోన లేని కృతక కల్పన మేది ?
గమన మందు ప్రథమ గణ్య మేది ?
త్రిప్ప గలిగె నేది ? రేఖా గణిత విద్య ??
వ్యాస సామ్య మున్న వర్తులమ్మె.

అపర నైటింగేలు

ఆమె దీపహస్త - అపర నైటింగేలు !
దీన సేవ చేయు పూని ఆమె;
తిరుగ సతత మామె - కరుణార్ద్ర హృదయమ్మై;
గొప్ప దేది ? జాలి గుండె కంటె ?

అంతరాత్మ

అంతరాత్మ పెరుగు ధ్యాన యోగము చేత;
మార్గ దర్శకమ్మె మానవులకు;
విప్పి చెప్ప లేవు వేదాంత శాస్త్రముల్,
మంచి చెడుగు వింగడించ లేవు.

అహం

అహము - స్వార్థ బుద్ధి - ఆత్మ వంచన గూర్చి;
పాడు చేయు మనిషి బ్రదుకు తరము,
అంతరాత్మ దీప్తి - ఆధ్యాత్మ యోగమ్మె,
ప్రజ్వలింప జేయ వచ్చు - సతము.

కాలం

పారు చుండు నదుల నీరు ముందుకే సదా;
పార దెపుడు వెనుక వైపు మరలి;
బ్రదుకు తీరు తెన్ను నది వంటిదే గదా;
కాల లహరి యందు గతము గతమె.

ఆడంబరము

వినయ మౌని యగును విజ్ఞాని సర్వథా;
    వెలుగు గుండె వెల్లి విరిసె నేని,
హాస్యమునకు నెలవు - ఆడంబరము సదా;
    అల్ప బుద్ధి మేలు - అహము కంటె.

మామ

తండ్రి పైన చూప - తనయుండు ప్రేమమ్ము;
    వింత ఏమి కలదు ? విశ్వ మందు ?
అల్లు పైన మామ అభిమానముల యందు,
    త్యాగ యోగ సిద్ధి తాండవించు.

చేతలు

కవియు గాత ఇంక కవన వేదాంతముల్,
    బ్రదుకు లోని ఆచరణము నందు;
చెప్పు నట్టి గొప్ప సిద్ధాంతముల గాక,
    నీతి తోచు గాత - చేత లందు.

ప్రజాకిరీటం

ఎవడు తాల్ప గలడు - ఈ ప్రజా మకుటమ్ము ?
    బరువు - క్షణము క్షణము పెరుగు చుండు;
ఆకసమ్ము - ఎపుడొ - అవనిపై పడవచ్చు !
    రేయి గూడ కనులు మూయ రాదు.

ప్రజలు

పాల పొంగు సుమ్ము - ప్రజల ఉద్రేకమ్ము !
    లేదు చోటు హేతు వాదమునకు !
ఉద్యమాల చేరు ఉన్మాద పరకోటి;
    పిచ్చి గుబులు తరచు వచ్చు ప్రజకు

### బ్రదుకు

ఆత్మ వంచనమ్ము - ఆనంద యోగమ్ము,
దివిని చేర వచ్చు - భువిని నిలిచి;
అభ్యుదయము లేదు - అన్య వంచన లేక !
బ్రతుకు - సున్న లోని బండి సున్న.

### స్వమతాభిమానం

సంఘ మందు ఎపుడు - స్వమతాభిమానమ్ము
వేయకుండు గాత - వెఱ్ఱి తలలు;
మనుజు లందు - ఎవడు మనవాడు కాడయా ?
చూడు మంచితనము చూడు ప్రతిభ.

### బెదిరింపు

శాత్రవులను ఎట్లు సాధింప గలమయా ?
''జయము'' సంశయమ్ము సంగరమున;
అదర గొట్టి ముందు బెదిరించుటే - మేలు !
పోరు నెవ్వ రైన కోరు కొనరు.

### నేత

అల్ప భావములు అనల్ప ప్రణాళికల్;
చేరి ఏక యాత్ర వేయలేవు;
త్యాగ గుణము లేక ఆదర్శములు లేక,
నిర్వహింప లేదు - నేత పనులు.

### కావ్య భాష

వాక్కు తరచు అర్థవాద హేషా ఘోష,
మాట మాట మధ్య మలుపు లణుగు,
వ్యాకరణము గాదు - వ్యవహారమును గాదు;
క్రాంత దర్శనమ్ము - కావ్య భాష.

చెట్లు

చీదరింప గలవు - చెట్లు - మౌనమ్ముగా;
చెట్లు స్వాగతమ్ము చెప్ప గలవు;
తీగ కున్న ప్రతిభ తెలియ జాలరు ప్రజల్;
ప్రజల సేవ కొరకె - బ్రతుకు చెట్లు.

సుకవి

ద్రష్ట - కవి వరుండు - స్రష్ట మాత్రుడు గాడు;
సుకవి లోకతంత్ర సూక్ష్మ వేత్త;
అతని నోట చాటు ఆకాశ వాణియే;
నిత్య మాత్మ సత్య నీతి పథము.

ప్రజాస్వామ్యం

అంగవికలుడైన - అజ్ఞానియే యైన,
చదువు రాక యున్న - పదవి వచ్చు;
ఇది ధనేశ్వరత్వ మిది ప్రజాస్వామ్యమ్ము !!
పిరికి పీన్గు మేటి వీరు డగును.

రసం

సార్థక మగు కవిత - ఆనంద యోగమ్ము !
దాని రస మటంచు - తలప వచ్చు;
అనుభవైక వేద్య మా రసోపనిషత్తు;
దివ్య హృదయ మున్న తెలియ నగును.

పద్యం - పాట

ప్రాకు - తీగె వోలె పాట - పందిరిపై;
జంత్ర వాద్య తతుల జతను కోరు;
ఎదుగు - చెట్టు వోలె - ఏకాంత విశ్రాంతి;
పద్య మాడు ప్రజల వాల్క లందు.

మనసు

మనిషి లోని మనసు - మాయదారిది గదా,
ప్రతిభ కాట పట్టు - భ్రమల పుట్ట;
మానవ స్వభావ మర్మజ్ఞుడే లేడు;
వింత లందు గొప్ప వింత - మనసు.

అంతరంగ వైభవము

వ్యయము చేయు మనిషి - అంగ వైభవముకై,
తిండి అవసరమ్ము దేహమునకు,
రంగ వైభవమ్ము - రస మయ క్షాళనల్;
అంతరంగమునకు అవసరమ్ము.

పద్యం

కంఠ మెత్త వచ్చు - గానమ్ము రాగమ్ము;
పద్య పఠన మందు ప్రాయికముగ;
పద్య మందు - కొంత భాగమైనను చాలు;
సహృదయుండు చదివి చాట వచ్చు.

మనసు

తలప వచ్చు - ప్రజలు - తల కొక్క విధముగా;
ఎవరు చూడ గలరు ? హృదిని దూరి ?
చెడ్డ తలవు విడిచి - చెడ్డ చేష్టలు వీడి,
మనసు చక్క దిద్దు కొనిన చాలు.

బ్రదుకు

సంఘ మందు - నరుడు - జన్మించుటకు ముందె,
బాధ్యత లెదురౌను - బ్రదుకు నందు;
కలవు - నిర్వహింప - కర్తవ్య బహుళముల్ !
బ్రతుకు తీర్చ దగును క్రతువు వోలె.

కవిత

ప్రతిభ పరిధి దాటు - భాషా పటిమ దాటు;
జంత్ర వాద్య బృంద జతులు దాటు;
సహృదయుండె తెలియు సాహిత్య లయ శక్తి !
గాన కళను మించ గలదు - కవిత.

కల్మి కత్తి

కల్మి కత్తి చేసి కలము - జీవితమున,
కదను త్రొక్కు వాడు - కవి వరుండు
నవయుగ ప్రవక్త కవి వరేణ్యుడు సదా !
క్రొత్త ప్రొద్దు పొదుపు కోరువాడు.

పాతదనం

పాతదనము నందు - పావనత్వము లేదు;
మనుజ మాత్రులు గద మునులు గూడ;
దీర్ఘ దృష్టి బరుప - దేవతల్ రాక్షసుల్
నేల మీద గలరు - నేడు గూడ.

కాల మహిమ

వెల్లి విరిసి - ప్రతిభ - విశ్వ రూపము చూపు;
కలిసి వచ్చి నపుడు కాల మహిమ,
అభ్యుదయము వచ్చు - అవకాశములు కల్గ;
లేడు లేడు ప్రతిభ లేని వాడు.

జాలి గుండె

ఎక్కు కారణముల ప్రేరేపణము వల్ల;
తప్పు చేయ వచ్చు - తరచు మనిషి;
తప్పు చేయు వెడల - తా జాలి గుండెలో;
తెలిసి మెచ్చ వచ్చు దేవు డెపుడు.

ఆర్ష వాక్క్య

ఆర్ష వాక్క్య లందు - వ్యాఘాతములు తోచు;
    స్థూల దృష్టి తోడ - చూచి నపుడు,
వారి వారి స్థాయి - తారతమ్యము బట్టి,
    అన్వయించు కొనుట - అవసరమ్ము.

స్వగతం

ఉత్త మాశయాల ఉత్తేజమును పొంది;
    నాదు జీవితమ్ము నడుప దలతు;
సంఘ హితము మేలు - స్వార్థ లాభము కంటె
    శ్రేష్ఠ నీతి - ప్రగతి నిష్ఠ ఒకటె.

స్త్రీ

ఆడవారి బ్రదుకు త్యాగ యోగము కదా,
    ఆడదాని జన్మ హక్క్య - ప్రేమ;
భారతీయ వనిత - పతిభక్తి కల్యాణి;
    చరిత మరువ లేదు - సహ గమనము.

చదువు

చదువు - చదువు కాదు సహనమ్ము లేనిచో;
    బ్రదుక దగును పరుల బ్రదుక నిచ్చి;
ఇవ్వ వలెను విద్య హృదయ వైశాల్యమ్ము;
    క్రొత్త క్షితిజములను గూర్చ వలెను.

పౌరవ

బ్రదుక దగును - మనిషి ప్రతి రోజు చురుకుగా
    చచ్చి పోవు వరకు సార్థకముగ.
బుద్ధి వాడ వలెను - గొఱ్ఱె వాటము వద్దు;
    సొంత బుద్ధి మేలు - పౌరవ మేలు.

### కర్తవ్యం

త్యాగ యోగి ఎవడు యావజ్జగత్తులో ?
    దాన కర్ణు డెవడు ? ధన్యు డెవడు ??
కోరి చేయువాడు గొప్ప కర్తవ్యమ్ము;
    ప్రతిభ వెదకి గుర్తు పట్టువాడు.

### కవి హృదయం

నప్పు బోదు తరచు - నైఘంటు కార్థమ్ము
    పలుకు బడికి - కావ్య భాష లోన;
కవి హృదయము తరచి కనిపెట్టి తరువాత
    శబ్దములకు వ్యాఖ్య పలుప దగును.

### పదవి

సహజమైన శక్తి సామర్థ్యముల కేమి ?
    పదవి కూర్చ వచ్చు ప్రజ్ఞ కొంత;
చదువు కేమి ? మెదడు సానబట్టును గదా;
    ప్రజల తోడి గాఢ పరిచయమ్ము.

### కార్య శూరుడు

కార్య శూరు డతడు - కాలు చేతులు కద్గి,
    మూల కూరుచుండి మూల్గ లేదు;
గగనమునకు అత డెగురు రెక్కలు వచ్చి,
    వేల్పు విల్లు అతని వేడ్క పట్టు.

### ఆట

అతడు గూడ ఆటలందు పాల్గొన్నాడు
    బహుమతి ఒక టైన పడయకుండ
ఆట ధ్యేయ మేది ? ఆనంద విశ్రాంతి;
    గుండె మండ చేయు గుబులు కాదు.

అనుభూతి

మండు టెండ లోన - మాడి పోయిన వాడె,
వెట్టు నీడ విలువ కట్ట గలడు;
ధరణి - నరుల బ్రదుకు - ద్వంద్వ బద్ధము సుమ్ము;
అనుభవమ్ము సాక్షి కంతరాత్మ.

పెద్ద మనిషి

ఉబ్బి పోయి తాను తబ్బిబ్బు కారాదు;
పొగడ వచ్చు ఎవరొ మొగము ముందె !
మధుర మధుర మౌన మంద హాసము చాలు !
పెదవి విప్పరాదు పెద్ద మనిషి.

కష్టాలు

కడుపు నిండ తిండి - కనుల నిండుగ నిద్ర
పండ నీదు మనుజు గుండె కాయ;
ఘనత రాదు - మనిషి కష్టాలు పడకుండ,
వజ్ర దీప్తి - సాన బట్ట - పెరుగు.

ఉగాది శుభాకాంక్ష

అమరు గాక ఆయు రారోగ్య సంపదల్;
మీ కుటుంబమునకు మీకు సతము;
బ్రతుకు పేర్చి నట్టి పాత కోర్కులు తీర్చి
వరలు గాక - క్రొత్త వత్సరమ్ము.

నాట్యం

పాత నీరు నిలుచు - పసరు కోనేరుగా
మారి నాట్య విద్య మహిమ తరిగె;
కలలు చిందులాడు - జలపాత రీతిగా;
క్రొత్త వెలుగు జిలుగు కూర్చు కొనుత.

అచ్చ తెనుగు

అచ్చ తెనుగు సొసుపు గచ్చ కాయల తోడ;
అల్లిబిల్లి కవిత లల్ల నేల ??
మెరపు తీగె హొయలు మిరుమిట్లు కవితయౌ,
హృదిని తళుకు బెళుకు లీను గాత.

స్రష్ట

కరుణ యున్న వాడు - కల్యాణ గుణుడంచు;
చాట లేను - నేను స్రష్ట గూర్చి;
పెద్ద చేప మింగు పిన్న చేపల నెల్ల,
అరయ హింస సృష్టి గరిమ నాభి.

మంచితనం

అంద జేసె - సుకవి - సందేశ మొకనాడు;
మతము - గీతము - గతము మరవ దగును;
మంచితనము చాలు - మానవత్వము చాలు;
పాటు బడుట మేలు - ప్రగతి కొరకు.

ఆదర్శ తేజస్వి

మనిషి - తరము - కామ - మద మోహముల గుట్ట;
లోభ కోప తాప లోలుపుండు;
అప్పు డపుడు నరుడు ఆదర్శ తేజస్వి;
త్యాగమయమౌ జీవితమ్ము గడుపు.

అపకారం

మానవులకు - గొప్ప ఆనంద మేమిచ్చు ?
పరుల కొరకు చూపు కరుణ గాక;
స్వార్థ బుద్ధి - పరుల కపకార మొనరింప,
విదుర రాదు - కఠిన హృదుల కైన.

నిజం

నిజము నరయు టనిన ప్రజ - కష్ట సాధ్యమే !
చేరి యుండ దెవరి జేబు లోన
అవని రాతి నుండి - అపరంజి తీయుటే;
నేల దాగి యుండు - నిజము తరచు.

సంఘ సంస్కారం

సలుప వచ్చు తరచు - సంఘ సంస్కారమ్ము;
మూల కర్తనమ్ము - వీలు కాదు;
కడగి గీయ వచ్చు గడ్డమ్ము ప్రతిరోజు;
మరి యథాతథమ్ము మరల మరల.

బ్రదుకు

ప్రకృతి శక్తి చూచి - పరవశించెద నేను;
మ్రాన్పడెదను ధనము మహిమ చూచి,
సంఘ శక్తి గాంచి - సంప్రదాయము గాంచి
కార్చ గలను వేడి కంటి నీరు.

బ్రదుకు

పుడమి మీది మనిషి బుద్బుద ప్రాయుడే !
మహిత దీర్ఘ కాలమాన మరయ;
మనిషి తెలియ లేడు మరణ మార్మిక శక్తి
తెలియ లేని వెన్నొ కలవు కలవు.

చదువు పదవు లెల్ల పంకెళ్ళు మాత్రమే;
వెలుగు చీకటి పెన వేసుకొనును,
అరయ బ్రదుకు పెద్ద చెరసాలయే గదా !
ఏది మానవులకు స్వేచ్ఛ ఏది ?

ప్రాణ శక్తి

మందు – జీవమున్న మనిషికే వర్తించు;
పనికి రాదు చచ్చు వాని కెపుడు;
ప్రాణ శక్తి లేని – బడుగు పీనుగు కేల ?
వివిధ కళలు గాని – విద్య గాని.

పరిమళం

గుర్తు పట్ట గలుగు – గ్రుడ్డి వాడే యైన
పారిజాత కుసుమ పరిమళమ్ము !
చూడ కుండ గూడ – సులువుగా ప్రజలెల్ల;
గుర్తు పట్ట గలరు గొప్ప దనము.

ప్రేమ

అనుభవింప వచ్చు – అద్వైత యోగమ్ము,
భూమి మీద ఒక్క ప్రేమ యందె;
ప్రేమికులను జగతి ప్రేమించు – మన్నించు;
సృష్టి యెల్ల మిథ్య – ప్రేమ తప్ప.

పెండ్లి

మానసమ్ము – ఎవరి పైన పోయిన గాని;
మనుము విడిచి పెట్ట కునికి మేలు;
అదియె పెండ్లి లోని అంతర్ విశేషమ్ము;
సంఘ శాంతి యోగ సంగ్రహమ్ము.

పరివేషం

వేష భాష లందు – విద్యా తపోజ్యోతి,
వెలికి ఉబికి వెల్లి విరియ గలదు !
శిరము చుట్టు వెలుగు – పరివేష వర్చస్సు;
క్రాంత దర్శి కనులు – కాంచ గలవు.

### పరిసరాలు

పరిసరాల తోడ - బ్రదుకు సంధానించు
చాకచక్య జీవ శక్తి వలయు;
సంఘ జీవి నరుడు - సహకారమే శాంతి;
సహన విరతి గొప్ప సద్గుణమ్ము.

### కవితా జగత్తు

ఆకు రాల దచట - అచట వాడదు పువ్వు;
అది కవిత్వ జగతి అనగ బరగు;
మించు తీగ లచట మెరయు నిల్కడ గల్గి;
కార్చు గలవు శిలలు కంటి నీరు.

### జ్ఞాని

జ్ఞాని యెవ్వడైన సర్వజ్ఞుడా ? కాడు !!
వినయ రహితు డెవడు - వేత్త కాడు;
జ్ఞాని యెవడు ? సతత సంశయ గ్రస్తుడే;
క్రొత్త ప్రొద్దు పొడుపు - కోరు - వేత్త.

### విస్సన్న

వేద మగును - వేత్త - విస్సన్న చెప్పుచో;
పొల్లు మాట గాని బొంకు గాని,
ప్రజలు నమ్మ లేరు - నిజమె యైనను గాని,
చప్పు పుచ్చు వెధవ - చాటు నెడల.

### సృష్టి వైశాల్యం

వేయి వత్సరాల వెలుగు దూరము దాటి,
విస్తరించి యుండు విశ్వ మెల్ల !!
హేతువాద మెపుడు - సృష్టి సర్వస్వమ్ము
తెలియజాల దెపుడు - కొలువ లేము.

దళితులు

మేడ మిద్దె లందు - మేటి సంపదలందు,
పాలు - దళిత జనుల కేల లేదు ?
పదవి అనిన ఏమి ? - బానిసత్వము గాక;
చదువు వచ్చు వారి సంఖ్య - ఎంత ?

గొప్ప శిష్యుడు

గొప్పవాడు గెలుచు - గురువునే యెదిరించి,
ఉభయ తారక మగు యుద్ధ మపుడు;
ప్రతిభ అతిశయించు - పావన స్పర్ధచే
జగతి హితము గూర్చి ప్రగతి గూర్చి.

సహృదయుడు

క్రోధ మోహ లోభ గుణ గణమ్ములు పెక్కు;
ఉండు దాగి మనుజు గుండె లోన!
ప్రజ్ఞ ప్రతిభ - గుర్తు పట్ట గల్గిన వాడు,
ఒక మహర్షి - మాన వోత్తముండు.

యోగి

విద్యమాన విశ్వ విశ్వాంతరాళమ్ము
మనుజు మనసు లేక - మాయ మగును;
మనసు నిగ్రహించు మనుజుడే - వేదాంతి;
కోవిదుండు - ముక్త జీవి - యోగి.

యోగి

యోగి - కవి వరుడగు - ఒక మెట్టు దిగజారి,
మెట్ల వరుస వేరు - మేడ వేరు;
మెట్ల నెక్కు చున్న మేధావి - కవి నేత
యోగి మేడ మీద నుండు వాడు.

అణగి

అణగి యుండు మనుజు డవకాశములు లేక,
తెగువ చూప వలయు - ప్రగతి కొరకు;
వదలి వేయ వచ్చు - ప్రతిభా విశేషముల్,
పైకి తెచ్చు కొరకు బడుగు ప్రజల.

గిరిశిఖర ప్రబోధం

చేసె - ఏసు క్రీస్తు శిఖరి ప్రబోధమ్ము;
సర్వ తత్త్వ సార సంగ్రహమ్ము;
గుండె లోన కరుణ పండించు కొనుటయే;
తారకమ్ము - పరమ ధర్మ నీతి.

కామ స్వరాలు

లోక మందు - పెక్కు కామ స్వరము లుండు;
అక్షరాక్షరముల అణగి మణగి;
అర్థ వాద ముండు అర్థ భేదము లుండు;
సంహిత కవసరము - స్వర నిరూఢి.

మతములు

అచ్చమైన మేటి హైందవుం డొకడైన,
లేడు - పుడమి మీద లేడు లేడు;
లేడు క్రైస్తవుండు లేడు ముస్లిము లేడు;
మాయదారి పేర్లు మతము లెల్ల.

ముఖ్య కారకుడు

కర్త కాక - ముఖ్య కారకుండెవ్వడో !
అణగి యుండు గొప్ప పనికి - వెనుక;
పొంద వచ్చు కీర్తి - పుణ్యాత్ము డెవ్వడో!
తెరకు వెనుక - వాని తెలియ దగును.

సుప్త చైతన్యం

స్వానుభూతి మానసాబ్ధి లోతుల దాగి,
పైకి బుడగ లట్లు - వచ్చు చుండు;
సూక్ష్మ తమము - గుప్త సుప్త చైతన్యమ్ము;
తెలియకుండ గుండె కలచి వైచు.

కవి

పేరు లేని ఒక కవివరేణ్యుడే - పల్కు;
మరువ రాని గొప్ప మధుర వాక్కు;
చదువు కొనని సుకవి మెదడు లోపలి - ప్రజ్ఞ;
మెరపు తీగ వోలె మెరయ వచ్చు.

విద్య

విద్య - మనసు లోని ఉద్యాన వని వోలె;
ఇంపు సొంపు నింపి ఎదుగ వలెను;
కారడవి గుబురుగ కన్పింపగా రాదు;
సూర్య రశ్మి నేల సోకకుండ.

దేవుడు

ఉన్నాడో మరి లేడో !
కన్నారా ఎవరు గాని ? కన్నులతో వి
ద్వన్నుతుడౌ దేవుడు స
ర్వోన్నతు డందడు మనుజుని ఊహకు గూడన్.

వేదాంతి

బ్రదుకు నందు తుట్ట తుదకు వేదాంతమే
పట్టు గొమ్మ చేయు పరమ శరుడు;
అన్యధా శరణము నాస్తి యంచును పల్కు;
బుజావు కోర నట్టి ప్రజలు కలరు.

తర్కం

వేయదగును - కంచె - వృక్ష రక్షణముకై !
ముచ్చ టేమి కావు ముళ్ల పొదలు;
అవసరమ్ము తర్క మతిశయింపగ - విద్య,
మేడ వేరు చుట్టు గోడ వేరు.

ఆకు చెట్టు

అరయ పూల కంటె ఆకులే మరి హెచ్చు !
పచ్చ దనము మెండు పలుకు బడుల
ఎంత మేర యెత్తు ఎదిగె ఆ వృక్షమ్ము
తావి గొలుపు ఒక్క పూవు లేదు.

వేడి కాదు వెన్నెలే

అమృతము కురిపించి - అల్లారు ముద్దుగా
సరస కవిత యెదద చల్ల బరచు;
వేడి కాదు కవిత - వెన్నెలే బ్రదుకులో;
అంతరంగ శాంతి - సంతరించు.

చక్రం

లోక మెట్లు కదలు ? లేకున్న చక్రాలు ?
బండ్లు కార్లు రైళ్ళు వాహనాలు ?
నాగరికతకిచ్చు నవ నవోన్మేషమ్ము;
జయము దిగ్విజయము చక్రమునకు.

మనసు

జగతి దద్దరిల్లు - సంకల్ప శుద్ధిచే !
సతులు సలిపినారు సహగమనము !
విష్ణ- అద్భుతముల నెరవేర్చు బ్రదుకులో;
కొలువ రాని బలము కలది - మనసు.

కవిత

అవతరించు–కవిత–ఆలోచనల నుండి;
లేని యెడల పాలు – లేదు నెయ్యి,
తరచ వలెను ముందు పెరుగు మీగడ తోడ,
పిదప – నెయ్యి అగును పెరుగు కాని.

అమ్మ

అర్థ శాస్త్ర పరిధి కందరానిది "అమ్మ"
ధరణి మిథ్య కాదు – తల్లి ప్రేమ;
సృష్టి లోన మాతృ హృదయమ్ము కలదంచు
మార్క్సు – శంకరుండు మరచినారు.

వైద్యుడు

హరిగ – రోగి నెప్పు డరయునో – వైద్యుండు
వైద్య విద్య – వసుధ – వాసి కెక్కు;
ప్రజల సేవ కంటె – పరమ ధర్మము లేదు;
అందు – ఆర్త రక్ష – అధిక తమము.

కార్య చతురుడు

విడిగ వేరు చోట్ల ముడి పదార్థము లుండు;
ఉండ వచ్చు కార్మికుండెచటనో !
మూలధన మెచటనో మురుగు చుండగ వచ్చు;
కార్య చతురు డన్ని కలుపు గాత.

కవిత

పోతు నెమలి కొదమ పురి వోలె నేలపై
కూడి కవిత శబ్ద మాడ వచ్చు !
ఇంద్ర ధనువు వోలె ఏడు రంగులు చిమ్మ
గగన సీమ జిలుగు గ్రమ్మ వచ్చు.

వెట్టీ

మనుజు లందు మనసు మారు మూలల యందు,
వేపకాయ యంత వెట్టీ దాగు;
అట్టి వెఱ్ఱి మొల్లి పట్టించు కొనకుండ,
మనసు లోన నవ్వు కొనుము - వేత్త.

విశ్వాసం

విజయ మొందు తరచు విశ్వాస యోగమే !
సత్య మోడిపోయి సంఘమందు,
విశ్వ విక్రమార్క విభుడు విశ్వాసమే !
సత్య మనిన - చిరుత చంద్రరేఖ.

పాల పొంగు

యువకు లైన వారి ఉత్సాహ రోషమ్ము
పాల పొంగు వోలె - పైకి ఉబుకు;
కాగి కాగి పాలు గట్టి మీగడ గట్టు;
వయసు కూర్చు అనుభవమ్ము వోలె.

స్వగతం

కోరు కొందు నేను క్రొత్త పాతల పొత్తు;
సామరస్య పూర్ణ శాంతి సంధి;
సమ్మతించ కున్న - సంఘ సంస్కారమ్ము
విప్లవమ్ము వచ్చు - విశ్వ మందు.

పాత గోరీలు

కోరి త్రవ్వ వద్దు - గోరీలు ధరణిలో
మరువ దగును పూర్వచరిత వేగ
మంచి తనము గలిగి మానవత్వము గల్గి;
నేటి మీద దృష్టి నెరప వలెను.

చిత్త శుద్ధి

తెలియ నట్టి దాని - తెలిసినట్టుగ పల్కు
 శ్రోత్రియుండు మేటి ద్రోహి సుమ్ము
తెలియ నట్టి దాని తెలియ దంచును పల్కు
 చిత్త శుద్ధి కేను శిరము మోడ్తు.

వినయం

విద్య వలన గాక - వినయమ్ము వలననే,
 కోవిదునకు వచ్చు గొప్ప తనము;
విద్య అనిన ఎండ వేడి మార్తాండమే !
 వినయ మనిన చలువ వెన్నెల సిరి.

స్వగతం

కవిత లోన ఇప్పు డవధూతనే నేను;
 నియమ నియతి మీద నిష్ఠ లేదు;
పలక - కాగితాలు బలపాలు కల మేల ?
 ఏక విశ్వ భావయిత్రి - చాలు.

అనుభవం

అనుభవమ్ము కన్న - అధికుడా గురుడేడి ?
 అనుభవమ్ము జ్ఞానమునకు నాడి;
వ్యర్థమగును జ్ఞాన మవగాహనము లేక,
 అనుభవజ్ఞుడైన మనిషి - మనిషి.

ఆప్త మిత్రుడు

నీ ముఖమ్ము ఎదుట నిలిచి నిర్భయముగా
 చెప్పు నెవడు నీదు తప్పు లెల్ల !
తిండి తినుచు-పిలువ కుండ యింటికి వచ్చి,
 మేల మాడు నెవడు మితిని మీరి.

2

నిదుర మాని  ఎవడు నీతోడనే యుండు
అపర సంధ్య వేళ అరుగుదెంచి,
నోరు నొక్కుకొనుచు ప్రక్క వారల ముందు
మూగ వోలె ఎవడు మూల కొదుగు.

3

సమునివోలె ఎవడు సంభావనము చేయు
హెచ్చు తగ్గు లేమి ఎన్నకుండ,
చందమామ ఒకడె సాక్షిగా నీ తోడ
నడికి రేయి ఎవడు గడుపగలడు.

4

ఎన్ని తప్పు లున్న - ఎవడు వేడక నిన్ను
క్షమయు సానుభూతి కరుణ చూపు;
నిన్ను పిలిచి కూర్మి నీతోడ వాదించి
భోజనమును మరచి పోవు నెవడు.

5

నిలిచి యుండి ప్రక్క నీ కష్టము లెరింగి,
అవసరమున కెవ్వడాదు కొనును ?
అతడె అతడె నీకు ఆప్త మిత్రుడు సుమ్ము,
ధరణి నెరపు జీవితమ్ము లోన.

మతము

మతము దైవభక్తి మాత్రమే కాదయా !
జగతి హితము కొరకు సలుపు వ్రతము;
జపము తపము గాదు - ఉపకార హృదయమ్ము,
సర్వ నిగమ సార సంగ్రహమ్ము.

2

మతము అనిన పాత మడి బట్ట కట్టుటా ?
బొట్టు పెట్టి పిలక జుట్టు పెట్టి;
గుడికి పోయి వగుల గొట్టుటా టెంకాయ
గుండె లోని పాలె గూళ్ళ తోడ ?

3

అదుపు లేక కొంత అరిషట్ గుణాలపై;
మంచితనము కొంత పెంచుకొనక,
తగ్గకుండ అహము తడిలేక ఎడదలో
మతము లేదు మనిషి బ్రదుకు లేదు.

4

స్వార్థ రహిత మైన ఆదర్శ నిరతియే,
ప్రాణ నాడి - మతము కంతరాత్మ,
అభ్యుదయము గూర్చు - నాస్తికత్వము గూడ
ఉజ్జ్వల మగు కర్మయోగ మగును.

5

మతము మాట విడిచి మానవత్వ మటంచు,
ప్రగతి యనుచు సామ్యవాద మనుచు
హేతు వాద మనుచు ఎన్ని పేరులు పెట్ట
మనుజ సేవ యైన - మతమె యగును.

మెట్ట

మెదడు పాడు చేయు మెట్ట వేదాంతమా ?
మతము అనిన మనిషి బ్రతుకు తీర్పు,
త్యాగ బుద్ధి - దాన ధర్మ సేవా దీక్ష,
మంచి తనము లేక మతము లేదు.

సహృదయత

కదిపి కుదుప ఎడద - కమ్మ తెమ్మెర - చాలు,
నాట్య మాడు పువ్వు నవ్వు - చాలు
కలవరించు చిన్న సెలయేటి అల - చాలు !
చెవుల బడిన మురలి రవలి - చాలు.

నిజం

చేయ వచ్చు చర్చ - సిద్ధాంత జగతిలో !
నిగ్గు తేల్చ వచ్చు నిజము గూర్చి
ప్రజల నమ్మకమ్ము - వ్యవహార జగతిలో,
అసలు నిజ మటన్న అర్థ మేమి ?

స్వగతం

మానసమ్ము నందు మనుజ మాత్రుడ నేను;
లేదు దేశభక్తి లేదు నాకు;
వాంఛ సేతు నేను వసుధైక రాజ్యమ్ము;
మతము గీతము వద్దు గతము వద్దు.

భూత దయ

భూత దయను మించు - పుణ్య మేదియు లేదు;
దాన నిష్ఠ కంటె - ధర్మ మేది ?
జ్ఞాన యోగ మన్న - శంకా ప్రహేళికే,
మూఢ భక్తి తమ్మి మొగ్గరమ్ము.

సహృదయులు

కడలి మీద ప్రీతి కలవార లున్నారు
నిడివి కానరాని నిండు తనము,
చిన్ని పువ్వు చూచి - సెలయేరు దర్శించి
పులకరించు వారు పుడమి కలరు.

బ్రదుకు

బ్రదుకు స్థాయి కంటె - వైశాల్య తమమేది
సకల శాస్త్ర విద్యలకును వెలవు ?
హేతు సూత్రముల కతీతమౌ అనుభూతి !
వింత లందు మేటి వింత - బ్రదుకు.

బలం

ధరణి లోన - బలమె - ధర్మమ్ము ! న్యాయమ్ము
రణచరిత్ర - తీర్పు - రాజనీతి;
ధర్మమునకు బలము - ''దాసోహ'' మన్నచో
ఉత్త మోత్తమమ్ము - ఉజ్జ్వలమ్ము.

ఆట వెలది

ప్రాసె - ఆటవెలది పద్యాలు నన్నయ్య,
కూర్చి పాదములను గొలుసు కట్టు;
నవ రచయిత వేమన కవితా శిల్పాన;
మేర లధిగమించి మించు గాత.

తెర వెనుక

విశ్వ మందు అరుదు వీరాధి వీరుండు,
ఎవరొ తరచు పేరు కెక్కి వచ్చు;
త్యాగయోగి ఒక్క డాదర్శ మేధావి,
పనులు చేయు తెరకు వెనుక నిలిచి.

నడ బావుటా

ధైర్య సాహసముల - ధర యెల్ల కీర్తించు,
కోరు చూడ జనము వీర నరుని;
అవసరమ్ము బట్టి ఆ వీడు సృష్టించు,
పరిగణించెడి నడ బావుటాగ.

వీర పూజ

సంఘ మందు బ్రదుకు - నగటు మానవులలో,
వెదక - కానుపించు - వీర పూజ.
రక్త మాంసలుడగు వ్యక్తిపై అనురక్తి;
భక్తి - ఆశయాల పైన - వేరు.

దానం

బ్రదుక లేడు మనిషి పాపమ్ము లేకుండ
తెలియకుండ చేయు - తెలిసి చేయు;
కూర్చ వచ్చు దాన గుణము నిష్కృతి కొంత
దాన దయయు కలియ ధర్మ మగును.

తాళపు చెవి

పారదర్శకమ్ము - భువనాభిరామమ్ము
చిత్ర విచిత్ర సృష్టి శిల్ప గరిమ;
కలవు పెద్ద బీగములు ద్వార బంధాల,
తాళపు చెవి ఏది దరిని లేదు.

సామరస్యం

అంతరంగమందు - వంతెనల్ నిర్మింప
కూర్మి పేర్మి కోరు కొందు నేను,
సామరస్య సంధి సంధాతనై నేను,
నలుప దలతు తపము సంతతమ్ము.

ప్రభాతం

చెదరె - క్షణము క్షణము చిమ్మ చీకటు లెల్ల,
వింత వెలుగు మిసిమి వెల్లి విరిసె,
చెలగె చెట్ల పక్షి కిలకిలారావాలు,
నవ్వె పొదల మీద పువ్వు గములు

### కవిత

మాటలాడు శక్తి మనుజు లందున తప్ప,
ఇతర జీవ కోటి కెచట లేదు;
మాట యొక్క దీప్తి - మకుటాయమానమై;
కానుపించు ఒక్క కవిత యందె.

### స్వగతం

పృథివి - బ్రదుకఁ దలతు - వేదాంతినై - నేను;
ఒక వికట విదూషక కవి వోలె గాక;
మనసు కలదు జ్ఞాన మౌన యోగము మీద,
పెదవి నవ్వు గాత - కదల కుండ.

### శ్రేయోభిలాషి

శత్రు వెవడొ తిట్ట చంపవచ్చును గాని;
శౌర్య మున్న యెడల సాహసించి;
చేరి తిట్టు నెడల - శ్రేయోభిలాషియే !
తలను వంచి మ్రొక్క దగును వేగ.

### మనసు

అఖిల మానవులకు - ఆనందమే - బ్రహ్మ;
అరయ సర్వ దేవతాత్మకమ్ము;
గరిమ నాభి - మనసు - నర శరీరము నందు!
తరచు మనసు శుభ్ర పరచ వలెను.

### ఆత్మ

ఆస్తి నాస్తి అనెడి ఆ యోజనమె చాలు;
చిత్తు ఉన్న మాట చేయు బుజువు;
ఉన్న యెడల ఏదియో ఒక్కటియె చాలు
అదియె సత్తు చిత్తు అదియె ఆత్మ.

స్వగతం

అద్భుతావహమగు - అజ్ఞేయ గణితమ్ము
విశ్వ శిల్ప మందు వెల్లి విరియు;
స్రష్ట నేర్పు చూచి సచ్చిదానందమ్ము,
అంతరంగ మందు - అనుభవింతు.

మనిషి

సగటు మనిషి వేరు - సాధారణుడు వేరు;
లేదు వెరసి మనిషి తీరు వేరు;
ఎడద పాటు పోటు - హేతువాదము వేరు;
మనిషి దివికి భువికి మధ్య-లంకె.

గురువు

బడిని నేర్పు విద్య బ్రదుకు తరచుగా
అనుభవమ్ము లోన - పనికి రాదు;
జీవితమున గ్రంథ సిద్ధాంతముల మధ్య,
గురువు గారు సంధి కూర్చ వచ్చు.

నవల

జీవనాడి ధమన సిరలస్ప్రజ్మాలముల్,
చరిత రచన లోన అరయ లేము;
ప్రతిఫలించు జీవ పాత్ర చిత్రణ యందు;
నాటి సంఘ మెల్ల నవల లోన.

నవల

అహము వలన కొంత ఆత్మ వంచన చేరు,
స్వీయ చరిత నెవరు వ్రాయ రాదు,
నవల వ్రాయ వచ్చు- నగ్న సత్యాలతో;
మించ గలదు నవల మేటి చరిత.

జ్ఞాన యోగి

మాట పరిధి దాటు మౌన గాంభీర్యమ్ము;
అచ్చ మైన గొప్ప అనుభవమ్ము;
చిందు జ్ఞాన యోగి మందహాసము సదా;
పరమ శాంతి వెల్లి విరియ జేసి.

కష్ట సుఖాలు

బ్రదుకు లోన సతము పడుగు పేకయు బోలి,
చెడుగు మంచి కలిసి చేరుచుండు;
కావడి నడయాడు - కష్టమ్ము సౌఖ్యమ్ము;
లాభ నష్టములకు లయ ఘటించి.

కవిత

ప్రజల భాష వాడ వలె ప్రజాస్వామ్యాన;
పండిత పరిభాష పనికి రాదు;
తేట తెలుగు సూటి మాట వాటము తోడ,
ప్రజల కొరకు కవిత వ్రాయదగును.

లలిత కళలు

లలిత కళలు వలన - కలుగు జీవన్ముక్తి;
రక్తి యున్న నంత శక్తి యున్న;
రస సమాధి కలుగు - బ్రదుకున సతతమ్ము;
అంతరంగ మందు శాంతి పొంగు.

ఒక్క పద్యం

పలుకు పొంకము జిగి తలపు బింకము చేర,
పద్య మొకటి సత్ ప్రబంధ సమము;
ఏల మోయ వలయు ఎండు కట్టెల మోపు ?
తావి గొలుపు ఒక్క పూవు చాలు.

### ధన్యాత్మ

పిల్ల జెల్ల లేని యిల్లాలు ధన్యాత్మ;
సదవకాశ మామె బ్రదుకు వచ్చె !
దీను లెల్ల ఆమె దివ్య సంతానమే;
పెంచు కొనుత ఆమె ప్రేమ పరిధి.

### మూల కారణం

చలువ వెన్నెల సిరి సౌమ్య సౌఖ్యము గ్రోలి,
మరువ వచ్చు సూర్యు గరిమ జనము,
వెదక రెపుడు జనులు విస్మరింతురు సదా
కానరాదు మూల కారణమ్ము.

### విప్లవము

ఉత్తరించ కుండ కుత్తుకల్ కత్తితో,
వెక్కిరించినారు బీద జనులు;
విప్లవమ్ము ఘోర బీభత్సమును రేపి,
కులము మాపు చేయ గలదు వేగ.

### సామాజికులు

ప్రేక్షక పదమునకు ఇపుడు వాడుక హెచ్చె;
వారు వినరు సభకు వచ్చి గూడ;
సభకు రావలయును – సామాజికులు వేరు,
సభ – రసజ్ఞ పారిషద సమాఖ్య.

### ధనం

ధనము పదవి కొరవి దయ్యాల వేటయే;
నరుల దారి తప్పి తిరుగ జేయు;
పుడమి కవలి వెలుగు పొంచి కాంచెడి వ్యక్తి,
కలుపు మిన్ను మన్ను వెలుగు తోడ.

కవి

భావి చూడ గలుగు - ప్రజ్ఞాధురీణుండు,
క్రాంతదర్శి యైన కవి వరుండు;
మన్ను చేరి పారు - మిన్ను శేలాకూలి,
చిన్మయాత్మకమగు క్షీర తటిత్తు.

స్వగతం

మేటి కవి నటంచు - మేధావి యేనంచు,
కోరు కొనను గొప్ప పేరు నేను;
మంచి మనిషి నంచు - మరణమ్ము తరువాత,
జనులు చెప్పు కొనిన - చాలు చాలు.

లలిత కళలు

మానసమున కూర్చి - ఆనంద యోగమ్ము
కడుగు - లలిత కళలు - కలుషములను;
కంచి కేగు గాత - కథ రెక్కలు వచ్చి,
ఇంటి కేగ వచ్చు ఇంక మనము.

భగవద్గీత

కడగి - బ్రదుకు లోన - కర్తవ్యముల నెల్ల
చిత్త శుద్ధి తోడ చేయు మయ్య;
లేదు జయ మపజయ మేది - నీ చేతిలో:
వద్దు - వద్దు - చింత - నంత సుంత.

కృతజ్ఞత

వాడుకొనిన పిదప - వదలి వేయుట - నీతి,
వ్యావహారిక జగ మందు - నేడు;
పరమ ధర్మ మేది ? - ధర కృతజ్ఞత సుమ్ము;
మేలి గుణము గురువు మీది భక్తి.

దానం

చిరు విరాళ మైన చిత్త శుద్ధిని గల్గి
వేత్త ఇచ్చు నెడల - విలువ వేరు
హెచ్చు - ధనము విలువ - ఇచ్చువానిని బట్టి,
ధన్య జీవి పాత్ర దాత - ఒకడె

సహృదయుడు

దాన గుణము కంటె - దయ కంటె - క్షమ కంటె;
ధర్మ మేది కలదు ధరణి లోన ?
సహన గుణము గల్గి - సామభూతిని గల్గి;
జగతి బ్రదుకు గలడు సహృదయుండు

సుకవి

నేటి సుకవి వరుడు నిన్న మొన్నటి పైన
దృష్టి పెట్ట రాదు హృదయ మందు;
మాపు విలువ వలెను రేపుపై సతతమ్ము;
ప్రగతి పైన - నూత్న జగతి పైన.

సంక్షిప్తి

ఒక మదింపు మరియు ఒక కుదింపును లేక
వ్రాయ నేల ? ఒక చేట భారతమ్ము ?
సంగ్రహీకరణము - సంక్షిప్త కవితాత్మ
విశ్వ రూపక త్రివిక్రమమ్ము.

గొప్ప

విద్య కంటె గొప్ప వెలుగు లేదవనిలో,
కూడు గుడ్డ గృహము కూర్చు విద్య,
గుడులు కావు ప్రగతి - బడుల వల్లనె కల్గు;
కలుగు విద్య వలన గౌరవమ్ము.

### కోవిదుడు

ఆగ్రహమ్ము చెందు అవివేకి - అజ్ఞాని;
జ్ఞాన మనిన ఏమి ? శాంత విరతి;
కోవిదునకు గుండె జీవితమ్మున సదా;
ఉండ వలయు నిండు కుండ వోలె.

### కులం

మరువ వచ్చు నాటి మాట - మౌనము దాల్చి;
కులము అంతరింప వలయు - నేడు,
ప్రగతి వచ్చు - పర పరాగ మేళన వల్ల,
మానవత్వ సంక్రమణము వల్ల.

### నవ్వు

గడ్డు చిక్కు ప్రశ్న కావచ్చు బ్రదుకులో,
లేదు నవ్వు కంటె లేదు బదులు;
మారు మాట కంటె - మంద హాసము మేలు,
హాస్య గుళిక గొప్ప ఆయుధమ్ము.

### సమీక్ష

సాహితీ సమీక్ష - సంగీత కళ వోలె,
ప్రస్తరించు గాత - భావ లయల.
కలవు నాద బిందు కళలు కావ్యము లందు;
శ్రుతులు రాగ తాళ జతులు గతులు.

### కవిత

కల్లు కంటె కైపు - కవిత కూర్చుట కద్దు;
రస సమాధి పద్య రచన కూర్చు;
అంతరించ కుండ - ఆ నిషా - బ్రదుకులో,
స్థిర తటిత్తు వోలె చిందులాడు.

దళిత సేవ

వద్దు - జీవితమున - స్వామి భూమిక వద్దు;
పరుల పైన చూపవలయు ప్రేమ;
దళిత సేవ ఒకటె తారకోపాయమ్ము;
ఆస్తికులకు మరియు నాస్తికులకు.

కవిత

పద్య రచన - పెక్కు పాకాలలో నుండు,
మేలు పండు ద్రాక్ష బోలు - కవిత;
ఖిల పిశాచ నారికేళ పాకము వద్దు;
కవిత నాట్యమాడు గాత - హృదుల.

చప్పట్లు

సభల వెల్లుగ వచ్చు చప్పట్ల దొంతరల్
ఎంచరాదు వక్త దంచు ఘనత,
ప్రతిభ కేది ఋజువు ? ప్రత్యక్ష సాక్ష్యమ్ము
శ్రోత గ్రహణ శక్తి శోభ సభకు.

కవి

కవి - విదూషకుండు కాడు - వేదాంతియే;
కవులు కోరుదురు జగద్ధితమ్ము;
తేనె టీగ - సుకవి - తిరుగాడు వనములో;
కాదు - తేలు కొండి - కవి కలమ్ము

టెన్నిసు

నెట్టు లేక - మరియు చుట్టు గీతలు లేక
ఆడు బంతి ఆట - ఆట కాదు;
వ్రాయ వచన మందు - వడులు ప్రాసలు లేక
కలము తీట గాని - కవిత కాదు.

### కవిత

కవిత - మంచిదైన - కంఠస్థమై నిల్చు
    చాలు - ఒక్క సారి చదివి నపుడు;
వినిన ఒక్కసారి - మనసు లోపల దూరి
    నాట్య మాడు తరచు నాల్కపైన.

### కవిత

కాన రాని మేలు - కవిత వల్లను గల్గు;
    చిత్త వృత్తి శుద్ధి చేయు కవిత;
కురియ గలదు కవిత - గుండెలో - అమృతమ్ము;
    కవిత - రస సమాధి - కలుగ జేయు.

### ముక్తకం

స్వయం సంపూర్ణ సంధానమ్
    చమత్కార రసాత్మకం
ముక్తకం పద్యమేకైకం
    సత్ ప్రబంధ శతాయతే ॥

### మనుజ సేవ

జ్ఞాన యోగ మెపుడు సందేహ బహుళమ్ము;
    భక్తి దీక్ష పరమ బలము కోరు;
కర్మ యోగ మనిన కష్ట యాతన గదా !
    మధుర ధర్మ పథము - మనుజ సేవ.

### తెలుగు పద్యం

కానుపించు - సహజ కవచ కుండల కాంతి
    తెలుగు ప్రాస యతుల దీప్తులందు;
మధుర కవనమునకు - మార్దంగ లయ కూర్చు;
    రాగ భావ యోగ రక్తి గొలిపి.

శాశ్వత స్నేహం

ప్రాణ సఖుడు నాడు - పరమ శత్రువు నేడు;
రాజకీయ నాట్యరంగమందు;
జగతి ఎచట గలదు ? శాశ్వత స్నేహమ్ము
స్వార్థ మేలుచుండ జనుల హృదుల.

స్వగతం

కోరు కొనను ధనము కోర నే స్వర్గమ్ము
లేదు నాకు పదవి మీద - కాంక్ష;
యోగ్యుడైన వారి కుపకార మొనరించి
గుప్తదాన మిచ్చు కోర్కి కలదు.

కవులు

కవులు వేయ గలరు గాలాలు గాలిలో !
నీటి లోన వేయు నేర్పు వేరు;
తిమి తిమింగలములు - తేరగా దొరుకునా,
చిన్న చేప కైన చిక్కు వలను.

కవిత

కవిత అనిన కాదు - నవరత్న హారమ్ము
పూత పసిడి జిలుగు పూల గుత్తి;
కవిత అనిన - వేడి కన్నీటి బిందువుల్,
హృదిని వెల్లివిరియు ఇంద్ర ధనువు.

శీలం

హాని జరుగు కొంత ఆరోగ్య నష్టాన
హాని లేదు ధనము వ్యర్థమైన;
చెడును జీవితమ్ము శీల నష్టము వల్ల;
చేయు వలయు మనిషి శీల రక్ష.

కవిత

కవిత - అర్థ మగుట - కష్టయాతన గదా
హృదయ ముండ వలెను - మెదడు తోడ.
సాహితీ తపస్వి - స్వారస్యముల నెన్ని,
ఆస్వాదించ వచ్చు అమృత రసము.

కవిత

పూత పసిడి పోలు పువు రేకులను బోలు,
కవిత వ్రాసినాడ గడుసు వాడ,
ప్రౌఢ రచన మీద గాఢానురాగమ్ము
కలదు హృదయ మందు కలదు నాకు.

పద్య కవిత

గాలి కలిసిపోవు కమ్మ తెమ్మెర వోలె
మంచి కవిత ఈ ప్రపంచ మందు;
పొందు పరచు నెడల - ఛందస్సులో పెట్టి
స్థిరతటిత్తులవలె - తేజరిల్లు.

కవి

తెలుపు కాగితాలు - నలుపు చేయుట కాదు;
కూర్పు లోక హితము గొప్ప కవిత;
కవి - బ్రతుక వలెను - జగద్ బాంధవుండౌచు;
ప్రజకు మేలు కలుగు పనులు చేసి.

కవిత

మింటి చుక్క లనిన - మిణుగు పుర్గులు కావు;
రవిని అతిశయించు రశ్మి గలవి;
అక్షరాలు పోలు నక్షత్ర గోళాల,
సూక్ష్మ దృష్టి - కవిత - చూడ గలుగ.

శీలం

పట్టు బడడు మనిషి బహిరంగ చర్చలో;
    వ్రాత లందు - చెప్పు నీతు లందు;
ఎన్న వలయు నతని ఏకాంత చరితమ్ము;
    సమయ మతడు వ్యయము సలుపు విధము

గురువు

స్వేచ్ఛ నిలుపు కొరకు సేవ చేసెద - నేను,
    కుదువ బెట్ట రాదు మెదడు నెచట,
వెదక దగును మనిషి - స్వీయానుభూతినే !
    గురువు వద్దు - వద్దు గుడులు బడులు.

కవిత

అచ్చునైన కవిత - అచ్చు సంపుటి దాటి
    మనుజ గళము లందు - మారు మ్రోగు !
కవిత - నిదుర వోదు - గ్రంథాలయాలలో;
    నరుల నాల్క లందు - నాట్య మాడు.

చర్చ

వృద్ధి చెందు విశ్వ విద్యాలయాలలో,
    సాహస మయ భావ చర్చ సతము
చర్చ - జరుగు గాత - శాంతి సంగ్రామమై,
    సంస్కృతి యన సంధి - జయము కాదు.

ప్రజాస్వామ్యం

అదను వచ్చె సమత కిది ప్రజాస్వామ్యమ్ము,
    బ్రదుకు హక్కు గలదు - ప్రజల కెల్ల !
అధిక ధనము గాని - అధికారమే గాని,
    ఒక్క వ్యక్తి యందె ఉండరాదు.

స్వగతం

కలదు ప్రీతి నాకు తెలుగు పద్యము పైన,
చెలిమి పైన - వాన చినుకు పైన !
వెన్నెల పయి నేతి పెసరట్లపై తథా;
వెన్న పూస పైన - విరుల పైన.

సామరస్యం

బ్రదుకు లోన - దాగు - వైవిధ్యములు పెక్కు
తెలిసి కొన్ని - కొన్ని తెలియ కుండ,
సంధి మేలు - స్వస్తి శాంతి పాఠము - మేలు
సామరస్యమునకు జయము జయము.

ప్రశ్నం

ఈ విశాల సృష్టి - యావద్ వికాసమ్ము;
ఆది అంతు లేని - అద్భుతమ్మ ?
పరిహరింప దగిన - ప్రశ్నేనమా ? ఏమి ?
ప్రాణి కోటి యొక్క అవతరణము.

దైవోపహతుడు

హాని జరుగ వచ్చు - స్వాపరాధము వల్ల;
శత్రు కృతము హాని జరుగ వచ్చు,
జీవితమున నరుడు దైవోపహతుడైన,
తీర్పనే లేర రెవ్వ రార్ప లేరు.

కీలకం

అరసి స్వీయ పరిధి పరిసరాలను గూర్చి,
తనను తాను తెలిసి కొనుత - నరుడు;
కీలకమ్మె తానె - కేంద్ర బిందువు తానె,
బ్రదుకు లోని - సర్వ వలయములకు.

సౌశీల్యం

జగతి లోన - శక్తి సామర్థ్యములు కొన్ని,
అమరి యుండ వచ్చు - అప్పు టచట!
జన్మ లోన - నీతి సౌశీల్యమే ! మేలు;
మంచి తనము చాలు మనుజు లందు.

ఆట వెలది

ప్రజలు చదువ లేరు - ప్రౌఢ కావ్యము నేడు
నారికేళ మెవడు ? నముల గలరు ?
అన గలరు నేడు తేనీరు కాఫీని
వృత్త మేల ? ఆట వెలది చాలు.

రంగు గ్రుడ్డి తనం

సానుభూతి కంటె - సహన శీలము కంటె,
గొప్ప దేది ? జాలి గుండె కంటె ?
సహృదయత్వ మేమి ? జగతి జీవితమందు ?
కూడ దెపుడు రంగు గ్రుడ్డి తనము.

ప్రొద్దు పొడుపు

తోచె - అల్లి బిల్లి తొలి సంజ కెంజాయ,
వెల వెల వెల బోయె వేగు జుక్క,
కెరలి - గుడి ధ్వజాన కింకిణీకము లెల్ల,
గాలి అలలు సోకి కలవరించె

మానవ హృది

మానవ హృది పెను తుపాను భీభత్సమ్ము,
సుడులు రేప వచ్చు అడుగు పొరల,
అభినయ ప్రశాంతి - అభాస శుభ శోభ
పైకి గోచరింప వచ్చు - తరచు.

హేతు వాదం

అరుగుదెంచి పడను అగ్ని కుండము నందు
శలభ కీటకములు చచ్చి పోవు;
హేతువాదము నకతీతమౌ విషయాలు,
కొన్ని సృష్టి లోన గోచరించు.

మనిషి మనసు

కలదు - బ్రదుకు లోన - అలవాటులకు కూడ,
మనుజు ప్రకృతి కూర్చు మహిమ తరచు;
మెదడు సగటు మనిషి పదిశాతమే వాడు,
మనిషి మనసు వింత మహిమ గలది.

సంగ్రామ రంగం

వెదుక కాన రాదు ప్రేమాయణము లోన,
హేతువాద తర్క హేలి తరచు,
సంహరింప బడును సంగ్రామ రంగాన;
మొదట నిజము తుట్ట తుదకు నీతి.

తోటమాలి

కవిత వ్రాయుటనిన-ఘన కార్యమా ? కాదు
తోటమాలి కృషియె మేటి దగును;
అనుభవించి - సచ్చిదానంద సంక్రాంతి,
పంచి పెట్టు నతడు ప్రజల కెల్ల.

ప్రజలు

మనకు తెలియ రాక - మనల తూకము వేయు
జనము లుండ వచ్చు జగతి లోన,
విశ్వ మందు ప్రజలు వేష భాషల లోన,
మనలు గాత అప్రమత్తు లగుచు.

అద్దం

తన మొగమ్ము తాను దర్శింపగా లేదు,
అద్దముండ వలెను అరయు కొరకు;
గురు వరేణ్యు కంటె - గొప్ప అద్దము లేదు,
తరళ తత్త్వమె మార్గ దర్శకమ్ము.

మౌనం

ప్రతిభ కేది గుర్తు ? మిత భాషణయె సుమా !
వ్యర్థ జీవి యెవరు ? వదరు బోతు;
జ్ఞాన సార మేది ? స్వచ్ఛంద మౌనమే;
మౌన మరయ ఋషుల మాతృ భాష.

వాయు లీనం

అందజేయు హృదికి - ఆనంద కరుణముల్;
గాన విద్య ఏక కాల మందె;
వీను దోయి - వాయులీన వాద్యము చేర్చు,
కలవరమ్ము కలిపి కల రవమ్ము.

ముసలి

ప్రతి నిముషము బాధ పడక తప్పదు గదా
ముసలి తనము కంటె - ముప్పు లేదు,
మరణ మైన మేలు - మంచ మెక్కుట కంటె
ముసలి వాడు దేశమునకు బరువు.

నిప్పు రవ్వ

నివురు మధ్య మందు - నిప్పు రవ్వల వోలె,
అచ్చ టచట నిజము అణగి యుండు;
మేటి జగతి యెల్ల మిథ్య యైనను గూడ,
మరుగు పడిన నిజము లరయు వచ్చు.

### యాదృచ్ఛికములు

అద్భుతాలు దాగు యాదృచ్ఛికాలలో
హేతువాదమున కతీతమగుచు,
నాద బిందు కళల నాట్య విన్యాసముల్ !
కవన లయల తోడ కానుపించు.

### ప్రగతి

అభ్యుదయము కాదు - ఆదర్శ వాదముల్;
నేల మీది వాస్తవాలు కావు;
ఉన్న రెండు కలిసి - ఉచిత నిష్పత్తిలో;
జగతి కెల్ల వేగ - ప్రగతి వచ్చు.

### ఆదర్శం

ఐహికమును దాటు ఆదర్శ కృత్స్నమ్ము
ఆకసమును గూడ అందుకొనును,
త్యాగ మహిమ - అనుభవామ్రేడిత చరిత్ర,
పరమ పావనత్వ పారమితము.

### సంపదుత్పత్తి

జగతి ముఖ్య మగుత - సంపదుత్పత్తియే;
హింస - ధ్వంస బుద్ధి - హేయ మగుత;
కత్తి - నాగలి కొన కర్రుగా రూపొంది
అవని పాడి పంట లధిక మగుత.

### ఆశు కవిత

నిలువ లేవు తుదకు నీహార హీరాలు
మెరయ వచ్చు మిడిసి మిల మిల మిల;
ఆశు కవిత మొదట ఆశ్చర్య తరళమే,
కరగి పోవు మంచు గడ్డ - కడకు.

సంఘ మందు

ఎంచ - సంఘ మందు - మంచి వారెందరో,
ఉండవచ్చు ప్రతిభ - యున్నవారు;
పొంద వచ్చు కీర్తి - పుణ్యాత్ము డెవ్వడో
చాల మంది మ్రగ్గి చచ్చువారె.

సుఖ నిద్ర

సుహృదు డెవడు ? సుఖ నిద్ర చేకూర్చి
సంతసింపఁ జేయు సజ్జనుండు;
రాత్రి నిద్ర కంటె - రాజ యోగము లేదు
అంత కంటె భోగ మవని కలదె ?

స్వగతం

కవిని వర్తకుండ గాను - జీవితములో
రచన చేయ లేదు లాభ దృష్టి.
సహృదయులగువారు సత్కారింపగ వచ్చు,
పుచ్చు కొందు దాత ఇచ్చి నపుడు.

చంద్రుడు

కన్ను మూయ కుండ గడపి నాడను నాడు,
రాత్రి యెల్ల జాగరణము చేసి;
జనము లెల్ల నిదుర మునిగినారలు నాడు;
అయ్యొ చంద్రుడే సహవ్రతుండు.

శ్రుతి లయలు

తాళ లయల తోడ - తంబురా శ్రుతి తోడ,
రక్తి కట్టు గాన రాగ జతులు;
అవధరింప వలయు కవన మందున తథా
సూక్ష్మ శబ్ద గతులు శ్రుతి లయలను.

తేనె పట్టు

కొట్టు - తేనె పట్టు గురిపెట్టి రాతితో;
చుట్టి ఈగ లెల్ల కుట్ట వచ్చు;
బాటసారి యగుచు పయనింప మనుజుండు;
క్షేమ యాత్ర పూర్తి చేయ వచ్చు.

పరుష వాక్కు

తెలియ లేము పరుల స్థితిగతుల్ బ్రదుకులో,
ఎవరి తప్పు లైన - ఎన్న రాదు;
మనము వారి స్థానమున ఉన్న - ఏమౌనో!
పరుష కఠిన వాక్కు - వద్దు వద్దు.

గంగ యమునలు

పులకరింప జేయు - భూగోళ దృశ్యమ్ము!
గంగ యమున నదుల సంగమమ్ము;
రక్తి కట్టు రచన - ప్రతిభతో వ్యుత్పత్తి,
కలిసి మెలిసి ఒరసి కానుపింప.

సంకల్పం

మనసు ముఖ్యము గద మనుజ యత్నము లందు;
వైద్య మందు వివిధ విద్య లందు!
జంకు గొంకు లేని - సంకల్ప శక్తియే!
జయము గూర్చు అభ్యుదయము గూర్చు.

శిశువుగా

అవని లోన పుట్టు - ఎవడైన శిశువుగా;
ప్రగతి కూర్చు కొనును నగటు మనిషి;
అభ్యుదయము కలుగు అవకాశములు చేరి,
పెరుగు గొప్పదనము పిదప పిదప.

బ్రదుకు

బ్రదుకు లోన గూడ – చదరంగమున వోలె,
కట్టి వచ్చు ఆట – కదిపి బంటు !
మలుపు తిరుగు చరిత – తెలివి తేటలు గల్గి,
వెరవు తోడ మీట వేసి నపుడు.

మంచి

ఉండ రాదు మమత – ఉన్మాద పరిధిలో
బ్రదుకు లోన దేని పైన గాని,
ఎంచ చెడుగు లేని మంచి దేదియు లేదు,
చెడుగు కడుపు లోన – చేరు మంచి.

అపజయం

నరుడు తరచు లాభ నష్టాలపై దృష్టి
విడిచి పెట్టి చేయు పెక్కు పనులు;
గుండె లోన తృప్తి పండించు కొనవచ్చు
జయము నపజయమ్ము సమము కవికి.

ఆనందం

నానుడి కలదొకటి – ''ఆనందమే – బ్రహ్మ !''
మనుజ కృత మదెల్ల మానసికము,
అంతరంగ బోధ – ఆలకించిన చాలు !
మరువ దగును నీతి మతము గతము.

జ్ఞాని

ప్రగతి శీలి సకల జగదేక తేజస్వి;
జ్ఞాని యొక డజాతశత్రువుండె!
అతిథిని వలె – వేత్త ప్రతివాది మన్నించు!
అర్ఘ్య పాద్యము లిడి ఆచరించు.

స్వగతం

మూగవోయె తరచు నా గొంతు బ్రదుకులో !
మౌనము వహియించినాను - నాడు;
వ్రాసినాడ - ప్రజల ప్రగతి కోసము నేడు;
మరణ శయ్య మీది మాట లివ్వి.

క్షమ

హింస - పగయు కోప మెపుడు మంచివి కావు;
గుణము లందు గొప్ప గుణము - క్షమయె;
ప్రేమ కూర్చు సతము విశ్వ కల్యాణమ్ము;
సర్వ జనుల సుఖము జగతి లోన.

ప్రగతి శీలి

ప్రగతి శీలి - లోక - భగవంతుపై భక్తి,
ఉండ వచ్చు నెవడొ ఉర్వి లోన;
జగతి నుండరాదు - సత్యసంధత పైన,
నమ్మకమ్ము లేని నరు డెవండు ?

ప్రార్థనలు

ప్రార్థనలు గమించి భగవంతు చేరునా ?
ఆత్మ నివ్యము లవి - అరసి చూడ,
చిత్త శాంతి కొంత చేకూర్చు కొనవచ్చు,
బ్రదుకు లోన తుట్ట తుదకు - నరుడు.

ప్రార్థన

సలుప వచ్చు మనము శ్రద్ధతో ప్రార్థనల్,
భజన చేయ వచ్చు భక్తి తోడ;
చేరునా ? మన మొర శ్రీవారి చెవిలోన !
ఆత్మ శాంతి మనల ఆవరించు.

విప్లవమ్ము

దేశ మందు ఉన్న స్థితిగతుల్ మాత్రమే !
విప్లవమ్ము తెచ్చి పెట్టు నేల ?
జ్ఞాన విప్లవమ్ము సంభవించును ముందు,
పిదప వచ్చు అసలు విప్లవమ్ము.

గానం

హృదిని దూర గలదు – మెదడు లోపల గాక,
గాన మవసరమ్ము – కవిత తోడ,
సరస కవిత తోడ – సంగీతమును గూడ,
కలుపు నెడల రక్తి కట్టు సభలు.

సంగీతం

గాయకు లనియు గొప్ప – గాయనీ మణు లంచు,
పేరు తెచ్చు కొనెడి వారు – కలరు;
సాహితీ ప్రగతికి – సంగీత సమబుద్ధి
న్యాయము ఘటియించు టరుదు సతము.

వేషం

గడ్డము పెను మీస కట్టు – రంగుల పాగ
ఒరను చిన్న కత్తి – ఉండ వచ్చు !
హేతువాదమున కతీత మా వేషమ్ము !
తిరుగ వచ్చు నతడు తృప్తి తోడ.

మెదడు

మనిషి మెదడు భువికి మకుటాయమానమ్ము;
ఎడద దేహ మందు ఏమి చేయు ?
రక్త మొదలి లోన – ప్రసరించుటే గాక
హృదిన మమతల గుడ్లు పొదుగు గూడు.

### కళలు

కళలు వేల కొలది కలవు విశ్వము నందు
వెల్లి విరియు వింత విద్య లెన్నొ
ప్రతిభ - గొప్ప దుండు శ్రవ్య వాద్యము లందు;
మేటి గాత్ర సరళి మించ వచ్చు.

### కర్తవ్యములు

కడగి చేయ దగును - కర్తవ్యముల నెన్ని !
మరణమునకు ముందె మానవుండు,
పనులు ముగియకుండ - ప్రాప్తించు మరణమ్ము;
చూపు ఉండ వలెను రేపు మీద.

### రక్త దానం

జలగ పిల్ల కంటె - శార్దూలమున కంటె,
నల్లి కంటె గుంత నక్క కంటె !
అప్పు లిచ్చు వాని దగ్గ గణ్యత సుమ్ము;
ధరణి లోన రక్త దాహ మందు.

### క్షమ

చావు నైన గూడ - సరిపెట్టుకో వచ్చు;
గృహము నందు సంభవించు నెడల,
తెలిసి తెలియ కుండ దిగరాదు పేచీకి
అప్తు లందు క్షమయె అవసరమ్ము.

### కార్మికుడు

ఆస్తి అనిన నేమి ? అతిసూక్ష్మ చౌర్యమ్ము;
సంపద సృజయించు శ్రామికుండు;
పూజ్యపాదు డెవడు ? పుడమి లోపల నేడు
కష్ట పడెడి పేద కార్మికుండె.

కార్మికుడు

శ్రమయె పావన మగు సవనమ్మ్ము బ్రతుకులో,
త్యాగ యోగి - అన్న దాత - రైతు;
పగలు చెమట వోడ్చి పనిచేసి రేయెల్ల;
ధర్మ నిద్ర వడయు కార్మికుండు.

మార్పు

సంఘ జీవి నరుడు - జగతిలో బ్రదుకులో,
పాత పద్ధతులకు - స్వస్తి చెప్పి,
నరులు కూర్పు కొంద్రు - నవ సంప్రదాయముల్ !
మంచి వనగ రాదు - మార్పు లెల్ల.

బ్రదుకు

తాను - బ్రదుకు నుండి తప్పించు కొన లేడు;
అవని బ్రదుకు మనుజు డెవడు గాని,
బ్రదుకునకు విరుగుడు - బ్రదుకు మాత్రమె సుమ్ము !
బాధ్యతలు నెరవుటె బ్రదుక టన్న !

కాలం

ఏ సమస్య కన్న - ఏ క్లిష్టతల కన్న
మిన్న మనుజు మెదడు మిన్న సుమ్మ;
కాలమె కడతేర్చు కష్టాలు బ్రదుకులో,
మేలు తుదగు సంక్రమించ వచ్చు.

పెద్ద దేశం

ఎలుక పిల్లి మధ్య చెలగాటమే యౌను;
యుద్ధము ప్రజ్వరిల్లు చున్న యెడల;
పిన్న సీమ వేరు పెద్ద దేశము వేరు!
ప్రేక్షకులుగ నిలుతు రితర జనము.

మంద హాసం

కలిసి కొనిరి వారు పలుమారు చేరువై;
బ్రదుకు అటు పోటు బాట లందు !
మధుర మౌన మసృణ మందహాసము చింది,
పెదవి విప్పకుండ కదలినారు.

కనులు

చేయు సైగ కనులు - శృంగార భంగిమల్;
ముసి ముసి చిరు నగవు మోసు లెత్త,
గుస గుస నుడి నుడులు గుండె తోడను ఆడు,
పెదవి తుదలు కదిపి కదప కుండ.

సహనం

నాస్తికులను గూడ నాయకోత్తములుగా,
హృదయ మందు గౌరవించ గలను;
సత్య మెవరికైన సాక్షాత్కరించుచో,
జయము కలుగు గాక సహనమునకు.

విశ్వభావయిత్రి

రవి కిరణము సోకు వివిధాంశములు చేర్చి
విశ్వ భావయిత్రి వింగడింపు,
ఆట వెలది కాళ్ల కలతి మువ్వలు తీర్చి,
వ్రాసినాడ సరళ పద్య కవిత.

పని

చేయ దగిన పనులు చేయుటే ప్రార్థనల్;
పనిని మించు నట్టి భజన లేదు.
ధర్మ పథము లేదు - కర్మ యోగము కంటె;
ప్రగతి యోగ మేది ? పనియె! పనియె !

ధన్య జీవి

మరణ శయ్య్య మీద - పరమ సౌఖ్యము నిచ్చు,
మంచి పనులు చేయ - మానవుండు,
సహృదయుడయి - కడగి - శక్తి వంచన లేక,
దాన మిచ్చువాడు - ధన్య జీవి.

కవి హృదయం

నిర్వికల్ప రూఢ నిర్ముష్టములు కావు
భాష లోన వాడబడెడు నుడులు;
సాహితీ ప్రయోగ సాపేక్షికార్థముల్;
కవి హృదయ శరణ్యాకములు సుమ్మ.

చిత్తం

శిలలు లోహములకు చిత్తముండును కొంత;
ఆకసమునకు దిగంతములకు;.
చెట్లు కుండు తెలివి శీతోష్ణముల గూర్చి;
వేళ్లు నీరు తిండి వెదక గలవు.

బ్రతుకు

బ్రదుకునకు విరుగుడు - వైరాగ్య తత్త్వమే!
అవని మనిషి - శ్లేష్మ మందు ఈగ;
బ్రదుక - తామరాకుపై నీటి కణమట్లు,
ధన్యు డగును నరుడు ధరణి లోన !

మంచితనం

ప్రతిభ కంటె - మేటి పాండిత్యమున కంటె,
మిన్న - మంచి తనము - మేలు - చాలు.
సృష్టి శిల్పమునకు శిఖరాయమానుండు;
మంచి గుండె యున్న - మానవుండు.

మానసారోగ్యం

పొంద వలయు దేహ మందు ఆరోగ్యమ్ము;
అది పనులకు మొట్ట మొదటి మెట్టు !
మంచి దంత కంటె - మానసారోగ్యమ్ము;
మేడ నెక్క చివరి మెట్టు సుమ్ము;

భజన

ఎట్టి ఫలము కానుపించు ప్రార్థనల వల్ల ?
చాలు హృదిని నమ్మకాలు చాలు;
భజన చేయ దివిని భగవంతు చేరునా ?
చాలు - మనసు నిండు శాంతి చాలు.

వింత

వింత లందు వింత - భిన్న ధ్రువాలకే,
కౌగిలించు కాంక్ష కలిగి యుండు !
స్త్రీ పురుషుల లోని శృంగార మట్టిదే
విద్యుదూర్జి - బిడ్డ - వింత గావు.

అవినీతి

అంతరింప దెప్పు డవినీతి అవనిలో;
సహజ గుణము మనుజ సంఘ మందు;
పెద్ద వారి ముందు దొడ్డ ఔదార్యమ్ము !
నిర్వచింప లేము - నీతి విన్న.

హేతు వాదం

మన వివాహ సంస్థ - మరి ప్రజా స్వామ్యమ్ము;
హేతువాద ధాటి నెదుర లేవు!
అవి నిలిచినవి కద - వ్యవహార జగతిలో!
బ్రదుకు లోన అవసరమ్ము కొలది.

ఆధ్యాత్మం

అనుభవైక వేద్య మధ్యాత్మ తత్త్వమ్ము!
ఆస్తి కుడను నేను అనుభవమున
ఏ మత వ్యవస్థ ఇచ్చ గింపను నేను
మానవతయె చాలు మనసు లోన.

క్రీడ

బ్రదుకు లోన - క్రీడ - రణరంగమా ? కాదు
ఆట ఆడ వలెను ఆట కొరకె !
జయము అపజయమ్ము సమము లాటల లోన;
ఆట ఆత్మ - చెడని అమృత మైత్రి.

అపజయం

సంక్రమించుత అపజయము క్రీడల లోన,
క్రీడి - ఏడ్పు గొట్టు వాడు కాడు!
ఆట కేది ఆత్మ ? - ఆనంద సంక్రాంతి!
క్రీడ-ధ్యేయ మేది ? గెలుపు కాదు.

సిద్ధాంతాలు

చెల్లవు గద గ్రంథ సిద్ధాంత సూత్రముల్!
ధారుణీ స్థితి గతి వేరు తరచు,
పరిగణింప వలెను - వ్యవహార సత్యాలు
చతుర లౌక్య చాక చక్య వేత్త.

వాచ్యం

కాకు రసము బట్టి - కంఠ స్వరము బట్టి;
వ్యంగ్య సరణి బట్టి - వ్యవధి బట్టి;
చతుర లౌక్య చాకచక్య వైఖరి బట్టి;
వాచ్య మందు అర్థవాద మొప్పు.

### ముసలి నక్క

ముసలి నక్క చూపి - ముత్యాల హారమ్ము
పసిడి లేడి తోడ పలికె నిట్లు;
''నేను మెచ్చి నాను - నీ అంద చందాలు,
నేర్ప గలను నీకు నృత్య కవిత''

2

''కవిత యన్న - లలిత కళ లన్న పడి చత్తు
గొప్ప గురుడ నంచు'' చెప్పి చేరి,
ముసలి నక్క నుండి - ముత్యాల హారమ్ము
పసిడి లేడి - గొనుచు పారిపోయె.

### చిరు నవ్వు

చిద్విలాస సరలి - చిరునవ్వు మొగ మందు,
అంద చందములను చింద గలదు;
పుడమి కవలి వెలుగు పొంగార కందోయి
తెల్లవార జేయు దెసల కొసల.

### కవిత

సరిగమ పదనిసలు - సంగీతమున కాక,
కవిత యందు గూడ కలవు - తెలియ;
కాన రావు గాని - కామ రూపము దాల్చి,
తాళ లయలు కవిత తాండవించు.

### నటన

నవ రసాలు కడగి నయన విన్యాసాలు,
ఏక మనుజు డభినయింప వచ్చు,
నయన మాంగి కాభినయములో ముఖ్యమ్ము
నటన బ్రదుకు జీవనాడి సుమ్ము.

స్వేచ్ఛ

గురువు గారి మాట కోవిద ప్రవచనాల్,
 వీను దోయి యొగ్గి వినగ వాను;
అంతరాత్మ లోన ఆచరించుట మేలు;
 బ్రదుకు లోన వీడ రాదు - స్వేచ్ఛ.

ఛందస్సు

శబ్ద మేది లేదు - ఛందస్సు లేకుండ,
 నెలవు సరిగమ పదనిలకు - కవిత;
సరస వచన కవిత - ఛంద మంతర్యామి.
 గుర్తు పట్ట వచ్చు కోవిదుండు.

వాలు

వెల్లి విరిసి పొంగి - విశ్వ చైతన్యమ్ము,
 పారు బో మహా ప్రవాహ సరలి,
వాలు లోన నరసి పడవలో పయనింప
 చేర వచ్చు దూర తీరములను.

నాయికా నాయకులు

నచ్చి - కవియు నెడల - నాయికా నాయకుల్
 ప్రజలు పెదవి విరువ రాదు గునిసి,
సంగమించు నచట సమ్యగానందమ్ము;
 వాగతీత వాస్తవ ప్రతీతి.

సాధన

సాధనమ్ము వలన సమకూరు నెరవేరు;
 నడచు లేచి నిల్చి బుడుత బిడ్డ;
అద్భుతసమయమ్ము - అరుదెంచు క్షణములో
 బాలకుండు తుదకు పరుగు లెత్తు.

తెగడ్త

సన్నుగిల్లు - సహజ శక్తి సామర్థ్యముల్
తెగడి నపుడు వ్రాని - తిట్టి నపుడు !
సమర మందు శల్య సారథ్య సరణిచే,
అంత మొందె కర్ణు డంతవాడు.

ధ్రువ తార

తోచు - కదల కుండ - ధ్రువతార నింగిపై
అలతి అలతి మిణుకు వెలుగు లొలికి.
ఆచరింప వచ్చు ఆదర్శములు తథా
నేల నిలిచి మనిషి నిశ్చలముగ.

పాట

వెనుక ఎవరొ తరుముకొని వచ్చు చున్నట్లు
పాట వేగిరముగ పాడ నేల ?
రాగ తాళ - గతుల ప్రక్క- వాద్యాలతో;
గాన సభ నిలుకడ కట్టు రక్తి.

శ్రమ

రాదు - లబ్ధి యెపుడు - శ్రమ లేక, కృషి లేక,
కలుగు గాథ - కృషికి గౌరవమ్ము;
జగతి లోన - సర్వ సంపదల్ సమకూరు;
శ్రమకు అభ్యుదయము జయము జయము.

గారడీ వాడు

హస్త లాఘవమున ఆ గారడీవాడు
చిత్ర రీతి 'నోట్లు' - సృష్టి చేసె;
వేడుకొనెను పిదప ప్రేక్షక శ్రోతలన్
చిల్లర ధన చయమ్ము చేతు లెత్తి.

### బ్రదుకు

తెలియ - బ్రదుకు - పెద్ద నిలువుటద్దము సుమ్మ
ప్రతిఫలించు వాస్తవాలు సతము,
ముసి ముసి చిరు నవ్వు మోముపై వర్తించ,
అద్ద మందు గూడ అదియె తోచు.

### తిక్కన

కలవు - నాద బిందు కళలు - తిక్కన లోన,
కానుపించ దెచట నైన - శ్లేష,
భావయిత్రి మీద పరగు తిక్కన దృష్టి,
కాదు - కవి అతండు; కవిత అతడు.

### పద్య కవిత

నెమరు వేయ దగిన - నీతి సందేశముల్
మరువ రాని భావ పరిమళములు;
స్థిర తటిత్తు లట్లు మిరుమిట్లు కల్పించి;
తెలుగు పద్య కవిత తేజరిల్లు.

### ఆట వెలది

కంద రచన విడువ - కవి కాడు - తెలుగులో !
ఆంధ్ర జయ పతాక మాట వెలది;
వృత్త రచన కవుల సత్తాకు నికషమ్ము;
జయము జయము తెలుగు ఛందమునకు.

### గురువు

గురువు గారి వాక్కు గూర్చి చెప్పను నేను,
సలిపినాను తెగని చర్చ లెన్నో !
మౌన బోధ చేయ - మందహాసము చింది,
సందియాలు చెదరు డెంద మ్మందు.

కవిత

వాడు నెడల వూని - వైకల్పిక శ్లేష,
క్వణ దనురణనానుకరణ ఫణితి,
కవిత కాదు వట్టి గారడీయే గాని,
తెలియ అది రస ప్రతీతి కాదు.

పెండ్లి

అరయ పెండ్లి తంతు - మరి ప్రజాస్వామ్యమ్ము;
కృతకమౌ వ్యవస్థ లెంచి చూడ;
అనుభవమ్ము లోన - అవి ప్రజా శ్రేయముల్
నిలిచె యుగయుగాల నిగ్గు తేలి.

ఆట వెలది

నాడు - జిగి బిగి కవనాలు వ్రాసితి గదా,
నారి కేళ పాక సార సరణి;
ఆట వెలది కాలి అందె సవ్వడి తోడ,
మెరపు తలపు నేడు మేళవింతు.

మెదడు

గుండె దున్ని విత్తి - పండించుకో వచ్చు;
మేడ కట్ట రాదు మెదడు తోడ,
ఉన్న మెదడు గుండె - ఉచిత నిష్పత్తిలో,
అత డొక మహర్షి - అమృత మూర్తి.

జ్ఞాపకం

మనిషి - నమ్మ రాదు - తన జ్ఞాపకమ్మునే,
మెదడు మోయ లేదు మేటి బరువు;
కాగితమ్ము పైన - కర్తవ్యముల నెల్ల,
దిన దినమ్ము వ్రాసుకొనుట మేలు.

విరునవ్వు

విరుత నవ్వు తెలుపు చిన్మయానందమ్ము;
మ్ముగ్ధ మోహనమ్ము మోము కెపుడు,
జ్ఞాన లక్షణమ్ము మౌన జీవన్ముక్తి,
మన్ను మీద పారు మిన్నుటేరు.

మార్పు

పడి పడి మనుజుండు బ్రదుకులో కష్టాలు,
మార్పు కోరుకొనును మనసు లోన;
మాడు పెనము నుండి - మండు ప్రొయ్యిని చేరు,
మార్పు వలన తరచు మంచి రాదు.

శ్లేష

భాష మీది ప్రీతి - బాల్య చాపల్యమే;
భావయిత్రి మీద - భక్తి నాకు;
గడుసు పోకడ గుల కద సభంగ శ్లేష !
నవ్వు కలుగ జేయు నాకు - తరచు.

కవిత

ప్రతిభ యున్న చాలు రసవత్ కవిత లోన,
పాండితీ ప్రకర్ష - ఉండ నేల ?
ఉజ్జ్వలోజ్జ్వల మగు ఒక్క వాక్యము చాలు !
అసలు కవిత హృదయ రస సమాధి.

కవిత

శ్రవణ సుభగ మక్షర పునః ప్రయోగమ్ము;
మెదడు కదిపి - శ్లేష కుదుప గలరు;
ద్వ్యర్థి - పండితులకు ఆహ్లాద మొనగూర్చు;
అసలు కవిత - హృదయ రస సమాధి.

శిల్పం

శిల్పివర్య - కడగి చెక్కుచుంటివి గదా !
సుత్తి ఉలిని బట్టి - మొత్తి మొత్తి;
ప్రతిభ చూపినావు - అతిలోక తేజస్సు,
విగ్రహమ్ము నందు - వెల్లి విరిసె.

పనులు

తూచి - అంతరంగ తుల లోన తర్వాత,
చేయ వచ్చు - పరులు చెప్పు మాట,
సలుప వలెను పనులు స్వచ్ఛంద బుద్ధితో,
స్వేచ్ఛ - బ్రదుకు యొక్క జీవనాడి.

ప్రతిభ

ప్రతిభ - పడయు నెడల బహుమానములు పేర్మి;
రాని వారు శ్రమకు పూన గలరు,
ప్రగతి పైన కూర్మి - జగతిలో వర్థిల్లు;
స్థాయి పెంచుకొనును సగటు మనిషి.

మౌనం

జల జల ప్రవహించు సంగీత నిర్ఝరుల్;
జ్ఞాన మసృణ మధుర మౌన సీమ;
నాకు తృప్తి నిచ్చు ఏకాంత మౌనమే;
నాద రహిత హాస నాట్య లీల.

మౌనం

వీణ రవళి కంటె - వేణు నాదము కంటె,
మధురిమమ్ము కలదు మౌన మందు;
జ్ఞాన యోగమునకు జనయిత్రి మౌనమే;
అనుగు దుహిత మందహాస చతుర.

రసమయం

ఒక్క అక్షరమ్మె ఓంకార సదృశమ్ము,
రస మయాత్మకమ్ము - రమ్య కవిత;
అందు సామ నాద బిందు నిక్వణ ముండు,
పడయ వచ్చు సపది పర నివృత్తి.

సంతకం

అరయ - విశ్వ శిల్పి హస్తాక్షరీ సౌజ్ఞ,
లిచ్చి నట్టి చిన్ని విరి విరి విరి;
తరళ కాంతు లీను - తారకా రింఛోలి,
స్రష్ట పెట్టి నట్టి సంతకములు.

మందు

అవని గలవు పెక్కు ఆరోగ్య యోగముల్,
వివిధ బహుళ వైద్య విద్యలందు;
వ్యాధి మాన్ప నిశ్చయ మగు ఔషధ మేది ?
ఒకటి యైన గూడ ఉర్వి లేదు.

మరణం

మరణ మనిన ఏమి ? పరిణామ ఫణితిలో,
పైని మెట్టు మెట్టు ప్రగతి యాత్ర;
సూక్ష్మ దృష్టి - చావు - శోచనీయము గాదు;
చావు - లాభ లబ్ధి జీవి కెపుడు.

భావయిత్రి

ప్రీతి లేదు నాకు - పిల్లి మొగ్గల పైన,
శ్లేష మీద - భాష ఘోష పైన,
సరళ శైలి మీద - స్వారస్యముల మీద,
భావయిత్రి మీద భక్తి గలదు.

### పెండ్లి

నరుల బ్రదుకు లాభ నష్టాల పెను మూట,
తలప - పెండ్లి ఒక ఉదాహరణము;
జీవితమ్ము నందు - పోవు స్వాతంత్ర్యమ్ము,
చూడ కొంత జరుగు శుభము గూడ.

### అద్దం

ముందు పెట్టి అద్ద మందు చూచిన గాని,
కాన రాదు నా ముఖమ్ము నాకు,
కవిత నాది నీదు గళమందు మార్మ్రోగ,
ఏను గుర్తు పట్టి నాను - నన్ను.

### సర్దు కొనుట

అవని మీద మనము నివసించు చున్నాము,
క్రుళ్లె పుడమి చాల నాళ్ల క్రితమె;
పృథివి నడువదు మన ఇష్ట ప్రకారమ్ము
సర్దుకొనుట మేలు జనము లెల్ల.

### శ్రోత్రియత

పండితోత్తములకు ఉండు - చాదస్తమ్ము,
గుండె పట్ట వచ్చు కొంత బూజు,
ప్రగతి కోరు హేతువాద ప్రపంచాన,
శ్రోత్రియత్వమునకు చోటు లేదు.

### సత్యం

చరిత కేది ఆత్మ ? సత్యమే ! సత్యమే !
ఇది మదీయ చరిత - బ్రదుకు గాథ !
అక్షరాల సత్య మందించు చున్నాను.
నిజము మనుజు బ్రదుకు నీతి నిగ్గు.

ఉత్తముడు

పరుల మేలు కోరి ప్రాణాలు నర్పించు
బోధిసత్త్వు డెవడొ పుణ్యమూర్తి;
ఉత్తముండు జనుల కుపకార బుద్ధితో
చేత నైన మేలు చేయు గాత.

కవి

ఉండు కవికి కవికి ఒక విశిష్టత సదా,
నడుల యందు పలుకు బడుల యందు,
గుర్తు పట్ట వచ్చు గూఢ గుంఫన ముద్ర,
పచ్చ బొట్లు ఉండ వచ్చు కొన్ని.

వృత్తి

విడిచి పెట్ట రాదు వృత్తి నెవ్వరు గాని,
మలిన మంచు - పాప కలిత మంచు;
కలియు పాప మన్ని కార్యాల సతతమ్ము
అగ్ని లోన ధూమ మమరు నట్లు.

మౌనం

మౌన మందు కలవు - ధ్యాన నిమ్నోన్నతుల్
మస్పృణ నిర్వికల్ప రస సమాధి,
అంతరంగ శాంతి దాంతి సత్ సంగముల్;
మానస సరసీజ మధు సమృద్ధి.

కాలం

సంఘ జతులు గతులు - సంప్రదాయము లెల్ల,
మారె - క్రొత్త వెన్నొ చేరె నేడు;
కాలమా ! గ్రహింపు కైవారములు సదా,
నీ మహత్తు తెలియ నేర దెవరు.

విద్య

శ్రేష్ఠ జీవి యెవ డనుష్ఠాన వేదాంతి ?
వ్యర్థ జీవి అధ్యయన పరుండు;
విద్య కాదు వివిధ వేదాంత పఠనమ్ము;
శుష్క కంఠ శోష - మాత్ర ఘోష.

కవిత

కవిత - అల్లి బిల్లి కత లల్లుటా ? కాదు !
లోతు పాతు లరయు - నీతి గీత;
కర్మ యోగముండు ధర్మ సూక్ష్మము లుండు;
తెలుపు చుండు బ్రదుకు తెరువు - కవిత.

విద్య

జగతి లోన విద్య - చైతన్య చిహ్నమ్ము!
వెలుగు త్రోవ చూపు - తలుకు బెలుకు;
జ్ఞాన పూరిత మృత సంజీవనీ జ్యోతి;
ప్రగతి యోగ జతుల రాస లీల.

ఛందస్సు

సాహితీ జగాన - ఛందో నియతి లోన;
కలదు సామవేద గాన మహిమ;
ఛంద మెపుడు సరస శబ్ద సాంప్రతికమ్మై,
కారయిత్రి లోన కలిసి పోవు.

కార్యదర్శి

మెదడు నుండి వెడలు - మిరుమిట్లు రింఛోలి,
గుండె నిండు ప్రేమ భాండ నిధులు,
శిరము చుట్టు వెలుగు పరివేష రోచిస్సు
కలువు నొక్క చోట కార్యదర్శి.

చదువరి

విభృత కింకిణీక నిక్వణ శ్రుతి లయల్,
శబ్ద చర్విత చణ చంక్రమణము;
అక్షరాక్షర పున రామ్రేడితావృత్తి;
చక్కిలి గిలి పెట్టు చదువరులకు.

వరం

బాగు చేయ దగును వసుధ యంతయు ముందు;
వద్దు - చర్చ గిర్చ - వరము గూర్చి;
ప్రజకు కానరాడు భగవంతుడనువాడు;
కనుల ముందు ప్రజలు - కలరు కలరు.

విశ్వాసం

హేతు బద్ధముగ వచింప సాధ్యము గాదు,
చాలు - నమ్మకమ్ము - చాలు చాలు !
విజయ మొందు తుదకు విశ్వాసమే సదా;
కొండ లెన్నొ పిండి కొట్ట గలదు.

నల్ల బొంకు

నల్ల బొంకొకటియు నా నోట రాలేదు,
పలికినాను తరచు పచ్చి నిజము;
సత్యమునకు స్థలము సమయమ్ము కానిచో
గొంకి నోరు మూసుకొనుట మేలు.

జవరాలు

రెచ్చ గొట్ట వచ్చు - ఇచ్చకాలను పల్కి,
తరుణి మొదట పురుషు దరిని చేరి,
వేయ వచ్చు తుదకు వెనుకంజ జవరాలు,
క్రుంగి పోవ పురుషు గుండె కాయ.

కవిత

కదలు కవిత ఆడు హృదయ రోదసి లోన
కమ్మ తెమ్మెర కెరటమ్ము కరణి;
వేణు కల రవమ్ము - వేయి తంత్రుల వీణ
శ్రుతులు గలుపు కవిత జతుల లోన.

శిల్పం

కనులు రెండు మూసి కొని పాల రాతిలో,
ఏ సరస్వతి దరిశించి నాను,
కనులు రెండు తెరచి కాలమ్ము వెచ్చించి
చేత ఉలిని బట్టి చెక్కినాను.

పద్యం

పాత చింతకాయ పచ్చడా? పద్యమ్ము ?
బూర్జువా విలువల బూజు కాదు;
షడ్రస మిళిత మగు షాడబం బగు గాత,
తెలుగు మీరుటకు ప్రతీక యగుత.

కవి

వర్తమాన మందు వర్ధిష్ణు కవి గారు;
ప్రహసనమ్ము లోని పాత్ర ధారి;
కీర్తి శేషుడైన - కిమ్మీర పరివేషి
దిగ్ దిగంతరముల తేజరిల్లు.

నిగ్రహం

ఏమి చెప్ప దగును ఇంద్రియమ్ముల గూర్చి ?
అదుపు చేయ వలెను అణచి పెట్టి;
పుడమి మీద మనిషి - పురుషోత్తముండౌను;
నిచ్చెనలను వేయ నిగ్రహమున.

సామాన్యుడు

బ్రదుకులో ఉదాహరణము కాకున్నచో,
హెచ్చరికగ ఉండవచ్చు - వ్యక్తి;
సంఘ మందు సర్వ సామాన్య మనుజుడై;
పుట్టి పెరిగి తుదకు గిట్ట నేల ?

కార్యశూరుడు

శ్రోత్రియుండు కాడు ఏ త్రికాలజ్ఞుండు;
వాలఖిల్య యోగి వరుడు కాడు;
కార్య శూరు డేర్చి - కర్తవ్యములు తీర్చు,
నేల మీది వాస్తవాల నెరిగి.

అదును

ప్రతి పనికిని పదను బుుతువు కాలము నుండు;
పంట భూమి కేరువాక పోలె;
జరుగ కృషికి ఉచిత సమయమ్ముతో పెండ్లి;
పుట్ట బోవు బిడ్డ - ''పూర్ణశుభము''.

పరం జ్యోతి

అరుగుదెంచె గురువు మిరుమిట్లతో వెల్గి;
చెడని ముద్ర వేసి - వెడలె - జ్ఞాని,
వచ్చె - మిణుగు పురుగు వలె ఆ పరంజ్యోతి
వెడలె నపది గూఢ వేషధారి.

లయ

ఛంద మందు కెరలి చిందు త్రొక్కును లయల్;
తలపు లందు హొయలు తాండవించు;
సలుపు నృత్యకేళి - శబ్దాల గతి జతుల్;
అరయ కవన రచన కాత్మ లయయె.

మచ్చ

మాన వచ్చు వుండ్లు - మాసాల లోపుగా;
మచ్చ లెల్ల నిలుచు మాయ కుండ;
చరిత లోన జరుగు - సన్నివేశము లెన్నొ!
వెక్కిరించరాదు - వినము గ్రక్క.

గమనము

అడుగు వేసి తీసి - అడుగు వేసిన చాలు,
ప్రగతి పథము నందు - బ్రదుకు లోన,
గమ్య సిద్ధి కాదు - గమనమ్మె ముఖ్యమ్మె !
ఆప నేల గుండె ఊపు చూపు.

పూమొగ్గ

వన్నె చిన్నె లొలుకు చిన్నారి పూ మొగ్గ;
స్రష్ట తప్ప ఎవడు సృష్టి చేయు ?
జగతి లోని - ప్రకృతి సౌందర్య రింఛోళి,
విశ్వ శిల్పి ప్రతిభ వెల్లడించు.

ప్రగతి దిక్కు

జగతి గొప్ప దేది ? - స్థాయి భావము కాదు;
నిలిచి యున్న మేటి స్థలము కాదు,
కాదు కాదు గొప్ప కర్తవ్య గమ్యమ్మె;
బోను ప్రగతి మార్గ యాన దిక్కు.

మననం

కలుగ వచ్చు - మేటి తెలివి తేటలు - బోధ;
పెక్కు మంది మాట వినుట వల్ల;
మనిషి - జగతి గూర్చి మనన యోజన చేయ,
తుదకు జ్ఞాన మబ్బు బ్రదుకు నందు.

చర్బి

మెరయు ఎగురు నపుడు - మిణుగు రెక్కలు విప్పి,
మెదడు - వాడు నపుడు మెరయ వచ్చు;
చర్బి నలుప మెదడు - చైతన్యవంతమౌ
ప్రభలు చిందు సానబట్ట మణులు.

దొంగలు

కన్ను గప్పు దొంగ లున్నారు ! జాగ్రత్త;
జగతి లోన సర్వ శాఖ లందు;
తిరుగ గలరు దొడ్డ దొరల మాదిరి సదా,
అల్లి బిల్లి కల్ల బొల్లు లల్లి.

సత్యం

చిత్త శుద్ధి యున్న - శిష్య మిత్రుల చేత,
అపజయమ్ము నాకు - అభిమతమ్ము;
కదన మనిన నాకు కాంక్ష యున్నది గాని,
ఇచ్చగింతు ''సత్య మేవ జయము''.

ఆనంద సంతృప్తి

తీరి నపుడు - కొన్ని కోరికల్ కల్పించు,
మాట మేర దాటు మధురిమమ్ము;
అనుభవింప వచ్చు - ఆనంద సంతృప్తి;
దరికి చేరు దైవ దర్శనమ్ము.

స్వాగతం-

రమ్ము - ప్రగతి తెమ్ము - రవి వోలె ఉదయించి
స్వాగతమ్ము నీకు స్వాగతమ్ము !
ప్రీతి గొలుపు మయ్య జ్యోతిర్మయుడ వౌచు
చీకటి తెర లెల్ల - చెదరి పోవ.

అప్తునకు

నింప గలవు - వెలుగు - నీవు నా హృదియందు,
    అందు కొనుము వేగ స్వాగతమ్ము;
అంద జేయ గలవు - ఆరోగ్యమును నీవె,
    మందు రుగ్మతలను మాన్ప లేదు.

యోజనము

మౌన నిష్ఠ తోడ - మానసాంతరములో,
    ఉద్భవించు పెరుగు యోజనమ్ము;
చంచల రసనమున జన్మించి వాగ్ధ్వనుల్,
    గాలి లోన - మరల కలసి పోవు.

ఉల్క

మించు వోలె - క్షణము మిరుమిట్లు ప్రభ చాలు !
    సతము వెలుగు తార చాల మేలు;
ఉల్క వోలె - వేగ ఉర్వి చేరిన చాలు;
    అద్భుత కవిత అది - అక్షరాల.

కాలం

కాలము రవి బట్టి గణియింపగా నౌను;
    కలదు - రవి విహీన కాల మరయు;
కదల నట్టి - స్తబ్ధ కాల మున్నది గదా,
    నా నమస్సు కాల నాయకునకు.

భాగినులు

భాగ వంతు లెవరు ? పనికి దేనికినైన;
    కర్త ! తోడ మరియు కారయితయు,
అరయ ప్రేరకుండు అమోదకుడు గూడ;
    వీరి లోన సూత్రధారు డుండు.

పేకాట

పేరు కొనును నటన పేకాటలో గూడ;
దర్ప హావ భావ దర్శనములు;
బూకరింప వచ్చు భ్రుకుటి విక్షేపముల్;
నడువ వచ్చు కపట నాటకమ్ము.

పెండ్లి

వెంగడింప - పెండ్లి - మాంగళ్య ధారణా ?
విందు భోజనమ్మ పెండ్లి అనిన ?
మిన్ను ముట్టు - డోలు సన్నాయి రవళియా ?
జీవితైక్య యోగ సిద్ధి - పెండ్లి.

తెలియ జాలని శక్తి

నిఖిల సృష్టి - గణిత నిర్ణీత బద్ధమ్ము !
సృష్టి కర్త - ప్రౌఢ చిన్మయుండు;
కలదు కలదు మనిషి తెలియ జాలని శక్తి !
మేటి మెదడు దాటి - మాట దాటి.

రాక్షసుడు

అరయ యోగి యెవడు ? - కరుణార్ద్ర హృదయుడే!
గొప్ప దేది ? జాలి గుండె కంటె ?
ఉత్తమోత్తముడు పరోపకారియె సుమ్ము;
రాక్షసుడు స్వహిత పరాయణుండు.

కవిత

మూడు కొలతల జగమును చూచు మనుజుండు,
కూర్చి చూపు కవిత కొలత లెన్నొ;
సాహితీ తపస్వి - సర్వతోముఖ దీప్తి;
అరయు గుప్త దిగ్దిగంతరములు.

నడికి రేయి

విచ్చి - పరిమళించు విరులపై జాబిల్లి;
వెన్నెల సుధ జల్ల వేడ్క తోడ;
గులక రాయి నవ్వ - సెలయేటి అలతోడ,
నడిమి రేయి చూడ వెడల దలతు.

గానం

గాయకోత్తముండు - కవి కంటె శ్రేష్ఠుండు,
సహజ శక్తి తోడ - జనన మందు,
పొంగి పోవు నవది సంగీత రసికుండు;
నగటు మనిషి గూడ - సంతసించు.

చోరులు

మంచివారు నిదుర మైకమ్ములో నుండ
రేయి పవలు దోపిడీలు జరుగు;
మేలు కొనుడు - లెండు మేధావు లగువారు,
చోరు లెల్ల - వెరచి పార గలరు.

టోపి

కుట్టు దగును శిరము పట్టు నట్లుగ టోపి,
గుడ్డ కత్తిరించి కొలత బట్టి;
మొదట టోపి కుట్టి - పిదప పెట్టుట యెట్లు ?
తలను కత్తిరింప తరము గాదు.

మనిషి

మనుజు డనిన గొప్ప మహిమ గల్గినవాడు
మృణ్మయుండు గాడు చిన్మయుండు !
ఆత్మ శక్తి యుండు - అంతరంగము నందు;
గొప్ప కార్యములను కూర్చగలడు.

జిడ్డు కృష్ణ మూర్తి

జిడ్డు కృష్ణ మూర్తి - స్వేచ్ఛా మనన శీలి;
అంతరాంతరాల నరయ గలడు;
భ్రమల హొయల తోడ - రాజీపడని వ్యక్తి
క్రాంత దర్శనమ్ము గల మహర్షి.

2

పంజరమ్ము విడిచి - పక్షి ఆకసములో
దిగ్దిగంతరములు తిరుగ సాగె;
గూడు కట్ట కుండ కూజితమ్ములు కూర్చి;
జిడ్డు కృష్ణమూర్తి చెట్లపైన.

3

విశ్వ మందు గొప్ప వింత వృత్తాంతమ్ము;
జిడ్డు కృష్ణమూర్తి జీవితమ్ము;
సలిపె-మనుజచిత్త కలశాబ్ధి మథనమ్ము;
నవ్య దివ్య కూర్మ నాథు డగుచు.

4

విశ్వ చరిత లోన - వింత లందున వింత
జిడ్డు కృష్ణమూర్తి - చిత్త శుద్ధి.
చెప్పె తాను సత్య జిజ్ఞాసువే యంచు,
మనిషి జ్యోతి యగుత తనకు తానె.

సంగీతం

సంకుల సమరమ్ము - సంగీతమా? కాదు!
స్థాయి - రుచుల శ్రుతుల హొయి గొలుపు;
అడుగు వేసి తీసి - అడుగు మెల్లగ వేయు;
పాట - నడచు గాని పరుగు లిడదు.

### స్వేచ్ఛ

చిన్న దిల్లు - పెద్ద చెఱసాల సంఘమ్ము;
కలవు - శృంఖలాలు - కాన రావు;
బ్రదుకు కవసరమ్ము - ప్రశ్న వేసెడి శక్తి;
అరయ మనుజు జన్మ హక్కు - స్వేచ్ఛ.

### శబ్ద ప్రమాణం

చదువు వచ్చి గూడ - శబ్ద ప్రమాణముల్
నమ్ము నట్టి పెక్కు నరులు గలరు;
మెదడు వాడకుండ బ్రదుకు వారెందరో!
గాలి తేలు నట్టి ధూళి వోలె.

### గానం

రక్తి కట్టు దెపుడు రాగాల జాగాలు
లేని యెడల మధుర గాన విద్య;
చల్లు మెల్ల మెల్ల - జాబిల్లి వెన్నెలల్;
ఉల్ల మలర జేయు చల్ల దనము

### మధ్యాహ్న మార్తాండుడు

మనము చూడ లేము - మధ్యాహ్న మార్తాండు;
అస్తమించు సూర్యు నరసినాము;
అతడు చూపి నట్టి ప్రతిభా విశేషముల్,
గత చరిత్ర లోన - కలిసి పోయె.

### అధికారం

వ్యాధు లెన్ని వచ్చు - అధికార మొనగూడ,
కూర్చు కొనుము లేని గ్రుడ్డి తనము;
చెవుడు వచ్చు - కనులు శిరము పైనకు ఎక్కు;
మానవత నశించు జ్ఞాన ముడిగి.

సగటు మనిషి

చదువు - పదవి - ధనము మెదడు వొక్కటి యున్న
వేయ వచ్చు అహాము వెఱ్ఱి తలలు;
విద్య లేక యున్న - వినయమ్ము సరిపోవు,
సగటు మనిషి - గొప్ప సహృదయుండు.

తర్కం

తర్క మెల్ల - కొరవి దయ్యాల వేటయే;
వ్యర్థ కంఠ శోష - వాద ఘోష !
వివిధ దర్శనములు - వేదాంత భాష్యముల్;
ముక్తి కొరకు కావు - భుక్తి కొరకు.

స్నేహం

అంతరంగ విద్యుత్ ప్రసరణలో,
సమ తరంగ దైర్ఘ్య మమరె నేని,
అమరు స్నేహ నిరతి - మమతానుబంధముల్,
సృష్టి శిల్ప మయ విశేష మద్ది.

సంగీతం

ఔషధాల కంటె - అరయ సంగీతమే;
మించి రోగులకును మేలు - చేయు,
జోల పాట తోడ - సుప్రభాతము తోడ,
ఆనుపత్రు లెల్ల - అలరు గాత.

సృష్టి

పిల్లి ఎలుక బట్టి వేటాడి తిని వేయు,
సింహము తిను లేళ్ల - సంహరించి,
పెద్ద చేప తినును పిన్న చేపల నెల్ల,
ప్రస్తుతింప నేల ? స్రష్ట నింక.

పెండ్లి

కలి యుగమ్ము నందు - కాల దోషము పట్టె,
పెండ్లి అనిన పట్టి పిచ్చి పేర్మి !
పెండ్లి కాక యున్న - పెను ప్రమాదము సుమ్ము;
వేరు తెరువు లేదు - పెండ్లి కంటె.

పద్య శిల్పం

పద్య రచన లోని - ప్రతి పదార్థము నెంచి,
గొప్ప పండితుండు - చెప్ప వచ్చు;
రచన లోని - శిల్ప రస కళా ప్రౌఢిమల్;
చాటి చెప్ప గలడు సహృదయుండు.

సహజ శక్తి సామర్థ్యములు

జీవ కోటి కెల్ల - శృంగార - రస కేళి;
అభ్యసింపకుండ అమరు చుండు;
జన్మ తోడ - కొన్ని శక్తి సామర్థ్యముల్;
అన్ని ప్రాణులకును అమరుచుండు.

భక్తుడు

అనుభవైకవేద్య మధ్యాత్మ యోగమ్ము !
పుడమి కవలి వెలుగు పుంజ కొనును !
భక్త వరుడు తరచు పడయు జీవన్ముక్తి;
కొలత కంద దతని గుండె లోతు.

పొట్ట నింపుకొనుట

నింపు కొనుటె పొట్ట నీచమైనది గదా !
మనిషి చేయు అన్ని పనుల లోన;
పుడమి మీద మనిషి ఎడద యెల్లల నెల్ల,
మంచి మనసు గలిగి పెంచు కొనుత.

బ్రదుకు

వాఙ్మయమ్ము తరచి వ్యాసుండు వాల్మీకి,
　　వ్రాసినారు గొప్ప గ్రంథములను;
కలి యుగమ్ము వేరు - కావ్యపాత్రలు వేరు,
　　బ్రతుకు వేరు - కవన గతులు వేరు.

భారతం

భారతమ్ము పైన - భక్తి యున్నది నాకు,
　　అతిశయోక్తు లచట అచట నున్న;
పాత్ర లెల్ల బ్రతుకు ప్రతిబింబములు సుమ్ము,
　　దర్పణమ్ము నీతి ధర్మములకు.

కరుణ

బౌద్ధ సంస్కృతి పునరుద్ధరించిన గాని,
　　మానవత నిలువదు మహిని, ఇంక;
గుండె లోన కరుణ - పండించ కున్నచో!
　　దానవుండె అగును మానవుండు.

జాతి మమత

జ్ఞాన విస్లవమ్ము - సకల దిక్కుల ప్రాకి,
　　సంహరింప గలిగె - జాతి మమత;
విశ్వ జనులు ఎట్టి - భేద భావము లేక,
　　ఎల్ల లెల్ల మరచి ఏక మగుత.

అభినేత్రి

నవ్వి నపుడు రాలు - నవరత్న దీధితుల్ !
　　వ్రేలు కనుల తుదల వేల్పు విల్లు;
మ్రోయు వాణి వీణ వేయి తంత్రుల జతుల్;
　　ఆడి నపుడు ఆమె పాడి నపుడు.

శిష్య గణము

పచ్చి దొంగ గురువు పాద సన్నిధి చేరు,
చిత్త శుద్ధి యున్న శిష్య గణము;
శిష్య వరులు దివ్య శేముషీ శిక్షలో!
గురువు కంటె గూడ గొప్పవారు.

గురువు

అరయ అతని మెదడు మెరపు తీగెల పుట్ట !
గుండెకాయ అమృత భాండ సమము;
వాక్కు - నవ్య వేద బుక్కులై - నినదించు !
కరడు గట్టి నట్టి కవిత - యతడు.

కోరిక

కోర్కి పుట్ట వచ్చు - గుత్తి వంకాయపై !
కలుగు కాంక్ష పనస కాయ పైన !
కూర కూర యందు - క్రొంగ్రొత్త రుచి తోచు !
క్రొత్త తృప్తి ఎడద - కోరు కొనును.

దారిద్ర్యం

ధరణి లోన లేదు దారిద్ర్యమున కంటె,
బ్రదుకు లోన దుర్భరమగు బాధ !
వేరు నరక మేది వృద్ధాప్యమున కంటె ?
మేలు చావు రెండు మిళిత మైన.

మనుజ దేహం

మనుజ దేహ మనిన - మాంసమ్ము రక్తమ్ము,
అరయ మనిషి ఇంద్రియాల గూడు;
సంప్రదాయ విధులు చట్టాలు గిట్టాలు;
సహృదయకము కావు చాల వరకు.

అతిథి

అనువు గాని మాట అతిథి పల్కగ వచ్చు,
వాదులాడ బ్రదుకు పాడి గాదు,
స్థలము గాదు తగిన సమయ మయ్యది కాదు;
కూర్మి చూపి ఊరకొనుట మేలు.

స్వేచ్ఛ

విద్య - పెండ్లి - మైత్రి ఉద్యోగ యోగముల్,
స్వేచ్ఛ కొంత అపహరింప గలవు,
బ్రదుకు తెరవు తరచు ప్రాథమ్యలు తీర్చు;
పనులు చేయు నట్టి వరుస కూర్చు.

చావు

చావ డొక్క సారి - జీవి యీ జగతిలో!
క్షణము క్షణము తరచు చచ్చు చుండు!
కొంత చావ వచ్చు - కోప తాపము రేగ,
చంపు ఇంద్రియాలు చాలు తుదకు.

సహృదయత

కీర్తి - ధనము - హర్మ్య గేహ వాహనములా?
సృష్టి శిల్ప మణి కిరీట మేది?
ప్రతిభ వెదకి వెదకి బహుమాన మిడు బుద్ధి,
ఆర్ద్ర దివ్య సహృదయ పరివస్య.

వినయం

వర్తమాన జగతి - కీర్తి ప్రలోభమ్ము,
ఉత్తములకు గూడ ఉండు - జబ్బు;
ఉండు కవుల లోన స్వోత్కర్ష హెచ్చుగా;
మనిషి కుండ వలెను వినయ గుణము.

కవిత

ఉండ నేల ప్రతిభ ?  వ్యుత్పత్తి కవితకై;
  కరగు నట్టి గుండెకాయ చాలు;
ఉబికి పైకి వచ్చు - ఒక్క వాక్యము మేలు;
  చాలు రస పరీత శబ్ద మొకటి.

భాష

భాష వాడ వలెను భావానుగుణముగా;
  నవ రస రుచిర మగు కవిత లోన;
కఠిన పదములను కవి వాడ వలె గదా;
  వ్రాయునపుడు ఘోర రణము గూర్చి.

వేణువు

వేణు వెవడొ కూర్చె - వెదురు కాండము నుండి;
  ఏర్చి కూర్చి బొక్క లెల్ల చేసి;
వీణ మెట్లు తీర్చె విద్యాధరస్వామి;
  తీగ లెల్ల పేర్చి తీర్చి దిద్దె.

బ్రదుకు

ఎట్టి లక్ష్యి లేదు - ఎండమావుల వేట;
  చివరకు మిగులు నొక చిన్ని సున్న;
బ్రదుకు వెలుగు నీడ పడుగు పేకల నేత;
  యశము కొరకు ప్రాకులాడ నేల?

పేద

ధనము పెంచ గలదు ధనము - వడ్డీ చేర్చి,
  పేదవాడు ధనము పెంచ లేడు;
గాలి లోన కలియు కర్పూరమే - పేద;
  శ్రమ హరించు పేద ప్రాణములను.

కవి

మెరవు తీగె వంటి మెద దున్న తేజస్వి;
కరడు గట్టి నట్టి కవిత - అతడు !
లేవు - అతని లోన లేవు దర్పోద్ధతుల్,
గంగి గోవు వంటి కవి అతండు.

కవి డింభకుడు

డింభకక కవి వరుడు - శుంభదుద్వేగియై !
కలల శీకరములు గాలి తేల
చిలిపి అలలు రేగు సెలయేటి జలపాత
సదృశ వచన రచన సలువ వచ్చు.

హాస్యం

క్రూర బుద్ధి కాదు - కుటిల తంత్రము కాదు;
అమృత యోగ సిద్ధి - హాస్య రసము;
శాంతి సామరస్య సర్వతోముఖ దాంతి;
స్వస్తి వాద వేద వాక్య రవము.

వాణి సేవ

గాలి ప్రోగు చేయ కనక వర్షము రాదు;
ఫలము కలుగు కష్టపడిన యెడల,
ఎంచ - ధన దురాశ - ఎండమావుల వేట,
చేయ వలయు వాణి సేవ సతము.

ముద్దు

మించు తీగె లలికి మేటి మబ్బుల లోన;
కడలి గగనములను కౌగిలించి;
పిడుగు అడవు లందు బీభత్సమును గూర్చు,
అట్టి - ''ముద్దు'' - ప్రౌఢ అభిలషించు.

అధి నరుడు

నరుడు సృష్టి లోన పరిణామ గతి చేత
కోరి కూర్చు కొనుత క్రొత్త శక్తి,
శక్తి పెరుగు స్వీయ సంకల్ప బలముచే!
నరు డధి నరుడగుత ధరణి మీద.

పత్రికా విలేఖరి

నేడు చూడ విద్య గూడ వ్యాపారమై
సర్వ శాఖ లందు స్వార్థ మమరె,
ప్రగతి శీలి యైన పత్రికా రచయితే,
దేశ భక్తు డంచు తేలె నిపుడు.

లక్ష్య శుద్ధి

గుర్తు పట్టరాని గుంపు గోవిందయ్య
చెప్పు విసరె నేత చెంప తగుల !
మెచ్చి - లక్ష్య శుద్ధి - మిన్ను మార్మ్రోగగా;
సింహ నాదములను చేసె జనము.

సంస్కృతి

సంస్కృతి యన నేమి ? సంస్కార మన ఏమి?
ధర్మ మేది ? పరమత సహనమ్మె;
క్షమ - అహింస - తాల్మి - సహజీవనము - ప్రేమ,
సహజ లక్షణములు సజ్జనులకు.

దానము కాదు

ఇది - చిరు బహుమానమే; దానమా? గాదు!
స్వీకరింపు మయ్య చిత్తగించి,
సిగ్గు పడెద నేను - చెప్ప కెవ్వరికైన,
ఒక్క నూలు పోగు - ఉడుపతి కిది.

### సత్యం

జగతి యందు జరుగు సంగ్రామ రంగాల,
సత్య మెపుడు మొదట చచ్చి పోవు !
జరుపగలరు – శాంతి సంస్థాపనార్థమే;
ఘోర రణము లెల్ల వీర వరులు.

### కొజ్జాలు

ఆడ మగయు గాని అంశాలు కొజ్జాలు;
జగతి కానుపించు – చాల చోట్ల;
మనుజ సంఘమందు – మాత్రమే కాకుండ;
సకల విద్య లందు శాఖ లందు.

### మౌన ముద్ర

పాడు చుండు వలపు పగులు వారిన గుండె,
ఏడ్పు – పేదరికము ఎలుగు నెత్తి;
కనని ఆన గోణుగు గద్గద స్వరముతో;
మౌన ముద్ర దాల్చు జ్ఞాన మెపుడు.

### కామ పిశాచి

ఒక్క దున్నపోతు – ఎక్కారో వెలదిపై !
అది పిశాచ లాస్య హింస పదము,
ప్రేమ లేదు – లేదు శృంగార లేశమ్ము,
వెఱ్ఱి తలలు వేయు విష పిశాచి.

### వీనులు

వీను దోయి తోడ – వినెడి వారున్నారు!
కలరు వినెడి వారు కడుపు తోడ,
వీను లుండి గూడ వినని వా రున్నారు
కలరు కనుల తోడ వినెడివారు.

బైబిలు

సులువు దూర వచ్చు సూది బెజ్జము నుండి
ఒంటె చౌరవ చేసి ఒక్క నాడు!!
ధనికు డెన్న డైన తా స్వర్గ సీమలో,
ద్వార మధిగమించి దూర లేడు.

స్వస్తి

ఈ జగత్తు మిథ్య – సృష్టి సర్వము మాయ !!
నాటకమ్ము కొంత బూటకమ్ము;
వేత్త కైన – ఆర్షవేదాంతులకు నైన
అంతు చిక్కకుండు – శాంతి-స్వస్తి.

సంధి

బ్రదుకు లోన తరచు రాజీ పడుట మేలు,
బ్రదుక వచ్చు – పరుల బ్రదుక నిచ్చి,
పొంద నేల? జయము పోరాటములు సల్పి;
సంధి యందు గొప్ప శాంతి గలదు.

నవ్వు

ఏడ్చి – బ్రదుకు లోన – ఏమి లాభము లేదు !
నవ్వు వాఙ్మయమున నవ రస ఖని;
లేదు నవ్వు మించు – వేదాంత సూక్ష్మమ్ము,
తత్త్వ దర్శనమ్ము ధరణి లోన.

మైత్రి

నీవు – పది అడుగులు నా వైపు వేయుచో,
ఎడద పొంగి పోయి ఎగుర గలను;
స్నేహ నిరతి తోడ – నీ వైపు వెంటనే,
వేయి అడుగు లేను వేయ గలను.

కోడి కూత

కోడి పుంజు లోన - చూడ వచ్చును గదా;
వెల్లి విరిసి - వచ్చు - వెలుగు టలలు;
మరి యొకండు వినుము మరణ శయ్యను చేరి,
ముసలి వగ్గు రేయి మూల్గు రవళి.

సహనం

స్వీయ జాతి మతము - చిరు చిన్న పరిధులే !
వెల్లి విరిసె - జ్ఞాన విప్లవమ్ము;
సహన మొకటె నేడు సంస్కార చిహ్నమ్ము,
మానవత్వమునకు మంచి బాట.

నక్క

బోను లోన గ్రుగ్గి పోవచ్చు - సింహమ్ము ?
ఏల వచ్చు అడవి నెల్ల - నక్క;
అల్ప మృగము లెల్ల - ప్రాణాలు బిగబట్టి,
పచ్చ గడ్డి మేసి - బ్రదుక వచ్చు.

పొగడ్త

కన్య నమ్ము నంద కత్తె పీవని మెచ్చ;
కవియు నమ్ము నతని కవిత మెచ్చ,
ఉబ్బ వేయు వార లున్నారు - జాగ్రత్త;
పొంగి పోవ రాదు పొగడ జనులు.

అహం

మెదడు విప్పి చూడ - మేటి తారా కోటి,
కొంత తెలియ వచ్చు - వింత సృష్టి;
విద్య యొసగ గలదు - వినయమ్ము మాత్రమే,
కూర్చు చుండు అహము గొప్ప వెఱ్ఱి.

కరుణ

గుండె - కరుణ తోడ - పండించ గల్గిటే,
ఉత్తమోత్తమ కృషి - ఉర్వి లోన,
ప్రగతి కేవి ఐదు ప్రాణాలు జగతిలో ?
కరుణ–కరుణ–కరుణ–కరుణ–కరుణ.

కవిత

కవిత - మేలి తరము - గణిత శాస్త్రము కంటె;
కవిత మిన్న - లలిత కళల కంటె,
గుండె దున్ని కవిత పండించు బ్రదుకులో,
చిందు కవిత అమృత బిందు వృష్టి.

రామాయణం

ప్రేమ కలదు నాకు - రామాయణము మీద,
''రామ భక్తి'' లేదు బ్రదుకు లోన;
ఆది కావ్య మెల్ల - అపాత మధురమ్ము;
నాకు రాము పాత్ర నచ్చ లేదు.

కవిత

కవిత లోన గలవు శ్రవణ తోషణ మించి,
హృదిని మెదడు మేలవించు - ధ్వనులు;
అనురణనము గూర్చు - అర్థాంతరము గూర్చు;
యతులు దాటి ప్రాస జతులు దాటి.

హెచ్చు

విద్య యెక్కు వైన - పిచ్చి యెత్తును గదా;
అట్లె హెచ్చు తిండి హాని గూర్చు;
చేటు దెచ్చు తరచు జీర్ణమ్ము కానిచో,
చదువు తిండి మనుజు బ్రదుకు నందు.

సూక్ష్మ దృష్టి

మనిషి - హెచ్చు స్థాయి మమత చెందగ రాదు,
 బ్రదుకు లోన దేవి పైన గాని,
చిన్మయత్వ సరళి - సృష్టి వైవిధ్యమ్ము,
 సూక్ష్మ దృష్టి తోడ - చూడ వలెను.

మనిషి

మిథ్య యనుట జగతి - మెట్ట వేదాంతమే !
 సంప్రదాయ సహిత సంఘ మెల్ల;
భాష - మతము - మనిషి బ్రదుకు సర్వస్వమ్ము,
 పరమ నిష్ఠుర మగు - వచ్చి నిజము.

సొగసు

చేర వచ్చు సొగసు - వైరూప్యమున యందు;
 ఒక అనుక్రమణిక - యున్న యెడల:
చింద వచ్చు - తరచు - సౌందర్య దీధితుల్;
 సామ్య శిల్ప బద్ధ సౌష్ఠవమ్ము.

కవి

బ్రదికి యున్న సుకవి - నామకుండే గదా,
 దంభ జృంభ రహిత డింభకుండు;
పిదప పిదప - వెలుగు విస్తీర్ణతలు పెంచు;
 విశ్వతోముఖ త్రివిక్రముండు.

శబ్ద బ్రహ్మోపాసన

అరయ - శబ్ద మన్న - మరుగుజ్జు మాత్రమై,
 గోచరించు చుండు - కోశములను,
శబ్దార్థవాద విశ్వ రూపము తోచు,
 కావ్య సాహితీ జగత్తు లోన.

పొడిమాటలు

నుడులు – ''అమ్మ దొంగ'' పొడిమాటలే గదా,
ప్రజలు లోకమందు వాడు నపుడు,
కార్య జగతి లోన కలియ భూకంపముల్,
గాలి వాన లన్నొ – కలుగ జేయు.

రచన

రచన లోన – కాన రాని దారము వోలె,
పదము పదము కూర్చు ఫణితి యుండు !
అది రచయిత సొంత ఆత్మీయతా ముద్ర;
సంతకమ్ము సాటి – శైలి గూడ.

ఆహార్యం

పాచి మనిషి యైన – పట్టు చీరను కట్ట
కానుపించు – అందకత్తె వోలె,
అరయ ధనిక కాంత – ఆహార్య మొనగూడ,
వేష భాష విజ్ఞ వీగ వచ్చు.

ప్రచార యుగం

ఇది ప్రచార యుగము – ఇక పత్రికల కేమి ?
నవ్య దూర దర్శనమ్ము – వచ్చె !
కనుల యెదుట – ప్రజకు కన్పించినను గాని
గుర్తు పట్ట లేరు – గొప్ప దనము.

భావి

చరిత ఆ విషయము మరచెగా ఏనాడొ!
దాని నిపుడు మరల తడవ నేల ?
భావి యుగము లందు జీవించు రచనలే;
చర్చ చేయఁ దగును సభల లోన.

### జన సంఖ్య

జగతి లోన – నాడు – జన సంఖ్య తక్కువే;
కూడు గుడ్డ వసతి కొరత లేదు;
గోచరించు నేడు కొరతలే ! కొరతలే !
బ్రదుకు తోచు ఘోర రణము వోలె.

### తొందర

నింగి పగిలి యెపుడు నేలపై పడబోదు;
బ్రదుకు లోన తొందర పడ రాదు;
నీరు త్రాగ వచ్చు నిలిచి నింపాదిగా;
పాలు త్రాగ వద్దు పరుగు లెత్తి;

### గురువు

ఆతడు గురు వరుడు – వ్యక్తి మాత్రుడు గాడు;
కన్ను దోయి ముందు కాన రాడు;
గుండె లోన ఉండి గోచరించును సదా;
వెలుగు బాట లోన వెడల నేర్పు.

### రుచులు

నే తినగల – లేదు నేర్పు పాక కళల;
పిండి వంట లందు – ప్రీతి కలదు;
ఎంచి చూప గలను – ఎన్ని లోపము లైన;
పచన రీతు లమరు – రుచుల యందు.

### భావయిత్రి

భావయిత్రి – మానవైక నిష్ణాతమ్ము,
కారయిత్రి తెలుగు పారమితము;
అయ్యొ – ''తాళపు చెవి'' – ఆంగ్ల భాషాధీతి;
సకల సుమ పరాగ సంగ్రహ మిది.

సంధి

స్వ కుచ మర్దనమ్ము - స్వ పరాగ పర్యాప్తి,
    వెగటు గొలుపు - గొప్ప ప్రగతి కాదు;
భిన్న సంస్కృతులు విభేదముల్ విడనాడి,
    సంధి సలుప - ప్రగతి సంభవిల్లు.

త్యాగం

''మంచి పనులు'' నిర్వచించ కష్టము గదా!
    ఆచరణము సులువె అందరకును;
ప్రజకు మేలు జరుగు పని మంచిదే - సదా,
    త్యాగ మాత్మ - సత్క్రియలకు - సతము.

దేవుడు

దేవు డనెడి శక్తి - తెలియ జాలని దైన,
    ఉన్న నేమి ? లేకయున్న నేమి??
మంచి చెడుగు లేవి మహి మీద లేవన్న,
    మానవులకు పెను ప్రమాద మగును.

గీత పద్యం

ఆట వెలది కైన - తేట గీతికి నైన,
    ప్రాస నియతి లేదు - రచన సులువు
అతిశయించు 'ప్రాస యతి' వేయ అందమ్ము !
    బిందు పూర్వకమ్ము - చిందు శోభ.

ఆస్తి

ఆస్తి హక్కు చెరచు యావత్ ప్రపంచమ్ము !
    సమత రూపు మాపి సంఘమందు;
ఆస్తి యున్న వాడు - యజమానియై పోవు,
    బానిస యగు పేద - బ్రదుకు నందు.

ప్రతిభ

అరయ అతని ప్రతిభ - స్థిర తటిల్లత వోలె,
వెల్లి విరియఁ జేయు - వెలుగు వాక;
సుప్రయోగ సరలి - భూప్రదక్షిణ యందు
సేతు వగును క్రొత్త పాత కలిపి.

ప్రగతి యోగి

బ్రదుకు కంటె గొప్ప బడి యేది? గుడి యేది?
వివిధ విషయ వేద్య విస్తృతమ్ము;
విప్పి మెదడు కనులు వీక్షించినను చాలు;
ప్రగతి యోగి యగును సగటు మనిషి.

వ్యంగ్యం

అరయ - ఇంద్ర ధనువు - అనుభూతి మాత్రమే;
చేతి కందు వస్తు శేషి - కాదు !
అల్లె - కవిత లోని వ్యంగ్య విస్తీర్ణమ్ము;
అంతరంగ గగన మావరించు.

ఆస్తికత

అనుభవైక వేద్య మాస్తికత్వ మటన్న;
ఋజువు నాస్తికతకు ఏది లేదు,
హేతు వాదమున కతీతమ్ములే రెండు;
ఇది విషమ సమస్య - వదల దగును.

కీర్తి కన్య

రమ్మ - మందయాన - రంజింపఁ జేయవే;
నీ మిటారి హొయల నిగ్గు లొలికి,
కేల కనులు మూసి - కీర్తి కన్యా మణీ,
పేర్మి కూర్మి ముద్దు పెట్టు కొనుము.

పద్యగానం

అర్థమున కతీతమౌ – రసానుభవమ్ము;
కలదు – తెలుగు పద్య గాన మందు,
ఉండ వలెను రాగ ముచ్చారణ స్ఫూర్తి
గంగ యమున లట్లు సంగమించి.

పద్య కవిత

పద్య కవిత లోన – హృద్య సత్యము చేరి,
నాట్య మాడు సతము నాల్క మీద,
మరువ కుండ నిలుచు మరణ శయ్యను గూడ,
జయము పద్య కళకు జయము శుభము.

దానం

కరగి పోవు నట్టి – కరుణార్ద్ర హృది తోడ,
దాన మిచ్చు వారు ధరణి కలరు;
వ్యయము వేరు – వేరు పాత్ర దానము వేరు,
పాత్ర దాన మైన – పరమ శుభము.

గ్రుడ్డి

బ్రదుకు లోన సమము పవలు రాత్రియు గూడ,
మానవుండు గ్రుడ్డి – యైన యెడల,
సమము నీరవమ్ము సంగీత సభ యైన,
బ్రదుకు లోన చెవిటి వాడె యైన.

సత్యం

సాహసమ్ము కలదు – సత్యసంధత యందు,
మనిషి మెప్పు పొందు మహిమ కలదు;
బ్రదుకు నందు – ఏటి కెదురీదు సత్యమ్ము;
కట్ట కడకు జయము గాంచ గలదు.

### అహం

అహము గొప్ప వారి నైన చేయును దగా,
తనకు అంద మున్న దనుచు తలచు,
బహుమతి తతి తనకు బ్రదుకులో రావాలి;
అహమును బల పరచు - ఆశ - తరచు.

### జాలి గుండె

సాటి వారి పైన - క్షమ చూపు మనుజుండు,
భగవదమృత దయకు పాత్రు డగును,
జాలి గుండె కంటె - సత్యమ్ము శివ మేది ?
ఏది సుందరమ్ము ? సృష్టి యందు.

### మోసం

ఎట్టు లెదురు కొనుట - ఎవ్వ రైనను గాని,
వచ్చి మోసమును ప్రపంచ మందు?
మోసము పసికట్టి - మోసమ్ము తోడనే,
ఎదురు దెబ్బ తీయు టేమి తప్పు?

### అనుభూతి

ఆగి హేతువాద మనుభూతి మొదలౌను,
మనుజు మనసు రస సమాధి చేరు;
పుడమి కవలి వెలుగు ఎడదలోపల నిండు;
ఆగిపోవు కాల మమృత మస్తు.

### ఛందస్సు

కవిత కగును క్రమ నవరత్న మకుటమ్ము;
కలవరమ్ము చక్షువులకు గూర్చు,
జతులు గతులు తీర్చి - ఛందస్సు రచనలో
చింద చేయు నాద బిందు కళలు.

కావ్య కవిత

ఎంత సుందరమ్మొ - ఎత్తి పోతల వద్ద,
జలము క్రింది కొలుకు చంద్రవంక !
ఆంధ్ర భాష యందు అవధాన మట్టిదే !
గట్టి లౌరయు కృష్ణ - కావ్య కవిత.

చిత్ర కవిత

పరవసింప జేయు - బాణ సంచుల భాతి;
చిన్నె వన్నె లొలికి - చిత్ర కవిత;
దిగ్ దిగంత కాంతి దీప్తి రింఛోళితో,
క్రాలు శారదా ప్రహేళి వోలె.

మౌనం

మౌన విద్య - భవ్య మధుర సంవాదమే;
మాట లేల ? గాలి మూట లేల ?
అరయ వాక్కు పరిమితార్థ సంకేతమే,
మౌనమున కలిత మహిమ కలదు.

నటులు

పద్య కవనమునకు పౌరాణిక నటకుల్.
కూర్చ గలిగినారు క్రొత్త శోభ;
దేశ భాష లందు తెలుగు లెస్సను సూక్తి
సత్య మంచు బుజువు సలిపినారు.

కవిత

కవిత వేరు - వేరు వ్యవహార పరిభాష;
కవిత మెదడు కొరకు కాదు - హృదికె;
పద పదమ్మొ - కవిత - పొదుగు రెక్కలు రెండు;
చదల కెగురు నట్టి శక్తి కూర్చు.

కవిత

కవిత - మొట్ట మొదట కంఠస్థ మొనరించి,
సారమును గ్రహింప చాలు చాలు;
తరచి - ప్రతిపదార్థ తాత్పర్యముల నెల్ల
పిదప నరయ వచ్చు చదివి చదివి.

కవి

అవసరమ్ము కవికి అదర్శ శీలమ్ము
జీవితమ్ము నందు చేష్ట లందు;
ప్రతిఫలింప సుకవి బ్రదుకులో కవనమ్ము
రచన సార్థకమయి రక్తి కట్టు.

కవిత

వరలు - సర్వ సృష్టి పరిణామ పరివస్య
మాటలాడు శక్తి మానవులకె !
తెలుపు కవిత - మాట తీరు తీయములలో
వెల్లి విరియు వెలుగు వేల్పు లేరు.

కవిత

పరుల కష్టములను బాపు సామర్థ్యమ్ము
ఈ ప్రపంచమందు ఎవరికుండు ??
గట్టి గుండె తోడ - ఎట్టి కష్టములైన
ఓర్చుకొనెడి బోధ - కూర్చు కవిత.

కవిత

మనుజా బెదర గొట్టు - ఇనుప గుగ్గిళ్లుగా
మతము - నీతి బోధ - బ్రతుకు నందు !!
జీవితమ్ము లోన - జీర్ణ మయ్యెడు రీతి,
తత్త్వబోధ తరము గూర్చే - కవిత.

యౌవనం

అప్సరసల ప్రేమ లందుకో గల వారు
    అరుగ గలరు దివికి యౌవనమున,
వసుధ - నరక సమము - ముసలి వారికి చూడ,
    నందన వని యౌవనమ్ము భువిని.

అప్రియం

అప్రియమ్ము పలుకు టంత మంచిది గాదు;
    సత్య మైన గాని చాట రాదు;
మంచితనము గాదు - మర్యాదయును గాదు;
    బాధ పెట్ట నేల? పరుల హృదులు.

దిక్కు తోచక

బ్రదుకు లోన ఎపుడొ పాదలేపము పోయి
    ప్రవరు వోలె నిలువ వచ్చు నరుడు;
తేరి పార చూచు దిక్కు తోచక నిల్చు
    కాళ్ళు కనులు గలిగి కదల లేక.

వాయులీనం

వాయులీన జంత్ర వాద్య రావము తోడ,
    వీణ - వేణు రవము - వెల్లి విరియ;
సరిగమలకు ప్రగతి చరణ చారణ గూర్చు;
    రాగ తాళ లయలు రక్తి కట్టు.

నొసలు

దాచు కొనక హృదిని - ధారాళముగ - బోళ;
    మంచి తనము గల్గి - మాటలాడు;
నోరు విప్పకుండ - నొసటితో ఉబ్బించు
    నాలిముచ్చు నంగనాచి తరచు.

### తొలి తలపులు

మెదడు తొలి తలపులు మేటివే ! మంచివే !!
ఎంచ–విలువ దతని మంచి మనసు;
తరచు – ఆచరణము కురుచయై కన్పించు
కార్య శూరు డతడు కాడు కాడు.

### నిదుర మైకం

మంచి వారు – నిదుర మైకమ్ములో నుండ,
దొంగ లిల్లు దూరి – దోచ వచ్చు;
నిత్య రక్ష లేక – నిరత జాగృతి లేక,
వీగ వచ్చు బ్రదుకు విలువ లెల్ల.

### జంట

అవని ఒక్క జంట – అనుకూల దంపతుల్,
తుల్య తృప్తి తోడ తోచు నెడల;
చెప్ప వచ్చు వారు శివ పార్వతీ సముల్;
ఎల్ల ప్రజ నమస్కరింప వచ్చు.

### నవ్వు

ఆమె కనులు చాలు – ఆమోదమును తెల్ప
చెప్ప నేల ? పెదవి విప్పి – ఆమె;
వలపు లొలుక గలదు వనజాక్షి హొయలుతో;
నవ్వు మోము మీద నాట్య మాడ.

### అర్థ నిధులు

తరచి – ఊహ లెల్ల – ధన సహాయము చేయ,
అభ్యుదయము కూర్చు అర్థ నిధులు,
ప్రోత్సహించు గాత – యువజనోత్సాహమ్ము,
దోహదమ్ము గూర్చి దొరతనమ్ము.

### వ్యక్తి నిష్ఠ

వ్యక్తి నిష్ఠ మెపుడు - న్యాయమ్ము నవినీతి;
దేశ జనుల నెల్ల - తిట్ట రాదు;
క్రూరు లుండ వచ్చు - కులము లన్నిటి యందు,
గొప్ప దనము లొకరి గుత్త కావు.

### స్వాగతం

పిచ్చి ప్రేమ తోడ - వచ్చు వా రున్నారు !
అమృత మయులు నా గృహమ్ము కడకు,
వచ్చి - కొంత ధనము నిచ్చు వారున్నారు ?
వెడల గలరు వార లొడలు మరచి.

### దీపావళి

భువికి తోచు ప్రతిభ - ధ్రువతార చిరు కాంతి
మిడిసి పాటు లేక - మిణుకు మనును;
దిక్కు లన్ని నింపి - దీపావళీ దీప్తి
పిక్క టిల్ల జేయు ఒక్క నాడు.

### ధన స్వామ్యం

ధరణి - పేదవాడు - ధనికు ధాటీ ముందు,
ఎంత ప్రతిభ యున్న ఎట్లు నిలుచు ?
ఎచట సమత యున్న దిది ధన స్వామ్యమ్ము;
అంతరింప వలయు ఆస్తి హక్కు.

### రెండవ సారి

మొట్ట మొదటి సారి - ఎట్టి కార్యము నైన,
చేత నైన రీతి చేయ వచ్చు;
చేసిన పని తిరిగి చేయ వచ్చుట యున్న;
విసుగు కలుగు చెడ్డ వెగటు పుట్టు.

నేత

అడవి లోన ఉన్న - ఆచార్యు కడ కేగి
పూర్వ మందు ప్రభువు పూజ చేసె;
విజ్ఞు లైన వారి - వివిధ సంఘాలలో
ప్రజల నేత - వేయ వచ్చు - నేడు.

మంచి తనం

కట్ట వలెను పూని పట్టాభిషేకమ్ము
హేతు వాదమునకు - హృదయ మందు;
మంచి తనము మించు మత మేది పుడమిపై ?
దైవ భక్తి విడువ దగును - నరుడు.

పెండ్లి

పలు వ్యవస్థ లున్న బ్రదుకులో - పెండ్లిపై
పోయె నమ్మకమ్ము పోయె నాకు;
చెడు వ్యవస్థ లందు - కడు మిన్న పెండ్లియే !
నల్పు మేలు పెండ్లి సాంఘికముగ.

కవి

దివిని వీడి భువికి దిగిరాడు - కవి గారు;
వెలుగు తళుకు బెళుకు విడువ డెపుడు
వారువముగ తాను మారునా సింహమ్ము ?
నలువు గర్జ దెసలు పులకరింప.

శిష్యుడు

ఉపనిషత్తు వంటి - ఉపదేశ మందించు
గురుని కంటె ఎవడు గొప్పవాడు ?
బ్రదుకునే ఉదాహరణ చేసి చూపించి
జీవితమ్ము గడుపు శిష్యవరుడు.

వృద్ధకం

తిండి ఔషధాలు రెండు చేయవు మేలు,
 శ్రేయ మెట్లు కలుగు వృద్ధ కవికి ?
చేయ సత్కృతులను ఆయురారోగ్యముల్;
 గొప్ప కవిత సుకవి కూర్చ వచ్చు.

కవి

ముట్లుడిగిన పెద్ద ముత్తైదువును బోలి
 ఉండ వచ్చు కవి వరుండు బ్రదికి,
యువ కవీశ్వరులకు ఉత్సాహ మొసగూడు;
 వృద్ధ కవిని సత్కరించి నపుడు.

కళలు

ఇంక - తెలియ దగిన లింకు లున్నవి పెక్కు;
 వివిధ కళల యందు విశ్వ మందు,
తరచి - సూక్ష్మ దృష్టి పరిశోధనలు చేసి,
 ఖండ సత్యములను కలుప దగును.

కవిత

సరస కవిత సతము స్మరణీయమే కదా !
 కవి వరేణ్యు పేరు గౌణ మరయ;
అమృత కవన భావ మజరామరముగదా;
 పేరు నందు లేదు పెద్దరికము.

ధర్మం

నాస్తికుండు మరియు ఆస్తికుండును గూడ
 సమ్మతించు ధర్మ సామ్య మేది ?
బహు జన హితము మరి బహుజన శ్రేయస్సు;
 త్యాగ గర్భిత మగు దాన నిరతి.

విజయ గర్వం

కాదు - మేలు - విజయ గర్వమ్ము సర్వదా;
నెలవు పతన బీజములకు - సతము;
రంగు గ్రుడ్డి తనము రారాదు బ్రదుకులో !
ఆత్మ శోధనమ్ము - అవసరమ్ము.

బహుమతి

బ్రదుకులో బహుమతి రాకున్న ఈ యేడు,
సుంత చింత వలదు - వంత వలదు;
సాగి పోవు - కాల చక్రమ్ము భావిలో,
స్వస్తి - అభ్యుదయ జయోస్తు - మీకు.

కవి

బ్రదికి యున్న కవిని - ప్రతిభా గరుత్మంతు
కాంచ లేవు తోలు కనులు రెండు,
సాహితీ తపస్వి - సహృదయ ప్రవరుండు,
దివ్య దృష్టి యున్న తెలియ వచ్చు.

ప్రయోజకుడు

ఉండు ధనము, తెలివి యుండు వేరొక చోట;
వెదక వలయు వేరు విషయములను;
విజయ మున్న బహుళ విషయ విన్యస్తమే;
ఉండ వలయు ఒక ప్రయోజకుండు.

శిష్యుడు

గురువు తోక చివర గోమారు కాలేదు,
శిష్య సత్తముండు చిన్మయుండు;
చిన్న ప్రమిద గురువు - శిష్యుండు కాగదా !
గురువు ప్రతిభ శిష్య వరుడు దాటు.

స్వగతం

తోడు నాకు కవిత - తోచకుండుట లేదు
తలను ఈదు చుండు తలపు లెల్ల;
నాకు కూర్పు కవిత - ఏకాంత వాసమ్ము;
సంచరింప వచ్చు సంత లోన.

గొప్ప దనం

గొప్పదనము లెల్ల - కుహనా వికల్పముల్
అచ్చ మైన ఘనత లరుదు సుమ్ము;
బ్రదుకు లోన తోచు - పై పటాటోపముల్;
చెల్లు బాటు లగును - సంఘ మందు.

కవిత

కలవు - మనిషి మెదడు తెలియ జాలని అరల్,
విశ్వ శిల్ప మందు వింత లెన్నొ;
మిన్న అవయవాల మెదడు దేహము నందు
కవిత అవసరమ్ము కడుగ - మెదడు.

పనులు

కడగి - పెక్కు పనులు - కర్తవ్యముల పేర,
నిర్వహించు మనిషి - నేర్పు మీర !
ఎల్ల పనులు హృదయ తృప్తి పర్యాయముల్;
మనుజ చర్య యెల్ల మానసికము.

అంతరాత్మ

గుండె లోన వెలయు గుడి గోపురము నుండి
రవళి చేయు పావురమ్ము వోలె,
అంద జేయు అంతరాత్మ సందేశముల్,
కల రవమ్ము కవియు కలవరమ్ము.

ధర్మ సూక్ష్మం

మారుచున్న జగతి మనుజుండు నివసించు;
 ధర్మ గతియు మారు ధరణి తరచు;
ధర్మ సూక్ష్మ మరయ దగు వేత్త – సర్వదా,
 త్యాగ యోగ మాత్మ – ధర్మమునకు.

బహుమానములు

ప్రతిభ పొందు నట్టి బహుమాన సత్కృతుల్,
 తర తరాల మేర కరుగు గాత,
బహుమతి తతు లన్న – వ్యక్తి నిష్ఠము గావు,
 అవి సరస్వతీ ధ్వజాంచలములు.

అంకెలు

అక్షరాల కన్న – వ్యంజనార్థము కన్న,
 చిన్మయములు గణిత చిహ్నితములు !
అంకె లెల్ల గూఢ సంకేత కల్పనల్
 సరస విపుల భాష్య సమ్మితములు.

కవిత

కవిత అనిన ఏమి ? కామధేనువు వెన్న;
 విశ్వ జాగృతి కొక వేగు చుక్క;
మానసమ్ము లోని – మందార మధు ధార
 గర్భగుడిని మ్రోగు గంట రవళి.

క్రమ శిక్షణం

దుష్ట శిక్షణమ్ము – శిష్ట రక్షణ తీర్పు,
 గొప్ప పాలకు డని చెప్ప వచ్చు;
కఠిన చర్య గోరు – క్రమ శిక్షణ సదా;
 జడ్జి – పాలకుండు – సాక్షి కాడు.

రేపు

కనుల ముందు నేడు కనుపించునవి యెల్ల,
బుడగ లట్లు పగిలి పోవు వేగ,
రేపు రూపు వేరు చూపు కందదు నేడు;
విల్లు వీగు గాత వెల్లి వారు.

ఉమశ్రీ

మునుపు - తెనుగు దేశమున ఉమశ్రీ పేర
సభల సింహాసముడు సంచరించె,
గురు వటంచు నన్ను దరిచేరి భక్తితో
కుక్క పిల్ల పోలె కూర్మి చూపె.

కవిత

ప్రాకు బిడ్డ నేడు - పరుగెత్తు తర్వాత;
ప్రజ్ఞ తక్షణమ్ము రాదు రాదు;
కవిత చదువ చదువ కంఠస్థమై నిల్చు,
కొలత లేని ప్రజ్ఞ కలిసి వచ్చు.

స్వగతం

నెమరు వేసి కొనుచు నే వ్రాయు చున్నాను;
ఎనుబదేండ్ల మేర అనుభవాలు,
నవ సనాతనతకు నాట్య రంగము గాని,
కేవల మిది ఒక్క కృతియు కాదు.

కార్య దర్శి

నందన వని లోని - మందార మధు ధార,
గ్రహ తతుల్ మరుత్ తరంగ పంక్తి
దిగ్ దిగంత కాంతి దీప్తికా రింఛోళి,
కలుపు నొక్క చోట - కార్య దర్శి.

కవి

క్రాంత దర్శి - ఋషి - త్రికాలజ్ఞు డెవ్వడో,
గుర్తు పట్టు సుకవి గొప్ప దనము;
బ్రదికి యున్న వేళ - పడయ నేరడు కీర్తి;
అవని లోన తరము - కవి వరుండు.

కవి

మేటి బుద్ధి శాలి - మేధావి ! వేదాంతి !
సుకవి కాడు సూక్తి సూత్ర ధారి,
గాలి మూట కట్టు - కవి వరేణ్యుడు కాడు;
దార్శనికుడు - సుకవి - తత్త్వ వేత్త.

ఓర్పు

సలిపి - తొంబదైదు శాతమ్ము పను లెల్ల
వదల రాదు తుట్ట తుదకు - ఓర్పు;
బ్రదుకు లోన చూడ తుది మెట్టు - సహనమే !
ఓర్పె - ఆత్మ విజయ యోగమునకు.

కవిత

కాన రావు గాని - కవన శిల్పము నందు,
కలదు సరిగమపద గానసరలి.
ఛందమునకు కలదు సంగీతమును మించి,
సామ వేద గాన శక్తి యుక్తి.

బొంకు

కడగి - సస్య రక్షకై వేయ దగు కంచె,
ముండ్ల పొదల చుట్టు ముట్టు పెట్టి
ధరణి లోన సత్య ధర్మ రక్షణకుకై
బొంకు పలుక వచ్చు శంక వీడి.

ఓడి నపుడు

జయము గాంచి నపుడు జాగ్రత్త ! జాగ్రత్త !
కదుప రాదు పెదవి మెదప రాదు;
మేలు – ఓడి నపుడు – మిత భాషణము మేలు;
అహము నిగ్రహించు టవసరమ్ము.

గృహిణి

గడప వదలి – అతడు వెడలు నపుడు నుండి,
అతని ఇల్లు కాచు నట్టి దెవరు ?
ఇంటి నంటి యుండు గృహిణీ మతల్లియే !
అడుగు వేయు భర్త ఆమె వలన.

సన్మానాలు

ఆకసమున కెగురు అవ్వాయి చువ్వయై,
కవి వరేణ్యు ఊహ లవని విడిచి,
సహృదయులు జరిపెడి సన్మాన సమయాల
వెలుగు తళుకు బెళుకు వెల్లి విరిసి.

సానుభూతి

విశ్వ మందు – నాడు – వికట చర్యలు గాంచ,
ఆగ్రహమ్ము నన్ను ఆవరించె,
నవ్వు గొలుపు నేడు నాకు అచర్యలే !
అప్పు డపుడు కలుగు సానుభూతి.

గురువు

"స్వేచ్ఛ తోడ మనుడు – వినవద్దు నా మాట"
చేర్చి శిష్య తతుల చెప్పె గురువు;
ఇంక శిష్యు లెల్ల ఏమి చేసిన గాని;
వారు గురువు నాజ్ఞ మీర నట్లె.

### స్త్రీలు

స్త్రీలు చేయ వచ్చు రెట్టింపు ప్రతిభతో
పురుషులకు సరి యని పొగడ బడదు;
పుడమి సాగు సతము పురుషాధిపత్యమ్ము;
చెల్ల దెప్పు డైన స్త్రీల ఘనత.

### కార్యదర్శి

మూల నుండ వచ్చు - ముడి పదార్థము లెల్ల,
మూల్గు చుండ వచ్చు - మూల ధనము,
విడి విభాగములను ముడి వేసి తెలివితో;
కలుపు వొక్క చోట - కార్య దర్శి.

### బ్రదుకు

అరయ బ్రదు కనేక యాదృచ్ఛిక విశేషి,
హేతువాదమున కతీత మది;
వెదకి మానవుండు వేదాంత సూత్రాలు;
బ్రదుకు కన్వయించు తుదకు తుదకు.

### అతిథి

అతిథి రాక కొరకు - ఆహార్యమును తాల్చి,
ఇంట నుంటి - గంగి రెద్దు వోల,
ఆలసించి అతిథి ఏలకో రాలేదు !
కవిత వ్రాయ తీరిక లభియించె.

### వాణి వీణ

లలిత బృంద వాద్య లాస్య లావణ్యముల్
సామరస్య సరణి చాటు గాత !
ప్రణవ సామ వేద మణిత ఋగ్క్వణనముల్,
వెడలు గాత వాణి వీణ నుండి.

పదవి

పెద్ద పదవి లోన - విగ్రహ ప్రాయుండు
గొప్ప తీరిక సమకూర్చు కొంతమంత;
అనుభవజ్ఞు డొకడు - న్యాయాధినేతగా;
యోజనా తపస్వి యుండు గాత.

సత్యం

సత్య నిర్వచనము జగతిలో సాధ్యమా ?
పలికె ధర్మరాజు పచ్చి బొంకు;
అరయ పట్టి గాధ - ఆ హరిశ్చంద్రుండు,
అవని నిజము వేరు కవిత వేరు.

సత్యం

నిత్య సత్య మేది నేల పైనను లేదు;
పెక్కు కొలత లుండు - పృథివి లోన,
మిన్న బొంకు నిజము కన్న - కొండొక వేళ,
వేత్త - సూక్ష్మదర్శి - వింగడించు.

శిష్యుడు

పైకి చెప్ప నేల ? ప్రతిభా గరిష్ఠుడౌ,
శిష్య పుత్ర నిర్విశేషు గూర్చి,
అనుభవింప వచ్చు ఆనంద సంక్రాంతి,
బ్రదుకు లోన అంతరంగ మందు.

శిష్యుడు

గొప్ప శిష్యు డొకడు - కుదురు కొన్నను చాలు;
వంద స్నేహితులకు వాడు సమము,
బ్రదుకు పోరు లోన రక్షక కవచమ్ము
చేత దాగు కత్తి - శిష్య వరుడె.

సన్మానం

సంతసించి - స్వీయ సన్మాన సమయాన
పొగడ వచ్చు నెవరి తెగడ రాదు,
అభ్యుదయము కోరి ఆశీస్సు లందించి,
సహృదయులకు సతము చాలు చాలు.

ఇహం

ఇది - మనము వసించు ఇహలోక భువనమ్ము
తావు లేదు నీతి ధర్మములకు;
ధనము పదవి చాలు ధర్మమే న్యాయమే !
గళము విప్ప మొట్టి కాయ తగులు.

జయం

జయము కలిగె నేని జాగ్రత్త ! జాగ్రత్త !
ఎన్న అపజయమ్ము తెన్ను వేరు,
అపజయమ్ము దీక్ష - అభివృద్ధి చెందించు;
కూర్చు జయము వింత గ్రుడ్డి తనము.

కవి

గొప్ప సుకవి యెవడు - చెప్ప జాలము నేడు,
నేతి పొగలు సెగలు నిజము గప్పు;
కడగి తేల్చ గలదు - కాలమే సత్యమ్ము;
నిలుకడ వలన గద నిజము తేలు.

కవిత

అది - సుషుప్తి కాదు - అది జాగృతియు కాదు;
కల రసమ్ము కలియు కలవరము
ధరణి కవల విరియు తథ్య మిథ్యల సంధ్య
కవిత - వాణి మణిత రవ మసృణము.

మానసం

మంచి మానసమును మించు నట్టిది లేదు,
త్రికరణ పరిశుద్ధి ఒకటి చాలు;
జీవితమ్ము నందు యావత్ జగత్తులో,
శీల శుద్ధి మేలు - చాలు చాలు.

మాత

మాత ఉన్న దంచు - మనుజ లోకము నందు,
మార్క్సు శంకరుండు మరచినారు;
అమ్మ హృదియె వేరు అర్థశాస్త్రము లేదు !
జనని మిథ్య కాదు జగతియందు.

కవ్వపి

మ్రోయు గాత - వాణి వేయి తంత్రుల వీణ,
తెలుగు పలుకు బడికి కలిపి శ్రుతులు
మతము విడిచి - క్రోధ మాత్సర్యములు వీడి,
ఒక కుటుంబ మగుత ఉర్వి జనులు.

శోభనం

శోభన మన - స్వర్గ వైభవాభ్యుదయముల్,
వచ్చి పైబడునని - వధువు - తలచె,
అస్తమించె చంద్రు డారేయి మెలమెల్ల,
దెసల కొసలు నవ్వ - తెల్ల వారె.

రంగులు

శ్వేత వర్ణ మన్న - విజ్ఞాన విభవమ్ము
నలుపు - దుఃఖ భావనా ప్రతీక,
కావి రంగు త్యాగ జీవిత ప్రణవమ్ము,
పచ్చ దనము కవులు మెచ్చు రంగు,

ఎఱుపు విప్లవాల హింసా రుధిర పీప్స,
వసువు - శుభ వినోద భాసురమ్ము,
అభ్రనీలవర్ణ మాధ్యాత్మ యోగమ్ము,
రంగు లర్థ వాద భంగిమములు.

శ్రీరామ చంద్రుడు

శుద్ధ బుద్ధి తోడ సుగ్రీవు స్నేహమ్ము
చేసె సత్వరమ్ము జీవితమున,
స్నేహ ధర్మము కయి శ్రీ రామచంద్రుండు,
చంపె వాలి చెట్లు చాటు నుండి.

యోగి

జగతి లోన ఎవడు ? సర్వసంగత్యాగి ?
అతడె ఒక మహర్షి అతడె యోగి,
అదుపు జేయు నెవ్వ డరిషడ్ గుణము లెల్ల ?
ఉత్తమోత్తముండు ఉర్వి లోన.

అంతరాత్మ

జగతి లోన ఎవరి సలహాలు వినరాదు,
అరయ దగును అంతరాత్మ బోధ !
అంతరాత్మ కంటె - అధికుడౌ గురు వేడి ?
ధరణి ధర్మ సూక్ష్మ దర్శి యెవడు ?

కారణం

విజయ హేతు వగును - స్వీయ ప్రతిభ గాక,
శాత్రవావివేక చర్య తరచు,
కానరాక యుండు - కారణమ్ములు పెక్కు;
చేర వచ్చు విజయ దర్శి లోన.

### ముసలి తనం

ఎన్ని వ్యాధు లైన - వృద్ధాప్యమున మూగు;
      తప్పు కొనుట కెవరి తరము గాదు;
చేర ముసలి తనము దారిద్ర్య మొకచోట
      ధరణి బ్రదుకు ఇంక నరక సమము.

### కవిత

దీపము వెలిగించు - దీపమ్ము జగతిలో
      అట్లె మానసాల అమృత కవిత,
గొంతు గొంతు నుండి - అంతమ్ము లేకుండ,
      కవిత వెలుగు - తారక వలె చిరము.

### కాలం

పారు క్రొత్త నీరు మారి కాలము సదా,
      కాలమునకు మార్పు గరిమ నాభి;
బ్రదుకు లోన కాల పర్యాయ వేత్తయే,
      పరమ యోగి వరుడు ప్రత్యగాత్మ.

### అభిసారిక

వలచి వచ్చె నేని - తెలు పేమి నలు పేమి ?
      చూపె నేని తెలివి చురుకు పాలు;
అనుభవింప దగును ఆలసింపక వేగ
      నభము ముసి ముసి చిరు నవ్వు లొలుక.

### ధన్య జీవితం

జగతి లోన నీతి - శక్తి సామర్థ్యముల్;
      ఒక్క చోట కలిసి యుండె నేని,
అంత కంటె ఏది ? ఆనంద యోగమ్ము ?
      ధన్య జీవితమ్ము - ధరణి మీద ?

నిగ్రహం

మానసికము గాని మనుజ చర్యలు లేవు,
హృదయ మాగకుండ ఎవడు చచ్చు ?
చిత్త నిగ్రహమ్మె శ్రేష్ఠ యోగము సుమ్ము;
మనసు నిగ్రహించు కొనుత - మనిషి.

దానం

దానమును గ్రహింప దగు అప్పుగ గ్రహీత,
దాత కోరు కొనడు ధనము - తిరిగి;
అర్హు డైన వాని - అన్వేషణము సల్పి;
అప్పు తీర్ప వలెను ఎప్పుడైన.

సగటు మనిషి

సగటు మనిషి జగతి - సంఖ్యాగణన మిన్న,
ధరణి కెల్ల కేంద్ర గరిమ నాభి;
పరమ ధర్మ మేది ? బహుజన శ్రేయస్సు!
మానవ ప్రకృతిని మరువ రాదు.

నిగ్రహం

నిగ్రహమ్మె రాజ నీతి జీవితములో;
సాధు వర్తనమ్మె సంయమమ్మె;
దండ భీతి చేత తప్పు చేయనివాడు;
కపట వేషధారి - కలుష హృదుడు.

కష్టాలు

అభ్యుదయము కలుగు వ్యాయామ కృషి వల్ల;
మేలు చేయు అవయవాల కెల్ల;
కష్టములన మంచి కసరత్తు బ్రదుకులో !
పిల్లల సుఖ వాంఛ పెంచ రాదు.

మౌనం

సరిగమపదనిసలు – సంగీత లయ శోభ,
జ్ఞాన నిరతి కలదు మౌన మందు,
మధుర మధుర మైన – మౌన చైతన్యమ్ము,
మెదడు పొరల అరల మేలుకొల్పు.

ధర్మం

జగతి – ధర్మ మన్న – జడ పదార్థము గాదు,
సమ్య గర్థవాద సంగ్రహమ్ము;
తత్క్షణమయ జాగృతత్వ చైతన్యమ్ము !
స్థితి గతి పరిశేష చిన్నిషద్య.

ధర్మం

స్థూల దృష్టి వేరు – సూక్ష్మ తత్త్వము వేరు;
జగతి ధర్మ నిర్వచనము వేరు;
అరయ ధర్మ చర్చ ఆభాస మాత్రమే !
వెదక దగును ధర్మవేత్త కొరకు.

అంతరంగం

మంచి తనము కొంత మనిషి లోపల నున్న,
కనుల ప్రతిఫలించి కానుపించు,
చూడ – ముఖము – విషయ సూచి మానసముకే
అంతరంగ శుద్ధి అవసరమ్ము.

భక్తి

భక్తి – నవ రసాల పరిధి లోనిది కాదు !
లేదు – స్థాయి భావ మేది లేదు;
సాహితీ చరిత్ర – సంచారి భావమే !
పొందలేదు భక్తి పూర్ణ సిద్ధి.

### పిన్న నవ్వు

పిన్న నవ్వు మేలు - పీతాంబరము కన్న,
    అంద మివ్వ నేర దాభరణము !
మంచి హృదివి తెలుపు మధుర హాసము చాలు
    చాలు కనుల మిణుకు మేలు - మేలు

### సూత్రం

శుష్క సూత్ర రచన - బుద్ధి మాంద్యము గూర్చు;
    పాండితీ ప్రకర్ష - బ్రదుకు కాదు,
కలియ ఒకటి ఒకటి - గణిత మందున ''రెండు'';
    కాదు బ్రదుకు లోన కాదు కాదు.

### విజయం

అభ్యుదయము కొరకు అవసరంబే కొంత
    బ్రదుకులో మనకు పరాజయమ్ము;
వేయ వచ్చు పతన బీజముల్ విజయమ్ము !
    బహూ పరాకు బహూళ ప్రాక్ హుషారు.

### నిజము

నిజము దేశ కాల నిష్ఠమై - భాసించు,
    పాత్ర నిష్ఠ మగుచు పరగు చుండు;
జనులు బ్రదుక వలయు సాపేక్ష జగతిలో
    లేదు లేదు సత్య మేది లేదు.

### పెండ్లి కూతురు

కావలె నొక చిన్న కారుతో ఒక మేడ,
    కూర్మి తెల్ల బొచ్చు కుక్క పిల్ల;
పేర్మి వరున కొక్క పెద్ద ఉద్యోగమ్ము;
    కోరుకొనును పెండ్లి కూతు రిపుడు.

హాస్యం

కాదు హాస్య మనిన - గంద్ర గోళ్లలి ప్రేటు !
వేడి గరిట వాత పెట్ట రాదు;
గురిని చూచి కొట్టు గొప్ప రబ్బరు కత్తి,
రక్త పాత రహిత రమ్య చర్య.

ప్రగతి

వేరు వేరు విరులు వికసింప కవి లోన,
గాలి - పర పరాగ ధూళి తేలు;
సంగమింప వివిధ సంస్కృతుల్ హృదిలోన,
ప్రగతి అవతరించి పరమలించు.

చిత్త శుద్ధి

చదువు పదవి కంటె - సామర్థ్యమున కంటె,
చిత్త శుద్ధి మేలు జీవితమున,
త్రికరణ పరిశుద్ధి ఒకటె చాలును చాలు,
బ్రదికి యుండి ముక్తి పడయ వచ్చు.

కల

కనులు మూయ నాకు కల వచ్చి కన్పించె;
కడలి అలలు పాల కడలి అలలు,
నింగి నేల కలిపె - నిభృత శుభ్ర జ్యోత్స్న;
ఎడద ఈదె పాల కడలి తేలి.

గార్హస్థ్యం

గౌరవింప దగును గార్హస్థ్యమును ఎంచి,
అగ్ర గణ్య మనుచు - అవని లోన,
ఉర్వి లోన ఉత్తమోత్తమ గ్రంథమ్ము;
తరచి చూడ భారతమ్ము సుమ్ము.

ప్రలోభం

ఇవ్వ వచ్చు మేటి తృప్తి జీవితములో
లొంగ నప్పు డొక ప్రలోభమునకు
అంత కంటె హెచ్చు ఆనందమును పొందు;
లొంగి నప్పుడా ప్రలోభమునకు.

గానం

ఆది భౌతికమ్ము నధ్యాత్మ తత్త్వమ్ము,
కలుపు వంతెన గద గాన విద్య;
కలిసి – పుడమి కవలి వెలుగులో వర్ధిల్లి,
కళలు గొప్ప లౌను కర్త కంటె.

దేవుడు

మనిషి – దేవు మాట – మరచి పోవుట మేలు
మరువ రాదు సాటి మనిషి మాట;
జీవితమ్ము లోన దేవతార్చన వద్దు.
చేయ వలయు మనుజ సేవ సతము.

స్వస్తి

సభల కేగు నపుడు శాంతి పాఠము పాడి;
స్వస్తి చెప్పినాను వాదనలకు;
సమయము గడిపెదను సాహితీ గోష్ఠిలో,
సహృదయు లరుదెంచి చర్చ చేయ.

రాజహంస

వలచి వచ్చె వనిత – స్వర్ణ కల్హారమ్ము !
పిట పిట ఒడ లెల్ల పేర్మి మిగుల;
పుడమి మీద వ్రాలె ముడిచి రెక్కలు రెండు
అరసినాడ రాజ హంస నేడు.

సుఖదుఃఖాలు

కన్నె మెడ కొకందు కట్టు మాంగల్యమ్ము;
చిచ్చు పెట్టు కొడుకు చితి కొకందు;
చోటు వేరు వేరు సుఖ దుఃఖములు చూడ,
ఉర్వి జరుగ వచ్చు ఒక్క వేళ.

పద్య కవిత

సరళ మైన పద్య సాహిత్యమే మేలు;
సత్వరమ్ము - ధర ప్రచార మగును;
గోచరింప వచ్చు - గుప్త భాగము కొంత,
ఇనుమడింప వచ్చు ఘనత - తరచు.

అహం

గులక రాళ్ల నేరు కొను బాలకులు గదా;
విశ్వ శిల్ప శాస్త్ర వేత్త లెల్ల;
జ్ఞాన మన మహాబ్ధి - సర్వజ్ఞు లెవరయా ?
మనిషి కహము గిహము పనికి రాదు.

బద్ధకం

సాహితీ రసికుడు - శక్తి సామర్థ్యముల్;
అతని లోన గొప్ప ప్రతిభ - కలదు !
బద్ధకమ్ము కలదు - పర్వత ప్రాయమ్ము;
పతన మయ్యె అతని బ్రదుకు తుదకు.

మనిషి

ధరణి ఎవరి కైన దాసుండు కారాదు,
తిరుగ వలెను మనిషి శిరము నెత్తి;
జగతి లోన నరుడు సచ్చిదానందుడౌ,
విడువ కున్న ఎడల స్వేచ్ఛ నెపుడు.

బ్రదుకు

చావ వచ్చు కొడుకు - చావ వచ్చును తల్లి,
తిండి తినక ఎవ్వ రుండ గలరు ?
గుండె రాయి చేసుకొనక తప్పదు గదా;
బహుళ కష్టములకు బ్రదుకు నెలవు.

కవిత

వాస్తవాలు వదలి - స్వర్గమ్ము - సృష్టించి,
భ్రాంతి లోన ముంచు ప్రజల - కవిత,
జనులు పొంద వచ్చు శాంబరీ సౌఖ్యముల్,
చాలు చాలు కొన్ని క్షణము లైన.

ధ్యానం

ధ్యాన మవసరమ్ము - ఆలోచనకు ముందు;
మనన ముండ వలెను పనులు చేయ;
ధ్యాన యోగ దీప్తి ఆలోచన మహస్సు,
కర్మ యోగమునకు కన్న తల్లి.

పాఠశాల

బాల బాలికలను పాఠ శాలల యందు,
తిట్టి పోయ రాదు కొట్ట రాదు
ప్రస్తుతించి నపుడు పర నిర్వృతిని చెంది,
లేని తోక పెరుగు మానవులకు.

అజ్ఞాన మిత్రుడు

ప్రస్తుతింత్రు నవ్వ వంది మాగధ వరుల్,
పదవి యున్న వారి ప్రక్క చేరి,
ఆప్త హిత సముండు అజ్ఞాత మిత్రుండు;
మొగము ముందు నిలిచి తెగడు వాడు.

స్వేచ్ఛ

మానవ స్వభావ మర్మ మజేయమ్ము
ఈషణాత్రయమ్ము పృథివి నేలు;
మనిషి కీలు బొమ్మ మాయ చేతుల లోన,
స్వేచ్ఛ యేది ? స్వీయ శీల మేది ?

సానుభూతి

చేయ పరులు తాము చేసియున్న పనులే,
కోపగించు వారు కొంద రుంద్రు!
జరుగ మరల అట్టి పొరపాట్లు జగతిలో;
జనులు చూపవలయు సానుభూతి.

సుకవి

హృదిని కడవ చేసి - మెదడు కవ్వము చేసి,
బ్రదుకు ఏడు పురుల త్రాడు చేసి,
విలువ లెల్ల తరచి - వెన్న నీతిని తీసి
పంచి పెట్టు ప్రజకు ప్రౌఢ సుకవి.

కవిత

వ్రాయు టెవరి కొరకు ? గ్రంథాలు కావ్యాలు,
అరయ - స్వీయ తృప్తి కొరకె కాదు;
కవిత వ్రాయ వలె జగద్ధిత వ్రతముగా;
సులభ సరళ సూత్ర సూక్తములుగ.

పాత్ర దాత

స్వీయ సుఖము మరచి - చిత్త శుద్ధిని గల్గి,
పర హితమ్ము కూర్చు పావనుండు;
జగతి లోన బ్రదుకు ప్రగతి వేదాంతియై;
త్యాగయోగి - పాత్ర దాత యగుచు.

### హాస్యం

బ్రదుకు పోరు లందు - పరిహాస కవచమ్ము,
కూర్చగలదు తరమ గొప్ప రక్ష;
అమృత రసము కత్తి అంచుపై పూయుటే;
హాస్య మద్భుత తమ మగు చికిత్స.

### బహుమానములు

చాల వెపుడు సుకవి సన్మానమును చూడ,
రెండు కనులు మరియు రెండు చెవులు!
ప్రతిభ యున్నవారు - బహుమానములు పొంద,
విస్తరిల్లు ప్రగతి విశ్వ మెల్ల.

### మంచి స్వీకరించు

కలిసి పోయి యుండు వెలుగు చీకటి గూడ,
యుగళ శిశువు లట్లు జగతి లోన;
చెడుగు విస్మరించి పుడమి లోపల సదా
ఎంచి మంచి స్వీకరించ దగును.

### కాళ్ళు పిసుకుట

కాళ్ళు పట్టుట ఒక కళ యంచు చెప్పాలి,
హస్త లాఘవమ్ము అవసరమ్ము;
పట్టు ఎక్కు వైన బాధాకరము సుమ్ము;
తక్కు వైన బాధ ఎక్కు వౌను.

### సంఘ జీవి

సంఘజీవి - నరుడు - స్వచ్ఛంద దాసుడే!!
ఒక హుళక్కి - స్వేచ్ఛ - ఉర్వి లోన !
పరుగు లెత్తు - రైలు - పట్టాల మీదనే !
కదల లేదు ఓడ - కడలి లేక.

### అదృష్టం

జరుగు చుండు గొప్ప సన్మానములు పెక్కు
    భాగదేయ మున్న - ప్రతిభ తోడ,
రాదు పెద్ద పదవి - ప్రతిభ మాత్రమె యున్న;
    ఉండ వలె అదృష్ట యోగ ఘటన.

### బలిమి

పెద్ద చేప తినును - పిల్ల చేపల నెల్ల !
    నీటి లోని నగ్న నీతి యిదియె;
నేల మీద ఇదియె నిత్య నూతన నీతి,
    ఎల్ల యెడల రాజ్య మేలు - బలిమి.

### ఇహ నాటకం

జీవితమున పదవి రావచ్చు పోవచ్చు;
    చిత్త శాంతి యుండు శీల మున్న,
ఎట్టి పాత్ర నైన - ఇహ నాటకము నందు,
    వేయ వచ్చు - మమత విడిచి పెట్టి.

### స్వగతం

సభలు వద్దు నాకు సన్మానములు వద్దు;
    ధనము కీర్తి కోరుకొనను ఇంక,
అందు కొనగ కోరె దజ్ఞాత యోగమ్ము,
    కవిత - తప్ప ఐహికమ్ము విడిచి.

### పరిసరాలు

మట్టి యందు లేదు - మనుజు లందున లేదు;
    పరిసరాలు నెరపు - ప్రాభవమ్ము;
భాష - మతము విద్య వాతావరణ గతుల్,
    చూడ వలయు వృత్తి సూక్ష్మ సరళి.

### విద్య

ఆయుధాలు కావు అణ్వస్త్రములు కావు;
దేశ రక్ష కేది దివ్య చర్య ?
విద్య - తీర్చు ప్రజల - స్వేచ్ఛాధిపుల చేసి,
గురువు - ప్రగతి కేంద్ర గరిమ నాభి.

### చేతలు

కొలువ వలెను మనిషి విలువ - చేతల చేత,
మంచి మనసు లోతు లెంచి చూచి;
మాట లాడ వచ్చు మందహాసము చింది;
మరుగు పరచ వచ్చు మనసు - మనిషి.

### బ్రదుకు

హేతువాదమున కతీతముల్ కల లెన్నో,
వలపు మైత్రి బహుళ భావనములు!
తరచ - బ్రదుకు - శుద్ధ తర్క బద్ధము కాదు,
వేరు మెదడు - హృదయ విధము వేరు.

### మతం

నరుల లోన - మతము - నమ్మకమ్ముల నింపి,
హృదయములకు గొప్ప తృప్తి గూర్చి,
విపుల వేధ నింపె - విజ్ఞాన శాస్త్రమ్ము,
నాశనమ్ము చేసి నమ్మకములు.

### ప్రాసం

నీరు వోయు - కవిత - నారింజ కీరు సంజ,
కెంజిరు నవ బోణి - కంజ నయన
అంజలించు పూల కింజల్కములు గాంచి,
ప్రాస కోస మిదియు కూసు పూజ.

వీర మతవాది

మనుజు లందు - వీర మతవాది యెవడయా ?
నీతి గలిగి - త్యాగ నిరతి గలిగి,
ధరణి యెల్ల ఘోర నరకమ్ముగా మార్చి,
తాను స్వర్గ మేగఁ దలచువాడు.

నగటు మనిషి

జ్ఞాని కుండ వచ్చు - జంకు గొంకులు పెక్కు;
పుడమి మీద జయము పొంద లేడు;
తరచు సాహసించి - దర్ప ప్రకర్షతో
జయము గాంచ వచ్చు నగటు మనిషి.

గురువు

జ్ఞాన దాన మిచ్చి - శశ్వదానందమ్ము
కూర్చు కొనును గురువు గుండె లోన,
చెప్పకున్న చదువు శిష్యు నన్వేషించి,
బ్రహ్మరాక్షసు డయి బ్రదుకు గురుడు.

శిష్య దేవో భవ

శాశ్వత మగు విలువ - విశ్వ కల్యాణమే,
కళల ధ్యేయమే జగద్ధితమ్ము;
చిన్మయ విధి యేది ? ''శిష్య దేవో భవ,''
క్రొత్త విలువ విద్య కూర్చు కొనుత.

రోగీ నారాయణో హరిః

నవ్య లక్ష్య మగుత - నారాయణుడు రోగి,
ప్రగతి భేషజమ్ము వైద్య మందు;
వసుధ - ఉచిత విద్య - వైద్యాలు లభియింప
ప్రగతి - అభ్యుదయము ప్రజల కందు.

దాత

సృష్టి శిల్ప మందు శ్రేష్ఠ మైనది ఏది ?
మాననీయ మైన మనుజ జన్మ;
మనుజ జగతి లోన మకుటాయ మానుండు
తరచి చూడ లోక సరణి - దాత.

అన్వేషణ

చేయి జారి పడిన - చిన్ని వస్తువునకై,
ఏను వెదకు చుంటి - ఇన్ని నాళ్ళు;
దొరకె - అంత కంటె దొడ్డ వస్తువు నేడు,
వింత ఇపుడు సుంత వంత లేదు.

అధికారి

అతడు - కాడు - పెద్ద అధికారి మాత్రమే!
మధుర హృదయుడైన మానవుండు;
కరుణ అనువదించి కార్య రూపము నందు;
అవసరమ్ము పట్ల ఆదుకొనును.

ధనం

జీవితమ్ము లోన - చేయ వచ్చును గదా,
ధనము తోడ మంచి పనులు కొన్ని,
దాచ రాదు ధనము - దాన మిచ్చుట మేలు,
చావు తథ్య మెవడు శాశ్వతుండు ?

పట్టుదల

మేలు - మనిషి మార కాలానుగుణముగా;
సతము మారుచుండు సంఘ మందు;
మొండి పట్టుదలలు గుండె నింపగరాదు,
మనసు మార్చు కొనుట మనిషి - హక్కు.

ఘన విజయం

చేయ వచ్చు - మనిషి - చిన్న తప్పులు కొన్ని,
పెద్ద పనులు చేయు వేడి యందు;
కప్పి పుచ్చ గలదు - తప్పు లెన్నిటి నైన,
చాలు ఒక్క ఘన విజయము చాలు.

వరూధిని

వేశ్య గూడ - ఒకని ప్రేమించు మనసార,
పొంగ ప్రణయ రక్తి నింగి పైకి,
మనుచరిత్ర కవిత - అనుభవామృత సిద్ధి;
ఆ వరూధిని నివు డరయ వచ్చు

బ్రదుకు

చుట్టు చూడ తోచు - సువిశాల విశ్వమ్ము,
మెదడు పరిధి దాటు మేటి సృష్టి;
జ్ఞాన మన అనంత సత్య సంశోధనే,
బావి కప్ప వంటి బ్రదు కదేల ?

ఉమ్మడి పిచ్చి

ప్రబలు అప్పుడపుడు ప్రజల కుమ్మడి పిచ్చి,
వచ్చు రాజకీయ పక్ష మొకటి;
కడగి - పెక్కు మంది కష్టాలలో చిక్కి,
పొంద వచ్చు కొంత మంది - లబ్ధి.

ముష్కరుడు

ముల్లు కాడ తోడ - ముల్లు తీయగ వచ్చు;
ముష్కరులను గెల్చు ముష్కరుండె;
వద్దు మూఢు తోడ - వాదోప వాదముల్;
పంపు ముంగిస - పెను పాము పైకి.

ఆచరణము

ఆచరణమ మధ్య ఆదర్శముల మధ్య
బ్రదుకు కోరు సామరస్య సంధి;
ఆచరింప చాలు ఆదర్శ సారమ్ము
నిజము నరయ వలయు నీడ విడిచి.

హాస్యం

తన్ను దానె జీవితమున ప్రేమించుచో,
వింత ప్రణయమునకు అంతు లేదు;
ధరణి లోన కలదె తార్కాణ మేదైన,
హాస్య రసమునకును - అంత కంటె.

రైతు

ధరణి దున్ని - తాను - ధాన్యమ్ము పండించె,
ధన్య జీవి అన్న దాత - రైతు;
చాలు నోటి మాట శీల సంపద చాలు
సంతకాలతో యే ప్రసక్తి లేదు.

కనులు

పెదవి చేయ లేని - విద్యుత్ ప్రబోధముల్,
కన్ను దోయి చేయ గలదు వేగ,
మధుర దివ్య భవ్య మౌన ప్రయోజనల్,
క్షణము లోన కూర్ప గలవు కనులు.

మురళి

గాలి ప్రోగు చేసి గాంధర్వ మాధురుల్,
మురలి దింప గలదు - ధరణి పైకి;
నాద బిందు కళల నాట్యమాడగ జేయు,
కదల వ్రేళ్ల క్రింద - పెదవి మీద.

బేరం

చేరి గట్టు మీద - బేర సారము వేయ
ఏటి నీట చేప లీదుచుండ;
కాల హరణ మేల ? క్రయ విక్రయము ముందు;
పనులు కొన్ని జరుప వలసి యుండు.

పాత్ర దాత

చేరి కూడు నెడల శీలమ్ము చదువులో,
మెదడు హృదియు సంగమించు నేని;
పాత్ర దాత యైన బ్రదుకులో విజ్ఞాని
సృష్టి కతడు మణి కిరీట మగును.

పూజ్యుడు

బోధి సత్త్వ డెవుడు - పూజ్యుండు జగతిలో,
దాత పూజ్య వరుడు త్యాగ యోగి,
పుడమి వీర వరుడు - పూజ్యుండు సర్వదా;
పండితుండు పూజ్యపాదు డగును.

స్త్రీలు

అమ్మ యైన చెల్లె లక్క యైనను గాని,
సౌకుమార్య సంజ్ఞ సంఘ మందు;
సంఘ మందు ఎచట సంతసింతురో స్త్రీలు;
అచట స్వర్గ సుఖము లమర గలవు.

ప్రార్థన

సలుప లేరు హాని శత్రు వర్గము నాకు,
మసల గలను అప్రమత్తుడ నయి;
మెచ్చు కొనుచు చేరు మిత్ర వర్గము నుండి,
బ్రోవ వయ్య నన్ను దేవ దేవ.

మృత్యువు

చావు మీద తప్పు - సర్వత్ర విజయమ్ము
ఆధునిక మనుష్యు డందు కొనియె;
కొంచ వచ్చు గెలుపు - పంచ భూతములపై !
మృత్యువును మనిషి జయింప గలడె ??

అభావ నష్టాలు

అప్పు డపుడు వచ్చు - అభాస కష్టముల్,
మంచి లాభములుగ మార వచ్చు,
మానవులకు కలుగు ఈనాటి కష్టముల్,
కూర్చు వచ్చు రేపు గొప్ప మేలు.

సమాసం

"అమ్మ - అయ్య" నుడుల - వ్యస్తార్థములు వేరు;
అవతరించు కలుప - అద్భుతమ్ము;
గడుసు కలము తెలియు నుడికారముల తీరు
అధిగమించ లేదు - వ్యాకరణము.

కవిత కైపు

కల్లు కంటె హెచ్చు కైపు గొల్పును గదా
కవిత - కృతక కపట ఘనత గూర్చి,
చావు వరకు ఉండు - సన్మానముల నిషా;
బుఱ్ఱ పొంగి పారలి కిఱ్ఱు గొలుపు.

జన సంఖ్య

సంఘ మందు నాడు జన సంఖ్య తక్కువే;
లేరు కూడు లేనివారు నాడు;
పెచ్చు పెరిగి పోయె పృథివి జనసంఖ్య
ఎట్లు లీ సమస్య నెదురు కొనుట.

### చిరస్థాయి

అది యిది యన నేల ? ఎది చిరస్థాయిగా,
ఉండ కోరరాదు - ఉర్వి మీద,
మనుజు మరణ మైన మంగళోపాసనే;
ప్రగతి కొరకు మాత్ర జగతి కొరకు.

### నిద్రాణ ప్రతిభ

అభ్యుదయము చెందు అవకాశ మున్నచో
ప్రతిభ అతిశయించు బ్రదుకు లోన;
తరచు ప్రతిభ యుండు నరుల నిద్రాణమై;
అణగి మణగి పోయి అంతరించు.

### హింస

పచ్చ గడ్డి మేయు బడుగు లేళ్లను చంపి,
బ్రదుక నేల పులులు ? వనుల లోన ?
ఈ ప్రపంచ మెల్ల హింసా విశేషమే !
అర్థ మేమి ? కలదు ? న్యాయమునకు ?

### వెల - విలువ

వివిధ వస్తువులకు వెల కట్ట గలవారు
వేల కొలది కలరు విశ్వమందు;
విలువ నెరిగి నట్టి విజ్ఞాను లున్నచో
వ్రేళ్ల మీద లెక్క పెట్ట వచ్చు.

### లెక్కలు

పనులు జరుగ వలెను - మనసున్న ఏమౌను ?
నోరు చేరకుండ - జారు పండు;
గ్రుడ్లు లెల్ల పొదుగ - కోడి - పిల్లలు కావు,
వేచి - పిదప - లెక్క పెట్ట వలెను.

పాత్రదానం

జీవితమ్ము నందు - శ్రేష్ఠ మైనది యేది ?
ప్రోత్సహించు త్యాగ బుద్ధి గరిమ !
పరమ పుణ్య మేది ? పాత్రదానమె సుమ్ము;
దాన శీల ముభయ తారకమ్ము.

హేతువాదం

బ్రదుకు - హేతువాద బద్ధమా ? సర్వత్ర ??
తారసిల్ల వచ్చు వేరు దారి;
వేరు - హేతువాద వైరుధ్య మది గాదు,
అనుభవైక వేద్య మైన - వెరవు.

సహకృతి

అవసరమ్ము తరచు అన్యోన్య సహకృతుల్,
ధరణి సంఘ జీవితమ్ము నందు,
ప్రతి మనిషి పరోప కృతి పొందు బ్రదుకులో;
ప్రతిఫలమ్ము కాదు పనికి ధనము.

ఛందస్సు

నాద బిందు కళల నాట్య విన్యాసముల్,
మంత్ర వాగతీత మహిమ గలవి,
ఛంద మందు కలదు సామ వేద స్థాయి,
అర్థ పరిధి మించు అధిక శక్తి.

కారయిత్రి

సామ వేద సరణి - ఛందో కవిత లోన,
నాద బిందు కళలు నాట్యమాడు;
జంత్ర వాద్య బృంద సంగీత మయ లయల్,
కారయిత్రి తోడ కలిసి యాడు.

### వత్సరల

మేలు మనిషి మార కాలానుగుణముగా;
సతత మందహాస సాధు ముఖుడు;
స్వాదు సౌమ్య రమ్య శాంతి సంతోషముల్,
పరిసరాల వెల్లి విరియఁ జేయు.

### అపరిచితుడు

ఆప్త దేవ దూత - ఆపత్సమయ మందు,
నిష్క్రమింప వచ్చు - నీతి విడిచి;
అపరిచితు డెవండొ అడుగకుండగ వచ్చి,
సేవ - అదను లోన - చేయ వచ్చు.

### సమగ్ర దృష్టి

అవ్యవస్థితమ్ము - అన్యాయ భరితమ్ము,
సంకుల రణ మయము సంఘ మెల్ల;
వికట కపట వికృత బిందు విస్తారమ్ము;
అవసరమ్ము గద సమగ్ర దృష్టి.

### రంగు గ్రుడ్డి తనం

ప్రాత యుగము లెల్ల పండించు కొన్నట్టి
విలువ లుండ వచ్చు విశ్వ మందు,
రంగు గ్రుడ్డి తనము ప్రాప్తింపకుండగా,
బ్రదుకు దిద్దుకొనుత ప్రగతి శీలి.

### వేత్త

కూర్చ వలెను - జ్ఞాని - క్రొంగ్రొత్త వంతెనల్,
వాద భేషజాల వదలి పెట్టి,
సామరస్య యోగ సంధాతయే - వేత్త;
కలహ భోజనుండు కాడు - వేత్త.

సుకవి

కలుప - సూత్ర ముందు - తులసి పూవుల నెల్ల,
దార మైన జనుప నార యైన !
అది సువర్ణ మైన - అధికమౌ మూల్యమ్ము;
సుకవి యన సువర్ణ సూత్ర ధారి.

బ్రదుకు

ఎంచ మనుజు బ్రదుకు ఎండమావుల వేట,
ఖండ సత్య శకల కర్తనమ్ము !
అహము కంటె జగతి హాస్యాస్పదము లేదు;
నమ్మక మన నాకు నవ్వు కలుగు.

దానం

ఉత్త మోత్తమమ్ము - ఉపవాస పరివస్య,
గొప్ప మేలు - బోడి గుండు కూర్పు;
ఆంతరంగిక శుచి అమరు గానము వల్ల,
ధన్య తరము త్యాగ దాన నిష్ఠ.

తెలుగు పద్యం

నిష్ఠ యుండ వలెను - నైపుణ్యమే గాక,
తెలుగు పద్య రచన సులువు గాదు;
తలపులకు పలుకు బడుల సమ శ్రుతి లయల్
అల్లిక జిగిబిగులు అమరు గాత.

మౌనం

హృదయ కుహర మందు - ఏకాంత మౌనమ్ము;
పుడమి కవలి శాంతి పొదుగ గలదు;
బ్రదుకు దారి వదలి - ప్రతి రోజు ఒకసారి,
మనిషి కవసరమ్ము మౌన దీక్ష.

తెలుగు భాష

మాతృ భాష యనగ మమత మాత్రమె గాదు;
దేశ బాష లందు తెనుగు లెస్స;
శబ్ద భావ సపది సంశ్లేషక విభాష;
పాత క్రొత్త కలుపు సేతు సంధి.

స్వేచ్ఛ

వెల్ల డింప - కవిత - విజ్ఞాన శాస్త్రముల్,
జగతి లోన ఖండ సత్యములనె !
వేగ చెప్ప వలెను వీడ్కోలు గురువునకై;
స్వేచ్ఛ - వీడరాదు శిష్య వరుడు.

పదవి

పదవి వలన వచ్చు - బహు భోగ భాగ్యముల్;
గద్దె కూర్చ గలదు ఘనత లెన్నొ;
ప్రతిభ వలన పడయు ప్రఖ్యాతి వేరయా !
సహజ చాక చక్య శక్తి వేరు.

ఆగ్రహం

ఆగ్రహమ్ము తోడ ఆరంభమౌ పనుల్
చెడును తుదకు తెచ్చు సిగ్గు చేటు;
శాంతి సంగ్రహమప జయ మోర్చు కొనవచ్చు
బ్రదుకులోన తొందర పడరాదు.

కరుణ

కరగి పోయి గుండె పర - దుఃఖమును గాంచి,
కార్చు నెవడు వేడి కంటి నీరు,
మానవోత్తముండు మాన్య ముఖ్యుడు వాడె,
జగతి లోన దేవ సముడు వాడె.

### శ్రీ వివేకానంద

ఓ నరేంద్ర లెమ్ము ఉత్తిష్ఠ జాగ్రత్త !
విశ్రమించుట కిది వేళ గాదు;
దిగ్విజయము నీకు ధ్యేయమ్ము చేరుకో;
బ్రహ్మ విద్య యంతరంగ శుద్ధి.

### అవసరం

అవసరమ్ము మనిషి కాహార్య వేషమ్ము
దేహ రూప దీప్తి తీర్చి దిద్ద.
మేలి నటన అబ్బె మేధః ప్రకర్షలో.
బ్రదుకు లోన అవసరమ్ము కొంత.

### మచ్చలు

బ్రదుక టున్న కొన్ని బాధ లుండక పోవు.
మాయ వచ్చు పుండ్లు - మచ్చ లుండు;
బలము నివ్వ గలవు - భావి బాధల నోర్వ,
అప్పు డపుడు మచ్చ లరయ దగును.

### అభిరుచి

అభిరుచి - శుభ సూచి - అభినివేశము కంటె,
కళకు ఆత్మ - సొగసు మిలమిల మిస,
అభ్యసింప - హెచ్చు అభినివేశము సదా,
పుటకతో అభిరుచి పుట్ట వలెను.

### మనో నయనం

విప్పి కన్ను దోయి వీక్షించుటే - చాలు;
వేత్త అగును మనిషి విశ్వ మందు;
మనిషి విప్పు నెడల తన మనోనయనమ్ము,
ద్రష్ట యగును గొప్ప స్రష్ట యగును.

నటన

సానుభూతి కల్గి సహజ లోపములపై,
ఘనులు కారు సర్వజనులు - జగతి;
అభినయించు నెడల హాస్యాస్పదము గదా !
కోరి - లేని పోని గొప్ప దనము.

లలిత కళలు

లలిత కళల వలన - కలుగు జీవన్ముక్తి;
రాజ్య భోగ భాగ్య భోజ్య మేల ?
సహృదయుండు వీడు ఇహలోక బంధాలు,
గుండె శాంతి దాంతి కూర్చు కొనుచు.

బ్రదుకు

కలుగు జేయు బ్రదుకు - కర్తవ్యములు కొన్ని,
నిర్వహింపఁ దగును నేర్పు తోడ,
బ్రదుక దగును వీడి రాగ విద్వేషముల్,
నరుడు - పాత్రధారి - నాటకమున.

బ్రదుకు

బ్రదుకు - నవ రస రుచిరమ్ము మానవులలో,
రాలు ఆకు లెల్ల - పూలు వాడు;
మసక వెలుగు విరియు మలిసంజ కెంజాయ,
పుట్టు చిగురుటాకు మోడు నందు.

జ్ఞాని

వాడ వలెను మెదడు నేడు మానవు లెల్ల,
వెల్లి విరిసె జ్ఞాన విజ్ఞవమ్ము;
పాత రోత కెల్ల - స్వస్తి పాఠము పాడి,
కొత్త ప్రొద్దు పొడుపు కోరు - జ్ఞాని.

నా నీతి

ఇరువది రూకల మేరకు
పరులకు మేలు కలుగు నెడ - పది రూకలు నే
సరవిని దానము సలుపుట
పరిపాటిగ నా బ్రదుకును పరిపాలించెన్.

బ్రదుకు

బ్రదుకు - గణిత శాస్త్ర బద్ధ వృత్తము గాదు;
బ్రదుకు వెలుగు నీడ పడుగు పేక;
వ్యాఖ్య కంద నట్టి అన్యోన్య వైరుధ్య
భావ ధూమ తిమిర బంధురమ్ము.

మౌనం

మౌనమునకు ఉన్న మహిమ మాటకు లేదు;
పండితునకు వాక్కు వశము గాదు;
పెదవి కదల జేయు - హృది లోని లోపమ్ము;
జ్ఞాని యెవడు ? మధుర మౌన యోగి.

కవిత

పదుగు రాడు మాట పద్యమై వర్థిల్లు;
అనుభవమ్ము కవిత కాయు విచ్చు;
అమృత కవిత పుట్టు - అనుభూతి వల్లనే,
గణిత విద్య - కవిత కాదు కాదు.

చప్పట్లు

సభల మ్రోగు నపుడు చప్పట్ల దొంతరల్
ఎంచ రాదు వక్త దంచు ఘనత,
ప్రతిభ కేది ఋజువు ? ప్రత్యక్ష సాక్ష్యమ్ము ?
శ్రోత - గ్రహణ శక్తి - శోభ సభకు.

సంగీత కళ

సరిగమపదనిసల స్వారస్య సారముల్,
గాన తాళ రాగ గతులు జతులు,
సాంప్రదాయిక మగు సంగీత కళ మార్పు,
సామరస్య యోగ శాంతి నిధులు.

బ్రదుకు

బ్రదు కటన్న మేటి చదరంగ పాటయే,
చాతురీ వినోద సంగమమ్ము;
బ్రదుకు లాభ నష్ట పర్యస్త లీలయే !
వెలుగు నీడ గర్ల వింత నేత.

తల్లి

నాస్తికుండు కాడు ఆత్మ జీవితములో,
అమ్మ ప్రేమ తెలిసి నట్టి వాడు;
అమ్మ ప్రేమ ఆత్మ కమృతాభిషేకమే,
తల్లి కనుల గట్టు - దైవ దీప్తి.

స్వేచ్ఛ

భాష - సీమ - మతము బంధు జాలము మధ్య,
జనన మందు - మనిషి సంఘజీవి;
స్వేచ్ఛ ఏది ? పెద్ద చెఱసాల జగ మెల్ల!
కలవు శృంఖలాలు కాన రావు.

శృంగార రసం

పొంగు వారు పాలు శృంగార రస మన్న,
నింగి కెగసి పడును నేల మీద;
కవన రచన - నిశిత ఖడ్గ ధారా దీక్ష
''వలపు'' తోన జారు పాటు లుండు.

రాజకీయాలు

చటు నినాద గర్జ - సభలు ఊరేగింపు,
కుటిల మంత్ర తంత్ర కూట సృష్టి
డాబు దర్పములు పటాటోప జృంభణల్,
నేటి రాజకీయ నీతి విరతి.

సభాపతి

ప్రగతి చిహ్న మేది ? క్రమ శిక్షణయె సుమా,
శీలమునకు విజయ సిద్ధి అదియె,
తాల్చ వలెను తలను - తమ సభాపతి పల్కు
పార్లమెంటు మేలి బంతి ప్రజకు.

అధిక్షేపం - 1

ఎవరి నైన మనము - ఎత్తి చూపుట తప్పు;
వెక్కిరించి ఒక్క వ్రేలు మోపి,
ముడువ వలసి వచ్చు - ముందుగా మన వైపు!
మూర్ఖ విరతి తోడ - మూడు వ్రేళ్ళు.

2

ఎపుడు తెగడ రాదు - ఎవరి చర్యను గాని
హత్య చేయు వాని నైన గాని;
తలప మనము అతని స్థానమ్ములో లేము;
నరుడు - తప్పు చేయ - వెరచు తరచు.

3

జగతి దేని నైన - తెగడ న్యాయము గాదు,
అవసరముల బట్టి - అమరు నన్ని;
క్రొత్త స్థితి గతి కనుగుణముగా సంస్కర్త
కోర వచ్చు మార్పు ప్రగతి కొరకు.

### మిథ్య

అద్ద మందు తోచ దసలు రూపము గదా,
మిథ్య సృష్టి యెల్ల మేటి మిథ్య,
ఈ ప్రపంచ మెల్ల ఎడము బింబము సుమ్ము;
కడకు చూడ వచ్చు ''కుడిని'' జ్ఞాని.

### మంచితనం

ఎడద చేర్చు గాత - పుడమి కవ్వలి వెల్గు;
మట్టి లోన పుట్టి గిట్టు మనిషి,
కాదు - బ్రదుకు - పొట్ట కకుర్తి మాత్రమే !
మనిషి చూడదగును మంచి తనము.

### గురువు

నియమ నిబిడ నిష్ఠ - నిర్బంధ శిబిరాలు,
ఆశ్రమాలు - స్వేచ్ఛ నవహరించు;
ఒక నియంత గురువు - ఉద్దండ పిండమ్ము;
సౌమ్య చతుర చండ శాసనుండు.

### నవల

చరిత రచన లోన సత్యమ్ము స్వల్పమ్ము !
అరయ నిజము నవల కంతరాత్మ;
కాదు నవల - శుద్ధ కల్పనా కథ గాదు;
నవ రస రుచిరమ్ము నవల నేడు.

### ఉదధి రత్నాలు

మట్టి పొరల మణగి మాణిక్యముల్ దాగు;
గాలి కలియు అడవి పూల తావి;
ఉండు లోతు లందు ఉదధిలో రత్నాలు;
తెలియ బడక విలువ గలవి ప్రగ్గు.

అచ్చులో

ఆదరింప నేల ? అచ్చులో కన్పింప ?
వ్రాయ వచ్చు తప్పు గ్రంథకర్త;
తరచి అంతరార్థ మరసి ఆలోచించి;
తీర్చి దిద్ద వచ్చు తీర్పు తుదకు

రిబెకు

రిబెకు తోడ – అనుసరింపగా మర్దాన,
జ్ఞాని గురువు పాడె నానకుండు;
నాద బిందు కళల నాట్య శ్రుతులు లయల్,
జ్ఞానమునకు – ఆత్మ సమ్మితమ్ము.

లలిత కళలు

లలిత కళలు కూర్చు వలె రస స్నానమ్ము,
ఎడద మెదడు గూడ కడగి కడగి,
గుండె నిండ రాదు – గుడ్డ గూబల పెంట,
మురికి – బూజు – కిలుము ముండ్ల పొదలు.

పరామర్శ

దుఃఖితులను డాసి – తోడు నీడగ నిల్చు
మానవత్వ మున్న మంచి మనిషి;
మాట లాడి గాని – మౌనమ్ముతో గాని
కూర్చు ఊరడింపు కొంత కొంత.

అమెరికా

అమెరికా యటన్న ఐదంయుగీనమా
సర్వ సంస్కృతులకు సంగమమ్ము;
జాతి మత వితతికి స్వాతంత్ర్య సంక్రాంతి;
భిన్న సంహితైక్య బృందగీతి.

ముక్తి

మానవులకు అరయ ఆనందమే బ్రహ్మ !
ఇవ్వ గలదు స్వీయ తృప్తి - ''ముక్తి''
జీవితమ్ము నందు కైవల్య పద మేది ?
సంఘ సేవ చేయ స్వార్థముడిగి

కువిమర్శ

కూర్చి గూడ దెవుడు కువిమర్శ జగతిలో;
వెదక దగును కడగి వెలుగు కొరకు,
మంచి మీద వాలు మనుజు కన్నులు వేరు,
ఈగ వేరు తేనె టీగ వేరు.

చెట్టు - తీగ

నింగి నేల మధ్య నిక్కి నిల్చును చెట్టు;
పట్టు దొరుక చాలు ప్రాకు లతలు;
మనుజు లందు కలరు మగవారిలో గూడ;
తెలియ చెట్లు లతల తెరగు వారు.

కవి హృదయం

కవిత కోరు ప్రగతి - కాంక్షించు అభివృద్ధి;
అంత తప్పు గాదు అతిశయోక్తి;
అర్థవాద రూప మభిభాషణము సదా !
అవధరింప వలెను కవి హృదయము.

జ్ఞాన మౌనం

జ్ఞాన మిచ్చు నట్టి మౌనమ్ము మధురమ్ము,
గర్వ తిమిర గరిమ కాక యున్న;
ఆత్మ గౌరవమ్ము నతిశయింపగఁ జేయు;
ఠీవి నిచ్చు తెలివి ఠావి గూళ్ళు.

యశం

కలరు లోకమున ముఖస్తోత్ర పాఠకుల్;
ఒకరినొకరు పొగడుకొనెడి వారు;
హాస్య రసమున కది అగు దోహదము సదా;
ఆ స్వయం ప్రకాశ యశము వేరు.

కామ దహనం

ఘన తమమ్ము సుమ్ము కందర్ప దర్పమ్ము !
ఎదురు నిలుచు వార లెవరు గలరు ?
లేదు మనుజు లందు లేదు మూడవ కన్ను;
కామ దహన మన్న కష్ట తమము.

కొలతలు

చలన చిత్ర మందు కొలత లున్నవి రెండు;
కలుగు భ్రాంతి మూడు కొలత లట్లు;
పెక్కు కొలత లున్న పృథివిపై ఉన్నాము;
కలవు తెలియ నట్టి కొలత లెన్నొ.

కవిత

ఒక నిషా పసందు ఒక జాగ్రత సుషుప్తి !
తీపి కలలు అలలు రేపు - కైపు,
స్ఫూర్తి దీప్త గుప్త వృత్త చైతన్యమ్ము !
దివ్య రస సమాధి తీర్పు - కవిత.

సహృదయత

గొప్ప దనము చూచి గుర్తు పట్టెడు వాడు
గొప్ప వాని కంటె గొప్ప వాడు;
అరసి తరచ ''రసము'' యన్నిష్ఠమై యుండు ?
సహృదయమ్ము దాని స్థావరమ్ము.

గాయకునితో

నేను – నా కవితలు నీ నోట విన్నాను;
సభల హర్షనాద సమ్మిళితముగ;
పద్య కవిత – సర్వ వాద్య సమ్మేళమై,
తావక గళ మందు తాండవించు.

తుమ్ము

అరయ తుమ్మటన్న – ఆరోగ్య చిహ్నమే !
స్వస్తి చెప్పు అవయవాల గూర్చి;
తోచు చుండు – సపది దుందుభి ధ్వానమై;
ప్రక్క నున్న వారు భయము చెంద.

ధర్మం

ధరణి లోన సతము ధర్మమ్ము నెగ్గునా ?
మంచితనము తరచు క్రుంగి చుండు,
విశ్వ మందు కలవు విధి వైపరీత్యముల్ !
ధ్యేయ మేది ? నేల న్యాయ మేది ?

చేతలు

నీతి బోధ నూరు శాత ముండగ వచ్చు;
నీతి చూపదగును చేత లందు;
మంచి పనులు చేయ మౌనవ్రతము తోడ,
రక్తి కట్టు మనుజా బ్రదుకు లెల్ల.

హేతువాదం

బ్రదుకు లోన హేతువాద మాగిన చోటు;
ధ్యాన యోగమునకు తావు కలదు;
మొదట హేతు వాదమును కాదనుట తప్పు;
మూఢ భక్తి కంటె ముప్పు లేదు.

చదువు కాదు

బ్రదుకు లోన - గుండె పండించు కొనుటయే !
ఘనత యనిన పట్టి కవిత కాదు,
పొంచి మంచి దనము నెంచి గుర్తించుటే;
చదువు కాదు మేటి పదవి కాదు.

నమ్మకం

అభ్యుదయము కల్గు - వ్యాపార సరళిలో,
మాట నమ్మకమ్ము మంచి నీతి,
కలియ రాదు నలుకు గాలిలో ధూళిలో
సమయ పాలనమ్ము సలుప దగును.

కువిమర్శ

క్రొవ్వు వత్తి నైన - కువిమర్శ జగతిలో,
వెలుగ కుండ ఆర్పి వేయ లేదు !
సుప్రసన్న సుభగ సుకుమార హృదయుడౌ,
కవి ప్రతిభను చంప గలదు - తరచు.

తల్లి ప్రేమ

తల్లి చూపు ప్రేమ - తన కన్న బిడ్డపై;
స్వీయ కవిత పైన ప్రేమ - కవికి !
పరుల కవిత మీద - పరుల బిడ్డల మీద,
ప్రేమ చూప ఋషి వరేణ్యు డౌను !

విమర్శ

మనిషి చేయు ఏ విమర్శ యైనను గూడ,
స్వీయ చిత్త వృత్తి వెల్లడించు,
తరచు నిజము కాదు - పరుల గూర్చిన మాట,
చెడ్డ - పరుల గూర్చి - చెప్ప రాదు.

స్వేచ్ఛ

రంగు గ్రుడ్డి తనము రారాదు - బ్రదుకులో,
తలపు లందు ఊహ మలుపు లందు,
తన మనస్సు నెచట తాకట్టు నిడరాదు,
స్వేచ్ఛ - మనిషి యెపుడు వీడ రాదు.

ద్వేషం

ఉండ వచ్చు - ద్వేష మువకారిపై గూడ,
మారు మూల దాగి మనసు లోన,
తప్పు - జగతిలో కృతఘ్నులే తలపగా
సతము తలువ వలయు కృతము - మనిషి.

గురువు

బహువిధ కష్టములను భరియింప గల శక్తి
కలదు మనిషి గుండెకాయ దాగి;
గురువు కూర్చ వచ్చు - దురదృష్టముల నెల్ల
తట్టు కొనెడి తత్త్వ దర్శనమ్ము.

స్వేచ్ఛ

స్వేచ్ఛ లేని యెడల - చెఱసాలయే ఇల్లు !
కుదువ బెట్ట రాదు మెదడు నెచట,
వ్యక్తు లందు ఎవరి అనుభూతి వారిదే !
గురువు వద్దు బడులు గుడులు వద్దు.

ముఖ్య కర్తవ్యం

మొదట నరుని కేది ? ముఖ్య కర్తవ్యమ్ము
''అది బ్రదుకు తెరువు తూచ వలెను''
ఆచరణము నందు ఆదర్శ సూత్రాలు
వెట్టి తలలు వేసి విఫల మగును.

### మనసు

స్నాన పానములకు - సరిపోని నీరమ్ము
నడవు - ఆవి రైన యెడల - రైళ్ళు;
అదిక శక్తి పుట్టు - అణువు బ్రద్దలు కొట్ట,
మనిషి మనసు గొప్ప మహిమ గలది.

### అడుగు జాడలు

మరణ మంది గూడ - తరువాత జగతిలో
బ్రదికి యుండ దలతు హృదయ మందు,
చెడక నిలిచి యుండు అడుగు జాడలు కొన్ని;
అన్ని శాఖ లందు - అవని లోన.

### సుందరయ్య విజ్ఞాన కేంద్రం

వెలసె - సుందరయ్య - విజ్ఞాన కేంద్రమ్ము;
గరిమ నాభి లలిత కళల కౌచు,
జంట నగర ములకు సంస్కృతి క్షేత్రమ్ము,
అరయ తెలుగు వెలుగు కాట పట్టు.

### రక్త కణములు

అణగి యుండ వచ్చు - అంతర్నిబిడముగా,
రక్త కణము లందు - ప్రతిభ తరచు,
అదను దొరికి వచ్చు డాకస్మికమ్ముగా,
ప్రజ్వరిల్లు మనిషి బ్రదుకు లోన.

### దేవుడు

మనసు నమ్ము నెడల మనుజుడే దేవుండు,
కలవు దివ్య చిహ్నములు ధర పయి,
స్రష్ట మహిమ గూర్చి - సందేశములు తెల్పు,
పూజ లోన చేరు పువ్వు లెల్ల.

నేను కాదు

ఏను కాను రామ కృష్ణమాచార్యుండు,
క్రాంత దర్శి యైన కవిని నేను,
ఉర్వి కవల వెలయు జ్యోతిర్మయుడ నేను,
చిత్త శుద్ధి యున్న - చిన్మయుండ.

సహనము

మనుజు లందు గొప్ప గుణ మేది ? సహనమే
లేదు పూర్ణ సత్య మేది లేదు.
క్షమను చూపె నేని శత్రువర్గము పైన,
అత డధిమనుజుడె అవనిలోన.

త్రివిక్రముడు

జన్మ సహజముగనె - స్థాయి భావము లట్లు
కొన్ని ప్రజ్ఞ లమరు కొందరకును;
అతిశయించు ప్రజ్ఞ - అత్యద్భుతమ్ముగా,
పిదప వామనుడు - త్రివిక్రము డగు.

మనిషి మెదడు

మనిషి మెదడు మహిమ గణిత గణ్యము కాదు;
కలవు అరలు కోట్ల కొలది కలవు;
కడలి కంటె లోతు - గగనమే ఎత్తులో,
మనిషి మెదడు సాటి మనిషి మెదడె.

రేపు

నిన్న లెన్ని చేర్చ నేటితో సరి గావు,
నిష్ఠ యుంచ దగును ''నేటి'' మీద,
జగతి లోన - ''రేపు'' - స్వప్న సంకాశమే,
మనిషి బ్రదుకు వర్తమాన మందు.

సహనం

సహన గుణము శాంతి సౌఖ్యాల రహదారి,
జ్ఞాన శిల్పమునకు - ప్రాణ నాడి;
సహన శీలమునకు - సామ్యవాదము తోడ,
మైత్రి పొసగు గాత - ధాత్రి మీద.

వివేకం

ఎంత జ్ఞాన మున్న - ఏమి లాభము కల్గు ?
లేక యున్నచో వివేక గుణము ?
రత్న మొకటి మేలు - రాళ్ల సంచుల కంటె,
గూని మూపు తాల్చు గొప్ప బరువు.

దైవం

చెప్పు దైవము తన జేబులో ఉన్నట్లు,
గురుడు - నమ్మ శిష్య వరుల తోడ,
ఎవరి జేబు లోన ఎటు లుండు దేవుండు ?
గాలి కాదు - బూది ధూళి కాదు.

ధనం

జగతి కెల్ల మూల మగు గాత సర్వత్ర
ధనము వలన కాని పనులు గలవు;
ధనము ప్రేమ భక్తి కొనలేదు బ్రదుకులో;
ధనము కృత్రిమత్వమునకు నెలవు.

జాలి గుండె

నీతి యేది ? ఏది నిగమార్థ సారమ్ము ?
పరమ ధర్మ మేది ధరణి మీద ?
చదువు మెదడు మేటి పదవి ఏదియు కాదు !
గొప్ప దేది ? జాలి గుండె తప్ప.

కవి

కవి వరేణ్యు డన్న - కార్య శూరుడు - కాడు,
కలదు పిచ్చి గుబులు కవిత లోన,
అప్రయోజకు డగు ఆదేశ సంచారి
స్వప్న భోజనుండు - స్వచ్ఛ సుకవి.

ఆకులు - వేళ్ళు

వెదకు కొనుచు వెలుగు - ఎదుగు ఆకులు చెల్లె;
వేళ్లు చీకటులను వెదకు కొనును,
ఉండి రెండు ప్రకృతు లొక్క వృక్షము నందె;
వేరు దారు లందు వృద్ధి పొందు.

ధన బలం

ఇది కలి యుగము మరి - ఇది ధన స్వామ్యమ్ము;
పోర గలుగు బీద వారు లేరు !
ధన బలమునకు ప్రజ - దాసోహ మన్నారు !
ధరణి ఇక ధనికుల దయయె చెల్లు.

ధనం

బ్రదుకు లోన గొప్ప బలవర్ధకం బేది ?
కాదు శక్తి యుక్తి కాదు ప్రతిభ,
సర్వ లోప దోష సముదాయముల మాపు
ధనము కలుగ చాలు మనిషి గెలుచు.

పరిమళం

పూవు లంద కుండ పోవచ్చు లత పైన;
చాలు పరిమళములు సహృదయునకు;
దూర మేగు బాటసారి సంతసముతో
విరుల సొగసు లనుభవింప వచ్చు.

మతం

చేసె - మతము - జనుల జీవచ్ఛవాలుగా
మనుజ శక్తి రూపు మాప చేసి,
వెరసి మతము లెల్ల - మరణాంతకమ్ములే !
మతము మరణ మొంద - మనిషి బ్రదుకు.

కవిత

కవిత వ్రాయ లేడు - కఠినాత్ముడౌ వాడు.
కరగు నట్టి గుండె కాయ - కవిత;
గాలి అలలు చాలు - కదలు పూగుత్తియే,
కవిత - బండ రాయి కాదు కాదు.

ధనం

దేహ సౌష్ఠవమ్ము - తేజస్సు వర్చస్సు;
తెలివి తేటలకును విలువ లేదు;
ధనము ధాటి గెలుచు ధరణిలో పోటీలు
అంతరించు గాత - ఆస్తి హక్కు.

నవల

ఎవ్వ రెక్క గలరు ? ఎవరెక్క శిఖరమ్ము ??
కోరు పద్య కవిత గొప్ప మేధ,
సహృదయునకు నవ్య సందేశ మందించ
నవల వ్రాయ దగును కవి వరుండు.

త్యాగ రాజ సభ

జంట నగరములకు - సంస్కృతి క్షేత్రమ్ము,
గరిమ నాభి లలిత కళల కెల్ల;
వెలుగు కోరు హృదికి విశ్రాంతి సత్రమ్ము
ప్రణుతి నతులు - త్యాగరాజ సభకు.

నిస్స్వార్థము

మనుజుడు చేయును తరచుగ
 పనులెన్నో స్వార్థ బుద్ధి బ్రదుకుంట కొరకై;
పని ఒకటి చేసిన చా
 లును స్వార్థము విడిచి సర్వ లోకము మెచ్చున్.

ఫలశ్రుతి

గుండె - ఉండవచ్చు - గొంగళీ పురుగుగా;
 రస సమాధిలోన - బ్రదుకులోన;
వినిన యెడల - ''కచ్ఛపీ కింకిణీకమ్ము''
 గుండె అగును ''సీతకోక చిలుక!''





**కృతిపతి**

శ్రీ కళ్లెపు సాగర రావు దొరగారు

ధర్మపత్ని శ్రీమతి సరోజిని గారు